

ఆధునిక చిత్రకళా రీతులు
రూ॥150/-
పేజీలు:150
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ


రూ.10వేల కోట్లతో ఏడు రైల్వే కారిడార్లు

గత ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి రూ.1,473 కోట్ల విరాళాలు

కాంగ్రెస్ కంటే ఏడు రెట్లు అధికం

07


సంపుటి 29, సంచిక: 82 | గురువారం | 10 -09-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


### అసెంబ్లీ సమావేశాలు జరగకుండా...

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర



- బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఆ పార్టీ అధినేత కెసిఆర్ ఉసిగొల్పారు
- అందుకే స్పీకర్‌పై దూషణలు, దాడులు
- శుద్ధీకరణ సహా అన్ని ఘటనలపై సమగ్ర విచారణ
- అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- విచారణకు విచారణ అధికారిగా హైదరాబాద్ నగర సంయుక్త పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫామ్‌హౌస్‌లోజరిగిన సమావేశం నుంచి స్పీకర్‌పైన చేసిన వ్యాఖ్యలు, పోలీసు అధికారులపైన దాడులు, దళిత వర్గాలు నిరసన వ్యక్తం చేసిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం ఇలా అన్ని సంఘటనలను క్రోడీకరిస్తూ ఈ ఘటనలకు ప్రత్యక్ష, పరోక్షంగా కారకులైన వారందరిపైన సంపూర్ణ విచారణ చేపట్టి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, వారిని జైలుకు పంపిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. సెక్షన్ 3(1) ఆర్ ప్రకారం, దళితులను ఉద్దేశపూర్వకంగా బహిరంగంగా అవమానపర్చడం,కించపర్చడం,సెక్షన్ 3 ప్రకారం (1)యు ప్రకారం దళితులపైన విద్వేషపూరితమైన వివక్ష ప్రదర్శించడం, సెక్షన్ 352 శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, సెక్షన్ 353 (2) రెడ్ విత్ 3/5 ప్రకారం ప్రజలలో విద్వేషాలను, అల్లర్లను రేకెత్తించడం లాంటి సెక్షన్ల ప్రకారం దళితులపైన అణచివేతలు, అమానుషాలు,దురాగాతలకు పాల్పడే వారు ఎంతటివారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని.ఇందుకు సిద్ధిపేట కమిషనర్‌గా పని చేసిన హైదరాబాద్ నగర సంయుక్త పోలీసు కమిషనర్ విజయ్ కుమార్‌ను పర్యవేక్షణ అధికారిగా తరువాయి 8లో



కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద శుద్ధీకరణ చేస్తున్న దృశ్యం

# ‘శుద్ధీకరణ’పై దద్దరిల్లిన అసెంబ్లీ

- ఎర్రవల్లిలోని కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళిత ఎమ్మెల్యేలు, దళిత సంఘాలు నిరసన ప్రాంతాన్ని బిఆర్‌ఎస్ నేతలు శుద్ధి చేయడంపై దుమారం
- సభ్య సమాజానికే అవమానకరం : భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్

‘శుద్ధీకరణ’ అంశంపైన శాసనసభ దద్దరిల్లింది. ఎర్రవల్లిలోని కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళిత ఎమ్మెల్యేలు, దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేసిన ప్రాంతాన్ని బిఆర్‌ఎస్ నేతలు పసుపు నీళ్లతో శుద్ధి చేసిన అంశంపైన శాసనసభలో బుధవారం పెద్ద దుమారం రేపింది. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేత కెసిఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ దగ్గర చావు డప్పు కొట్టడంపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష బిఆర్‌ఎస్ సభ్యులు పట్టుబట్టారు. శుద్ధీకరణ అంశంపై చర్చ జరపాలని మంత్రులు కోరారు. దీంతో శుద్ధికరణ అంశంపై అధికార, ప్రతిపక్షసభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం, విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటుచేసుకున్నాయి. ‘వి వాంట్ జస్టిస్’ అని నినాదాలు చేస్తూ బిఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ పోడియంను చుట్టిముట్టి సభా కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో మంత్రులు, బిఆర్‌ఎస్ సభ్యుల పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ దద్దరిల్లింది. ‘శుద్ధీకరణ’ సంఘటన పట్ల ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన వ్యక్తం చేసిన ప్రాంతాన్ని శుద్ధి చేయడమంటే దళితులను అవమానపరచడమేనని వారు తరువాయి 8లో

## శాసనసభ నుంచి బిఆర్‌ఎస్ సభ్యుల సస్పెన్షన్

కెటిఆర్, హరీశ్‌రావుతో సహా 22 మంది ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసిన స్పీకర్ గడ్డం

శాసనసభ నుంచి బిఆర్‌ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యారు. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నందుకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఈ మేరకు బిఆర్‌ఎస్ సభ్యులు కె.టి.రామారావు, టి.హరీశ్ రావు, జి.జగదీశ్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి , కొనికంటి మాణిక్ రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, తరువాయి 8లో

### దళితులను ‘శుద్ధీకరణ’ పేరుతో అవమానించడం

# అత్యంత హేయమైన చర్య

### సర్వసమానత్వం విచ్ఛిన్నానికి కుట్ర

- కుల వివక్షకు చరమగీతం పాడేలా కఠిన చట్టాలు తీసుకురావాలి
- వ్యక్తిగత దూషణలు, పిండప్రదానాలు ఆపాలి
- సభను సజావుగా నడిపించేందుకు స్పీకర్ చర్యలు చేపట్టాలి
- స్పీకర్‌కు సిపిఐ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



ఆత్మగౌరవమే లక్ష్యంగా వందల ఏళ్ల సామాజిక సంస్కరణల ఫలితంగా సాధించుకున్న సర్వసమానత్వాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర జరుగుతోందని సిపిఐ శాసన సభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభలో బుధవారం కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతున్న దేశంలో దళితులను ‘శుద్ధీకరణ’ పేరుతో అవమానించడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇలాంటి కుల వివక్షకు చరమగీతం పాడేలా కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంటరానితనం, వెట్టి వంటి దురాచారాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల ఫలితంగానే సమాజం ముందుకు వచ్చిందని, అంబేద్కర్ నేతృత్వంలో సమానత్వాన్ని ప్రాతిపదికగా చేసుకుని రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని తెలిపారు. అంబేద్కర్ విగ్రహాలు పెట్టి, ఆయన జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తూ మరోవైపు ‘శుద్ధీకరణ’ పేరుతో దళితులను అవమానించడం ఏలాంటి సాంప్రదాయమని ప్రశ్నించారు. దేశం రాజ్యాంగబద్ధ పాలనలో ఉందా, మనుస్మృతి ఆధారిత వ్యవస్థలో ఉందా అనే అనుమానం కలిగే విధంగా ‘శుద్ధి’ పేరుతో జరుగుతున్న ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఒక వైపు ఖర్గే ఆలయానికి వెళ్లిన సందర్భంలో శుద్ధి చేశారన్న వార్తలు, మరోవైపు దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయాలని స్వయంగా తరువాయి 8లో

# ‘యూరియా బుకింగ్ యాప్’ను తక్షణం రద్దు చేయాలి



- శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్
- యాప్‌లో సాంకేతిక సమస్యలపై రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన
- ఎల్‌నినో ప్రభావం రైతులపై పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా బుకింగ్ యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని, ఈ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నెల్లికంటి సత్యం ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లో సాంకేతిక లోపాలు, సర్వర్ సమస్యలు, ఓటిపి ఆలస్యం, బుకింగ్ సమయంలో యూరియా స్టాక్ వెంటనే అయిపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్మార్ట్ ఫోన్ వినియోగంపై అవగాహన లేని చిన్న, సన్నకారు రైతులు యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడం మరింత కష్టంగా మారిందని పేర్కొన్నారు. బుకింగ్ చేసేందుకు ప్రయత్నించేలోపే స్టాక్ పూర్తయినట్లు చూపిస్తుండటంతో రైతులు రోజుల తరబడి ఎరువుల తరువాయి 8లో



### దళితులు, మహిళల గౌరవం, భద్రతకు

# భరోసా కల్పించండి

- ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- గవర్నర్‌కు డిప్యూటీ సిఎం ఆధ్వర్యంలో మంత్రుల వినతిపత్రం

ప్రజాపక్షం/ హైదరాబాద్

శాసనసభ ప్రాంగణంలో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అసెంబ్లీ వెలుపల పోలీసులతో ఘర్షణకు దిగడం, దళితులు నడిచిన రహదారులను పసుపునీళ్లు, పాలతో శుద్ధి చేయడం వంటి ఘటనలతో బిఆర్‌ఎస్ తన దళిత వ్యతిరేక, మహిళల పట్ల గౌరవం లేని వైఖరిని బయటపెట్టిందని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలకు తావులేదని, దళితులు, మహిళల గౌరవం, ఆత్మగౌరవం, భద్రతకు భరోసా కల్పించేలా జోక్యం చేసుకోవాలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను వారు కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు సి.దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్ మార్, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, జి.వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, కాంగ్రెస్ ఎస్‌సి సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులు బుధవారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అంటరానితనం రాజ్యమేలిన చీకటి రోజుల్లోకి తెలంగాణను, దేశాన్ని తీసుకెళ్లేలా బిఆర్‌ఎస్ తరువాయి 12లో



### మహిళా శాసన సభ్యులపై దాడులు

# ఆధారాలు గవర్నర్‌కు ఇచ్చాం

- ప్రతీ ఘటన, అంశంపై విచారణ జరిపిస్తామని హామీలిచ్చారు
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- లోక్‌భవన్‌లో శివప్రతాప్ శుక్లాను కలిసిన బిఆర్‌ఎస్ ప్రతినిధి బృందం

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ వ్యవహారాలకు సంబంధించిన అంశాలతో పాటు,బయట జరిగిన ప్రతి సంఘటనపైన, అంశంపైన విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీనిచ్చినట్టు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన అన్ని ఎఐ ఫోటోలు, వీడియోలపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని, తప్పుడు చిత్రాలు, తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. తెలంగాణలో న్యాయం జరగకపోతే, జాతీయ మహిళా కమిషన్‌ను కూడా ఆశ్రయించి ఫిర్యాదు చేస్తామన్నారు. కెటిఆర్ నేతృత్వంలోని బిఆర్‌ఎస్ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను, నిరుద్యోగ, విద్యార్థుల సమస్యలు, పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన, అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన సంఘటన వివరాలను గవర్నర్‌కు వివరించారు. తమపైన , మహిళా శాసన సభ్యులపై జరిగిన దాడికి సంబంధించిన ఫోటోలు, ఆధారాలతో సహా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. శాసనమండలి సభ్యులు అనని మాటలను అన్నట్టుగా ఆపాదిస్తూ, జరగని అవమానాన్ని జరిగినట్టుగా చూపిస్తూ దళిత స్పీకర్ పేరుతో రాజకీయం చేస్తున్నారని గవర్నర్‌కు వివరించామని కెటిఆర్ తెలిపారు.



బి.వెంకటేశం..



ఎం.నర్సింహ్మా

## ఎఐటియుసి నూతన కార్యవర్గం

రాష్ట్ర అధ్యక్షుడిగా బి.వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ఎం.నర్సింహ్మా

కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర 4వ మహాసభల్లో ఎన్నిక

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మికవర్గ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గం పిలుపునిచ్చింది. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగిన ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా బి.వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ఎం.నర్సింహ్మాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తరువాయి 8లో






# దేశానికి బలమైన ఎర్రజెండా ఇంజన్ కావాలి

### ‘డబుల్, ట్రిపుల్ ఇంజన్’ కాదు..

కేంద్ర ప్రభుత్వంపై ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేశ్వరీ ధ్వజం

ప్రజాపక్షం/ యాదాద్రి

‘బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కానీ ఢిల్లీలో ఇప్పుడు ట్రిపుల్ ఇంజన్ ప్రభుత్వం ఉంది. అయినా సమస్యలు పరిష్కారం కాలేదు. ఇంజన్ విఫలమైనప్పుడు మరొక ఇంజన్ అవసరం వస్తుంది. దేశానికి అలాంటి డబుల్, ట్రిపుల్ ఇంజన్లు అవసరం లేదు. ఎర్రజెండా ఉన్న బలమైన ఒక్క ఇంజన్ ప్రభుత్వం కావాలి’’ అని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్‌జిందర్ మహేశ్వరీ అన్నారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల ప్రతినిధుల సభ బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి హాల్లో జరిగింది. రాష్ట్ర మహాసభల తరువాయి 12లో

## కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై యువత ఉద్యమించాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవినీతి, మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. యాదగిరిగుట్టలో నిర్వహించిన ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల కార్యక్రమానికి తరువాయి 12లో



## బిఆర్‌ఎస్ తీరుపై శాసన మండలి ఎథిక్స్ కమిటీ పరిశీలన

ప్రజాపక్షం/హైదరాబాద్

అసెంబ్లీ గేటు వద్ద శాసనసభ సమావేశాల తొలి రోజు నిరసనల సందర్భంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, మహిళల ఎదుట దుస్తులు విప్పి నిరసన తెలిపారనే ఆరోపణలను శాసనమండలి ఎథిక్స్ కమిటీ పరిశీలించింది. ఈ సంఘటనలకు సంబంధించిన పరిణామాలు, సంబంధిత ఆధారాలను కమిటీ పరిశీలించింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి వ్యవహారాన్ని బుధవారం ఉదయం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఎథిక్స్ కమిటీకి నివేదించారు. ఈ నేపథ్యంలో శాసనమండలి ఎథిక్స్ కమిటీ ప్రాథమిక సమావేశం బుధవారం సాయంత్రం కౌన్సిల్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు, తరువాయి 8లో

# అడవిపై హక్కు ఎవరిది?

భారతదేశంలోని గిరిజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం అభివృద్ధి, సంక్షేమం, పేదరికం వంటి పరిమిత కోణాల్లో చూడటం చాలాకాలంగా జరుగుతున్న పొరపాటు. గిరిజనుల సమస్యకు కేంద్రంలో ఉన్న ప్రశ్న భూమి. ఆ భూమికి అర్థం అడవి. అడవికి అర్థం జీవనాధారం. జీవనాధారానికి అర్థం వారి సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక ఉనికి. అందుకే గిరిజనుల విషయంలో అడవి భూమిని ఒక సాధారణ వనరుగా, ప్రాజెక్టులకు కేటాయించగల భూమిగా మాత్రమే చూడటం చారిత్రక వాస్తవాన్ని నిరాకరించడమే. 2006లో అమల్లోకి వచ్చిన అటవీ హక్కుల చట్టం ఈ చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దే ఉద్దేశంతో వచ్చింది. వలస పాలన కాలం నుంచి కొనసాగిన అటవీ పాలనా వ్యవస్థలు అడవిపై ఆధారపడి జీవించిన సమాజాల సంప్రదాయ హక్కులను గుర్తించలేదు. ఈ చట్టం ఆ లోటును పూడ్చేందుకు ప్రయత్నించింది. వ్యక్తిగత సాగు, నివాస హక్కులతో పాటు సామూహిక అటవీ వనరులపై హక్కులు, మేత, నీటి వనరులు, జీవవైవిధ్యం, సంప్రదాయ జ్ఞానం, అడవిని సంరక్షించే హక్కులు వంటి అంశాలను చట్టం గుర్తించింది. గిరిజనుల జీవన విధానాన్ని చట్టబద్ధమైన హక్కుగా చూడటం ఇందులోని కీలకమైన మార్పు. ఇప్పుడు అదే చట్టం అమలులో గ్రామసభ పాత్రపై కేంద్ర ప్రభుత్వంలోని గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వైఖరి మారిందన్న ఆరోపణ తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఈ అంశంపై చేసిన వ్యాఖ్యలు, లేవనెత్తిన ప్రశ్నలు రాజకీయ పార్టీల పరిధి దాటి వెళ్లేవి కాదు. అవి గిరిజనుల రాజ్యాంగబద్ధమైన హక్కులకు, అటవీ హక్కుల చట్టం ఉద్దేశానికి సంబంధించిన ప్రశ్న. కాంగ్రెస్ పార్టీ వాదన ప్రకారం, ఆగస్టు 31న గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ విద్యుత్ మంత్రిత్వ శాఖకు పంపిన ఒక సమాచారంలో, అటవీ భూమిని అటవీయేతర అవసరాలకు మళ్లించే ప్రాజెక్టులకు గ్రామసభ సమ్మతి తప్పనిసరి అని అటవీ హక్కుల చట్టంలో నిబంధన లేదు. ఈ వైఖరి గతంలో అదే మంత్రిత్వ శాఖ ఇచ్చిన మార్గదర్శకాలు, వివరణలకు భిన్నంగా ఉందన్నది ఇక్కడ మొదట గుర్తుంచుకోవాల్సింది ఒక విషయం. అటవీ హక్కుల చట్టంలోని సెక్షన్ 11 ప్రకారం, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ చట్టం అమలుకు నోడల్ ఏజెన్సీగా ఉంటుంది. అంటే చట్టం నుంచి దూరంగా నిలబడి కేవలం ఇతర శాఖల నిర్ణయాలను సమన్వయం చేసే సంస్థగా దాని పాత్రను అర్థం చేసుకోవడం సరికాదు. చట్టం అమలుకు సంబంధించి గిరిజనుల హక్కులను రక్షించడం దాని ప్రాథమిక బాధ్యతల్లో ఒకటి. అయితే, అటవీ హక్కుల చట్టం కింద హక్కుల గుర్తింపు ప్రక్రియకు గ్రామసభే ప్రారంభ స్థాయి సంస్థ. హక్కుల దావాలను స్వీకరించడం, వాటిని పరిశీలించడం, హక్కులపై తీర్మానాలు చేయడం వంటి బాధ్యతలు గ్రామసభకు ఉన్నాయి. అంతే కాదు, అడవి, వన్యప్రాణులు, జీవవైవిధ్యం, నీటి వనరులు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే బాధ్యతను కూడా చట్టం గ్రామసభకు అప్పగించింది. అందువల్ల గ్రామసభను ఒక సాధారణ స్థానిక సంస్థగా చూడటం చట్టం ఉద్దేశానికి విరుద్ధమవుతుంది. అది గిరిజన సమాజం తన భూమి, అడవి, జీవన వనరులపై నిర్ణయం చెప్పే ప్రజాస్వామ్య వేదిక. శతాబ్దాలుగా అడవిని వినియోగించిన, కాపాడిన, దాని సహజ వ్యవస్థతో జీవించిన సమాజానికి తమ భవిష్యత్తుపై మాట చెప్పే అవకాశం కల్పించడమే అటవీ హక్కుల చట్టం వెనుక ఉన్న ప్రాథమిక ఆలోచన. ఇక్కడే అభివృద్ధి అనే పదానికి మరోసారి అర్థం చెప్పుకోవాలి. రహదారి కావాలి. విద్యుత్ కావాలి. పాఠశాలలు, ఆసుపత్రులు కావాలి. సాగునీరు, ఉపాధి, సమాచార సదుపాయాలు కావాలి. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందకూడదని ఎవరూ చెప్పరు. చెప్పలేరు కూడా. కానీ అభివృద్ధి కోసం ఎవరిని నిర్వాసితులను చేస్తున్నాం? ఎవరి భూమిని తీసుకుంటున్నాం? ఎవరి జీవన వ్యవస్థను మార్చుతున్నాం? నిర్ణయం తీసుకునే ముందు వారి అభిప్రాయాన్ని ఎందుకు తెలుసుకోకూడదు? అనే ప్రశ్నలకు సమాధానం లేకుండా అభివృద్ధిని ముందుకు నడపడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. గిరిజనుల అభ్యంతరాన్ని ప్రాజెక్టు వ్యతిరేకతగా చిత్రీకరించడం కూడా సరైనది కాదు.

ఒక గ్రామానికి అడవి అంటే కేవలం చెట్లు కాదు. అక్కడి ఆహారం, ఔషధం, పశువుల మేత, నీటి ప్రవాహాలు, పండుగలు, ఆచారాలు, పూజా స్థలాలు, పూర్వీకుల జ్ఞాపకాలు, వేట, సేకరణకు సంబంధించిన సంప్రదాయాలు అన్నీ దానితో ముడిపడి ఉంటాయి. ఒక ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాజెక్టుగా మార్చినప్పుడు కేవలం భూమి విస్తీర్ణాన్ని కోల్పోవడం జరగదు. ఒక సమాజం యొక్క జీవన పద్ధతిలో మార్పు వస్తుంది. ఈ వాస్తవాన్ని భారత సుప్రీంకోర్టు కూడా న్యాయపరంగా గుర్తించింది. 2013లో ఒడిశాలోని నియమగిరి కొండలపై బాక్సైట్ తవ్వకాల వ్యవహారంలో గ్రామసభల పాత్రకు అత్యంత ప్రాధాన్యం లభించింది. ఆ తీర్పు తర్వాత నియమగిరి ప్రాంతంలోని గిరిజన గ్రామసభలు తమ మత, సాంస్కృతిక, సామాజిక హక్కులకు సంబంధించిన అంశాలపై నిర్ణయం చెప్పే ప్రక్రియ జరిగింది. అటవీ హక్కులు కాగితంపై ఉన్న హక్కులు కావని, వాటి నిర్ణయాలకు స్థానిక సమాజానికి వాస్తవమైన పాత్ర ఉండాలని ఆ పరిణామం స్పష్టం చేసింది. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సంబంధించిన అధికారిక పత్రాల్లో కూడా నియమగిరి తీర్పు గ్రామసభ కేంద్ర పాత్రను పునరుద్ఘాటించినట్లు నమోదైంది. ఇది కేవలం ఒక తీర్పు ప్రభావం కాదు.

అటవీ హక్కుల చట్టం మొత్తం నిర్మాణంలోనే గ్రామసభకు ప్రత్యేక స్థానం ఉంది. చట్టం గ్రామసభకు హక్కుల నిర్ధారణతో పాటు సామూహిక అటవీ వనరుల సంరక్షణ బాధ్యతను కూడా ఇస్తుంది. అంటే ప్రభుత్వం ఒకవైపు అడవిని రక్షించాలి, మరోవైపు అడవిపై ఆధారపడి జీవించే సమాజాన్ని రక్షించాలి. ఈ రెండు లక్ష్యాలు పరస్పర విరుద్ధాలుగా చూడాల్సిన అవసరం లేదు. నిజానికి గిరిజన సమాజం భాగస్వామ్యం లేకుండా అటవీ సంరక్షణకు దీర్ఘకాలిక బలం రావడం కష్టం. అదే సమయంలో, గ్రామసభ సమ్మతి లేదా చట్టపరమైన ప్రక్రియను ప్రాజెక్టు చివరి దశకు వాయిదా వేస్తే, ఆ సమయానికి ప్రాజెక్టు దాదాపు ఖరారైపోయే ప్రమాదం కూడా ఉంది. భూమి ఎంపిక, పెట్టుబడులు, పరిపాలనా అనుమతులు, ఒప్పందాలు అన్నీ ముందుకు వెళ్లిన తర్వాత గ్రామసభ అభిప్రాయాన్ని అడిగితే అది నిజమైన నిర్ణయ ప్రక్రియగా మిగలదు. ఒకసారి ప్రాజెక్టు రాజకీయ, ఆర్థిక, పరిపాలనాపరంగా ముందుకు వెళ్లిన తర్వాత స్థానిక సమాజానికి సమ్మతి చెప్పడం తప్ప మరొక వాస్తవిక మార్గం లేకుండా పోవచ్చు. అందుకే, చట్టం ఏమి చెబుతుందో స్పష్టంగా ప్రకటించడం అవసరం. అటవీ భూమి మళ్లింపులో అటవీ హక్కుల చట్టం కింద హక్కుల గుర్తింపు ఏ దశలో పూర్తి కావాలి? గ్రామసభ పాత్ర ఏమిటి? ఏ సందర్భాల్లో గ్రామసభ తీర్మానం అవసరం? పునరావాసం, పరిహారం, సామూహిక హక్కులు ఎలా రక్షించాలి? ఈ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం పారదర్శకమైన, చట్టబద్ధమైన వివరణ ఇవ్వాలి. గిరిజనుల విషయంలో మరో పెద్ద సమస్య చట్టం ఉండటం కాదు. చట్టం అమలు కావడం. అమలుకాకపోవడం ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని హామీలు ఇచ్చినా గిరిజనులకు న్యాయం జరగదు. అటవీ సంరక్షణ, అభివృద్ధి ఏకకాలంలో సాధ్యంకావాలంటే, చట్టాలను సమర్థంగా అమలు చేసి తీరాలి.●



## బ్రిక్స్ వల్ల భారత్‌కు ఎలాంటి ప్రయోజనం లేదు

**బ్రిక్స్ సదస్సుతో భారత్‌కు ఎలాంటి ప్రయోజనం ఉండదు. గత రెండు, మూడు బ్రిక్స్ సదస్సుల ద్వారా భారత్‌కు ఎలాంటి చెప్పుకోదగ్గ ప్రయోజనాలు లభించలేదు. భారత్ ప్రస్తుతం బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ), జి20, క్వాడ్ వంటి పలు అంతర్జాతీయ కూటముల్లో భాగస్వామిగా ఉన్నప్పటికీ, వీటి ద్వారా భారత్‌కు ఏమైనా ప్రయోజనం దక్కిందా అనే దానిపై స్పష్టత లేదు. బ్రిక్స్ సమ్మిట్‌కు ఎందరు అధ్యక్షులు, ప్రధాన మంత్రులు వస్తారనేది నాకు తెలియదు. గత 2-3 బ్రిక్స్ సమావేశాల వల్ల ఏమీ జరగలేదు.**

– కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం

# ప్రమాదకరంగా మారుతున్న మానసిక రుగ్మతలు!

ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కన్న ఎక్కువగా, అనగా దాదాపు 12 శాతం ప్రజలు మానసిక ఆరోగ్య (మెంటల్ హెల్త్ డిసార్డర్స్) రుగ్మతలతో సతమతం అవుతున్నారని, దీనివల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతూ, పేదరికం పెరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ, డబ్ల్యుహెచ్ఒ తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. ప్రపంచ ప్రస్తుత మానసిక ఆరోగ్యం (వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే) అనే నివేదికతో పాటు మానసిక ఆరోగ్య అట్లాస్ 2024 (మెంటల్ హెల్త్ అట్లాస్ 2024) అనే పేరుతో తాజాగా విడుదలైన నివేదికల రూపంలో పలు గంభీరమైన మానసిక ప్రజారోగ్య అంశాలు బయట పడ్డాయి. మానసిక అనారోగ్యాలకు ప్రధాన కారణాలుగా ఆందోళన(యాంగ్జైటీ), నిరాశ(డిప్రెషన్)విష వలయంలో చిక్కిన అభాగ్యులు, ముఖ్యంగా యువత, మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని నివేదిక బహిర్గతం చేయడం కొంత కలవరానికి కారణం అవుతున్నది. మానసిక అనారోగ్యం ముదిరితే ఆత్మహత్యలకు దారి తీస్తాయని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

నేడు అనేక ప్రపంచ దేశాలు మానసిక అనారోగ్యాలకు సరైన సమాధానంగా పలు పథకాలు, పాలసీలు, నిధుల కేటాయింపు చేయడం కొనసాగుతున్నాయి. రెండవ అతి పెద్ద దీర్ఘకాలిక ప్రజారోగ్య సమస్యగా మానసిక అనారోగ్య రుగ్మతలు అవతరించడం వల్ల మానవాళి శ్రేయస్సుకు భంగం కలగడం గమనించారు. నేటి డిజిటల్ యుగపు జనాభాకు మానసిక ఆరోగ్య సవాళ్లు రోజురోజుకు పెరగడంతో సత్వరమే ప్రజారోగ్య పరిరక్షణ కు పెట్టుబడులు పెంచడం వల్ల కుటుంబ పౌర సమాజ ఆరోగ్యం కుదుట పడుతుందని నివేదిక అంచనా వేస్తున్నది. ప్రతి ఏటా 10 సెప్టెంబర్ రోజు న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం (వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది.

**మానసిక ఆరోగ్య కేంద్రాల పట్ల అపోహలు:**

మానసిక రుగ్మతల చికిత్స, నివారణలకు సత్వరమే సుస్థిర పెట్టుబడులు పెట్టడం, అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం, అనేక సంస్థలు కలిసి సమన్వయంతో పనిచేయడం, మానసిక రుగ్మతల పట్ల అపోహలు తొలగించడం, వీటికి కారణమైన మూలాలను వెతికి పట్టుకోవడం నిరంతరం జరగాలని నివేదిక సూచిస్తున్నది. గత దశాబ్దకాలంగా ప్రభుత్వాలు కేటాయిస్తున్న మొత్తం ప్రజారోగ్య నిధుల్లో కేవలం 2 శాతం మాత్రమే మానసిక రుగ్మతల కట్టడికి వినియోగిస్తున్నట్లు గమనించారు. మానసిక వైద్యులను సంప్రదించడానికి మానసిక రోగులు ముందుకు రాకపోవడం పెద్ద సమస్యగా కనిపిస్తున్నది. అల్పాదాయ దేశాల్లో కేవలం 10 శాతం మానసిక రోగులు చికిత్సలు పొందగలుగుతున్నారని, అభివృద్ధి చెందిన దేశాల్లో 50 శాతం మానసిక రోగులు చికిత్సలకు చొరవ చూపుతున్నట్లు గమనించారు. మానసిక ఆరోగ్య పరిరక్షణకు చిన్న పిల్లలు, పాఠశాలలు, కళాశాలల్లో మానసిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పవలసిన అవసరాన్ని గుర్తించాలని నివేదిక వివరిస్తున్నది. నేటి డిజిటల్ స్మార్ట్ సమాజంలో మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెట్టుబడులను భారీగా పెంచడం, అన్ని స్థాయిల్లో మానసిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పడం, చట్టబద్ధంగా మానసిక రోగులకు కనీస హక్కులు కల్పించడం, సుస్థిర నిధుల కేటాయింపు, పౌర సమాజ ఆధార మానసిక ఆరోగ్య కేంద్రాల విస్తరణ, వ్యక్తి ఆధార మానసిక ఆరోగ్య భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని డబ్ల్యూహెచ్ఒ సూచిస్తున్నది.

**(10 సెప్టెంబర్ ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా)**

# నియంత్రణ కోల్పోయిన 'పిజి' సంస్కృతి

ఏడుగురు విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న ఢిల్లీలోని సత్యనికేతన్ భవన ప్రమాదం ఒక విషాద ఘటనగా ముగిసిపోవడానికి వీల్లేదు. ఇది ఢిల్లీలోని ఒక భవనం కూలిన ఘటన మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా విద్య కోసం నగరాలకు వచ్చే వేలాదిమంది విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సంక్షోభానికి, నియంత్రణ లేని పేయింగ్ గెస్ట్ (పిజి) వ్యవస్థకు, భద్రతా ప్రమాణాల అమలులో ఉన్న లోపాలకు ఇది అద్దం పడుతోంది. ఒక విద్యార్థి ఢిల్లీ లేదా హైదరాబాద్‌కు, బెంగళూరు లేదా పుణేకు, చెన్నైకి లేదా మరే విద్యా కేంద్రానికైనా వస్తున్నప్పుడు అతని ప్రధాన లక్ష్యం చదువు. ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్య కోసం పెద్ద నగరాలను ఆశ్రయిస్తారు. వారికి వసతి అనేది సౌకర్యం కాదు, విద్యలో భాగం. మంచి కళాశాల దొరికినా సురక్షితమైన హాస్టల్ దొరకకపోతే వారి విద్యా ప్రయాణం అసంపూర్ణంగానే ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు పిజిలు, హాస్టళ్లు, అద్దె గదులు విస్తరించాయి. డిమాండ్ పెరిగిన కొద్దీ భవనాల వాణిజ్య వినియోగం పెరిగింది. నివాస భవనాలు పిజిలుగా మారాయి.

ఒక కుటుంబం కోసం నిర్మించిన భవనాల్లో పదుల సంఖ్యలో విద్యార్థులను ఉంచుతున్నారు. భవన సామర్థ్యం ఎంత? అత్యవసర మార్గాలు ఉన్నాయా? అగ్నిమాపక భద్రత ఉందా? నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా ఉందా? విద్యుత్ వ్యవస్థ సురక్షితమా? మరమ్మతులు ఎవరు చేస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు లేకుండానే విద్యార్థులు అక్కడ నివసిస్తున్నారు. సత్యనికేతన్‌లో ఐదు అంతస్తుల బాలుర పిజి భవనం కూలి ఏడుగురు విద్యార్థులు మరణించడం ఈ వ్యవస్థలోని తీవ్రమైన లోపాలను ముందుకు తెచ్చింది. 27 గంటలకు పైగా సాగిన సహాయక చర్యలు అప్పటికే పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేకపోయాయి. భవన యజమాని కుటుంబ సభ్యుల అరెస్టులు, మున్సిపల్ అధికారులపై చర్యలు వంటి పరిణామాలు జరిగాయి. కానీ ఇవి ప్రమాదం తర్వాత జరిగే చర్యలు మాత్రమే. అసలు ప్రశ్న ప్రమాదానికి ముందు వ్యవస్థ ఎక్కడ ఉంది? ఒక భవనంపై అక్రమ నిర్మాణం లేదా భద్రతా ఉల్లంఘన ఉందని గుర్తించడం పరిపాలనా వ్యవస్థకు అసాధ్యమైన పనికాదు. తనిఖీ చేయాలి. ఉల్లంఘన కనిపిస్తే నోటీసు ఇవ్వాలి. అవసరమైతే నిర్మాణాన్ని నిలిపివేయాలి. ప్రమాదకరమైన భవనాన్ని ఖాళీ చేయించాలి. నిబంధనలు ఉల్లంఘించిన యజమానిపై చర్య తీసుకోవాలి. ఈ ప్రక్రియల్లో ఏ ఒక్క దశ పనిచేయకపోయినా చివరికి దాని మూల్యం విద్యార్థుల ప్రాణాలే కావడం అత్యంత విషాదకరం. సత్యనికేతన్ ఘటన తర్వాత కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) లేవనెత్తిన డిమాండ్లలో దేశవ్యాప్తంగా విద్యార్థుల వసతి భవనాలకు ఇంజినీరింగ్ స్థాయి నిర్మాణ భద్రతా ఆడిట్ నిర్వహించాలన్న అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీనిని ఒక రాజకీయ సంస్థ డిమాండ్‌గా మాత్రమే చూడాల్సిన అవసరం లేదు. విద్యార్థుల వసతికి సంబంధించి దేశవ్యాప్తంగా ఒక సమగ్ర భద్రతా విధానం అవసరమన్న వాస్తవాన్ని అది ముందుకు తెస్తోంది. దేశంలోని ప్రముఖ విద్యా కేంద్రాల్లో ఇలాంటి ఆడిట్ ఒకసారి చేసి ఫైల్ మూసివేయడం సరిపోదు. భవనం నిర్మాణ స్థిరత్వం, అగ్నిమాపక భద్రత, విద్యుత్ భద్రత, అత్యవసర నిష్క్రమణలు, అధిక జనసాంద్రత, అనుమతించిన వినియోగం, నిర్మాణ మార్పులు వంటి అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలి. తనిఖీల ఫలితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. విద్యార్థులు తాము నివసించబోయే పిజి చట్టబద్ధమైనదో కాదో తెలుసుకునే అవకాశం కూడా ఉండాలి. ఒక ప్రభుత్వ పోర్టల్లో పిజి లేదా విద్యార్థి వసతి గృహం పేరు నమో





దు చేసి, దానికి భవన అనుమతి ఉందా, అగ్నిమాపక ధ్రువీకరణ ఉందా, తాజా భద్రతా తనిఖీ ఎప్పుడు జరిగింది, ఎలాంటి ఉల్లంఘనలు నమోదయ్యాయి వంటి వివరాలు తెలుసుకునే వ్యవస్థ అవసరం. ప్రస్తుతం విద్యార్థి వసతి కోసం ఇంటర్నెట్ ప్రకటనలు, బ్రోకర్లు, స్నేహితుల సమాచారం, యజమాని మాటలపై ఆధారపడే పరిస్థితి ఉంటే అది ప్రమాదకరం. ఇక్కడ మరో ముఖ్యమైన సమస్య ప్రభుత్వ హాస్టళ్ల కొరత. ఢిల్లీ విశ్వవిద్యాలయం వంటి భారీ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య లక్షల్లో ఉంటే అందుబాటులో ఉన్న హాస్టల్ సామర్థ్యం దానికి చాలా తక్కువగా ఉండటం ప్రైవేటు పిజి సదుపాయంపై ఆధారపడే పరిస్థితిని పెంచుతుంది.

ప్రభుత్వ, విశ్వవిద్యాలయ హాస్టళ్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచకుండా ప్రైవేటు వసతులపై నియంత్రణ పెంచడం ఒక్కటే పరిష్కారం కాదు. హాస్టళ్ల కొరత పెరిగిన కొద్దీ విద్యార్థుల అవసరాన్ని వ్యాపార అవకాశంగా చూసే మార్కెట్ ఏర్పడుతుంది. ఆ మార్కెట్ లో మంచి వసతి కల్పించే నిర్వాహకులు ఉంటారు. అదే సమయంలో తక్కువ స్థలంలో ఎక్కువ మందిని ఉంచి అధిక అద్దె వసూలు చేసే వారు కూడా ఉంటారు. నియంత్రణ బలహీనంగా ఉంటే రెండో రకమైన వ్యాపారమే వేగంగా విస్తరిస్తుంది. ఈ వ్యవస్థలో విద్యార్థి అత్యంత బలహీనమైన వ్యక్తి. అతనికి భవనం గురించి సాంకేతిక పరిజ్ఞానం ఉండదు. నిర్మాణ అనుమతులు ఎలా పరిశీలించాలో తెలియదు. అగ్నిమాపక ధ్రువీకరణ అసలైనదో కాదో గుర్తించడం కష్టం. యజమాని చెప్పే మాటను నమ్మడం తప్ప మరో మార్గం ఉండదు. వసతి కోసం డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రశ్నలు అడిగే విద్యార్థికి మరో గది దొరుకుతుందనే హామీ కూడా ఉండదు. అందుకే పిజి వ్యవస్థను కేవలం అద్దె వ్యాపారంగా కాకుండా విద్యార్థి సంక్షేమ అంశంగా చూడాలి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థుల విద్యా హక్కుతో పాటు సురక్షితమైన వసతి అవసరాన్ని కూడా గుర్తించాలి. స్థానిక సంస్థలు పిజిలను ఒక ప్రత్యేక నియంత్రిత వర్గంగా పరిగణించి నమోదు, తనిఖీ, ధ్రువీకరణ వ్యవస్థను రూపొందించాలి. ఇటీవల జరిగిన ఇతర అగ్ని ప్రమాదాలు, భవన ప్రమాదాల తర్వాత కమిటీలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించడం సాధారణ పరిపాలనా పద్ధతిగా మారింది. కానీ కమిటీ ఏర్పాటే పరిష్కారం కాదు. ఎన్ని భవనాలను తనిఖీ చేశారో, ఎన్ని ఉల్లంఘనలు గుర్తించారో, ఎన్ని నోటీసులు ఇచ్చారో, ఎన్ని భవనాలను మూసివేశారో, ఎన్ని కేసుల్లో చర్య తీసుకున్నారో ప్రజలకు తెలియాలి. తనిఖీ వ్యవస్థకు గడువు, బాధ్యత, పర్యవేక్షణ ఉండాలి. ముఖ్యంగా అధికారులకు కూడా జవాబుదారీతనం ఉండాలి.

ఒక ప్రమాదకరమైన భవనం గురించి ముందే సమాచారం ఉంటే దానిపై చర్య ఎందుకు తీసుకోలేదు? నోటీసు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణం కొనసాగితే ఎవరు పర్యవేక్షించారు? తనిఖీ జరగకపోతే ఎందుకు జరగలేదు? ఒక ప్రాంతంలో అక్రమ పిజిలు విస్తరిస్తున్నాయని తెలిసినా చర్య తీసుకోకపోతే దానికి ఎవరు బాధ్యత వహించాలి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు లేకపోతే ప్రతి ప్రమాదం తర్వాత యజమానిని అరెస్టు చేయడం ద్వారా వ్యవస్థ తన బాధ్యత నుంచి తప్పించుకోలేరు. సత్యనికేతన్ ఘటనపై నమోదైన కేసును **సుప్రీంకోర్టు ఈనెల 10న పరిశీలించనున్న** నేపథ్యంలో, దీనికి ప్రాధాన్యం పెరిగింది. దేశవ్యాప్తంగా అనధికారిక నిర్మాణాలు, నివాస భవనాల వాణిజ్య వినియోగం, అగ్నిమాపక భద్రత వంటి అంశాలపై ఇప్పటికే విచారణ జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల వసతిని కూడా విస్తృత భద్రతా విధానంలో భాగంగా చూడాల్సిన అవసరం ఉంది. అయితే న్యాయస్థానాల జోక్యం శాశ్వత పరిష్కారం కాదు.

ప్రతి ప్రమాదం తర్వాత కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్య పరిపాలనకు ఆరోగ్యకరం కాదు. స్థానిక సంస్థలు ముందుగానే పనిచేయాలి. విద్యా సంస్థలు తమ విద్యార్థుల వసతి పరిస్థితులను పర్యవేక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించాలి. కేంద్ర స్థాయిలో కనీస భద్రతా ప్రమాణాలు రూపొందించాలి. ఎంతోమంది మాదిరిగానే, ఈ ఏడుగురు విద్యార్థులు కూడా తమ కుటుంబాలను వదిలి ఢిల్లీకి వచ్చారు. వారి లక్ష్యం భవిష్యత్తు ను నిర్మించుకోవడం. ఒక సురక్షితమైన గదిలో నిద్రించడం కోసం వారు ప్రత్యేక హక్కు అడగలేదు. అది వారి ప్రాథమిక హక్కుల పరిధి లోకి వచ్చే కనీస భద్రత.

విద్యార్థుల కలల నగరాలు వారి సమాధుల నగరాలుగా మారకూడదు. పిజి భవనం యజమాని లాభం, స్థానిక సంస్థల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం, హాస్టళ్ల కొరత, నియంత్రణ లేని అద్దె మార్కెట్ ఈ అంశాలన్నింటినీ కలిపి చూసినప్పుడే సత్యనికేతన్ విషాదానికి అసలు పరిమాణం అర్థమవుతుంది. ఇది ఒక భవనం కూలిన కథ కాదు. విద్య కోసం ఇంటి నుంచి బయలుదేరిన యువతకు ఈ దేశం ఎంత సురక్షితమైన నివాసాన్ని కల్పించగలుగుతోంది అన్నదే అసలు ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం వచ్చే వరకు సత్యనికేతన్‌లో మరణించిన ఏడుగురి విషాదం ముగిసినట్టుగా భావించలేం.

రాజు కుమార్

# పారిశుద్ధ్య కార్మికులు...ఈ మరణాలు ఇంకెన్నేళ్లు?

అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత్ కలలు కంటోంది. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు దాటినా, మన సమాజాన్ని పీడిస్తున్న ఒక అమానవీయ వాస్తవం మాత్రం ఇంకా పూర్తిగా అంతం కాలేదు. అదే మానవ మలమూత్రాల పారిశుద్ధ్య కార్మికులు స్వయంగా చేతులతో శుభ్రపరిచే పని. ఈ పనిని చట్టం నిషేధించింది. మురుగునీటి కాలువలు, సెప్టిక్ ట్యాంకులను మనుషులు ప్రమాదకర పరిస్థితుల్లో శుభ్రం చేయకుండా యాంత్రీకరణ జరగాలని సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినా పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లోకి దిగి ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. ఒకవైపు దేశంలోని అన్ని జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన సర్వేలో మానవ మలమూత్రాలను చేతులతో శుభ్రంచేసే ఒక్క వ్యక్తి కూడా కనిపించలేదని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, జమ్మూ కశ్మీర్‌లలో కనీసం 46 జిల్లాల్లో ఇప్పటికీ పొడి మరుగుదొడ్లలోని మలాన్ని చేతులతో తొలగిస్తున్నారని సఫాయి కర్మచారి ఆందోళన్ (ఎస్‌కెఎ) చెబుతోంది. ప్రభుత్వ గణాంకాలకు, కళ్లెదుట కనిపిస్తున్న వాస్తవానికి మధ్య భారీ వ్యత్యాసం అనేకానేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. సమస్యను నిర్మూలించామా? లేక గణాంకాల్లో కనిపించకుండా చేశామా? అనేది ప్రధాన ప్రశ్న. ఢిల్లీలో ఎస్‌కెఎ ప్రారంభించిన 'ఇండియా @ 80: ఎండ్ మాన్యువల్ స్కావెంజింగ్' ప్రచారంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పారిశుద్ధ్య కార్మికులు తమ అనుభవాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌కు చెందిన 70 ఏళ్ల మూసీదేవి తన జీవితంలో దాదాపు మొత్తం ఈ పనిలోనే గడిచిపోయిందని చెప్పారు. వయసు మీదపడినా ఇప్పటికీ మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి తనను పిలుస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ వాంగ్మూలాలపై స్పందించిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధూలియా స్పందించారు. ఈ ఆచారం పూర్తిగా నిలిచిపోయిందని, ఇప్పుడు అసలు కొనసాగడం లేదని ప్రభుత్వ అధికారులు చెప్పడమే ఈ సమస్యపై పోరాటంలో అతిపెద్ద అవరోధాల్లో ఒకటని ఆయన వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు మరో మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ కూడా ప్రభుత్వ యంత్రాంగం సమస్య ఉనికినే నిరాకరించడం తీవ్రమైన అంశమని అన్నారు. ఇప్పటికీ ఎక్కడైనా పొడి మరుగుదొడ్లు ఉంటే వాటిని తొలగించడం ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని, స్వచ్ఛ భారత్ మిషన్‌లో ఇది కీలక భాగం కావాలని ఆయన సూచించారు. చట్టాలు చేయడం ఒక్కటే ఈ సమస్యను పరిష్కరించదని, ఈ పనిని కొనసాగించేలా చేస్తున్న కుల ఆధారిత సామాజి క ఆలోచనా విధానాన్ని ప్రభుత్వం, సమాజం రెండూ మార్చుకోవాలని పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అంజనా ప్రకాశ్ అన్నారు. నిజానికి మలమూత్రాలను కార్మికులు స్వయంగా శుభ్రపరిచే పనిని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం 1993లోనే చట్టం తీసుకొచ్చింది. 2013లో మరింత సమగ్ర చట్టాన్ని తీసుకొచ్చి మానవ మలం శుభ్రపరిచే పనిని నిషేధించింది. ఈ పనికి మనుషులను నియమించడాన్ని శిక్షార్హమైన నేరంగా కూడా ప్రకటించింది. 2013లో, ఆ తర్వాత 2018లో నిర్వహించిన ప్రభుత్వ సర్వేల్లో దేశవ్యాప్తంగా 58,098 మంది మాన్యువల్ స్కావెంజర్లను గుర్తించారు. అయితే, ఇప్పుడు ప్రభుత్వం కొత్త సర్వేను తెరపైకి తెచ్చి, అలాంటి పనులు చేసే పారిశుద్ధ్య కార్మికులు ఒక్కరు కూడా కనిపించలేదని చెబుతోంది. అదే సమయంలో ఆ పనిలో ఉన్నామని కార్మికులు స్వయంగా చెబుతున్నారు. మరి అసలు సమస్య ఎక్కడుంది? అసలు చట్టం ఉందా లేదా అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న కాదు. చట్టాన్ని ఎంత సమర్థంగా అమలు చేస్తున్నారు? ప్రభుత్వ సర్వేలు నేలమీద ఉన్న వాస్తవ పరిస్థితిని ఎంతవరకు నమోదు చేస్తున్నాయి? అన్నదే కీలక ప్రశ్న. ఎస్‌కెఎ జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్ మూడు దశాబ్దాలకు పైగా ఈ సమస్యపై పోరాడుతున్నారు. ఈ కాలంలో పరిస్థితుల్లో అనేక మార్పులు వచ్చినప్పటికీ, పొడి మరుగుదొడ్లను చేతులతో శుభ్రంచేసే పని ఇంకా కొనసాగుతోందని ఆయన చెబుతున్నారు. సంస్థ వద్ద ఉన్న ఆధారాల ఆధారంగా ప్రభుత్వం మరోసారి సమగ్ర సర్వే నిర్వహించి, ఈ ఆచారం ఎక్కడ కొనసాగుతున్నా అక్కడ నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

మాన్యువల్ స్కావెంజింగ్ సమస్యకు మరో అత్యంత విషాదకరమైన కోణం ఉంది. మురుగునీటి కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తూ ఎంతోమంది పారిశుద్ధ్య కార్మి



కులు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021 జనవరి నుంచి 2026 జూన్ వరకు 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేస్తూ 332 మంది పారిశుద్ధ్య కార్మికులు మరణించారు. మాన్యువల్ స్కావెంజింగ్‌ను ఒక కేటగిరీగా, ప్రమాదకర పరిస్థితుల్లో మురుగునీటి కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయడాన్ని మరో కేటగిరీగా కేంద్రం పరిగణిస్తోంది. కొత్తగా మాన్యువల్ స్కావెంజింగ్ కేసులు కనిపించలేదని వాదిస్తున్నది. మలమూత్రాలను శుభ్రం చేసే క్రమంలో పలువురు పారిశుద్ధ్య కార్మికులు మృతి చెందడంపై సుప్రీంకోర్టు కూడా తీవ్రంగా స్పందించింది. డాక్టర్ బలరాం సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణ సందర్భంగా 2026 జులై 27న జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కోర్టు గతం లో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ కాలువల్లో మరణాలు కొనసాగుతుండటంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

కోర్టు ముందు ఉంచిన పార్లమెంటరీ గణాంకాల ప్రకారం 2024లో 54 మంది, 2025లో 46 మంది మరణించారు. తమ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైనందుకు కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో వివరణ ఇవ్వాలని ఐదు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. బాధ్యతను కాంట్రాక్టర్లపైకి నెట్టడం ద్వారా రాష్ట్రాలు తమ జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేవని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఇది అత్యంత కీలకమైన అంశం. 'సదరు విభాగం కాంట్రాక్టు ఇచ్చింది. కాంట్రాక్టర్ కార్మికుడిని పంపించాడు. ప్రమాదం జరిగింది. ఇందులో కాంట్రాక్టర్‌దే బాధ్యత' అని చెప్పి ప్రభుత్వం తప్పించుకుంటే, ప్రాణం కోల్పోయిన కార్మికుడి కుటుంబానికి న్యాయం ఎక్కడ లభిస్తుంది? 2023 అక్టోబరులోనే సుప్రీం కోర్టు మురుగునీటి కాలువలు, సెప్టిక్ ట్యాంకులను ప్రమాదకర పద్ధతుల్లో శుభ్రం చేయడాన్ని అరికట్టేందుకు అనేక ఆదేశాలు జారీ చేసింది. కాలువ శుభ్రం చేస్తూ ఒక కార్మికుడు మరణిస్తే అతని కుటుంబానికి రూ.30లక్షల పరిహారం చెల్లించాలని కూడా కోర్టు ఆదేశించింది. పరిహారం అవసరం. కానీ పరిహారం అనేది ఒక ప్రాణానికి విలువ కట్టే పద్ధతి కాదు. మరణం సంభవించి న తర్వాత కుటుంబానికి డబ్బు ఇవ్వడం కంటే, ఆ మరణం సంభవించకుండా చూడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ఒక కార్మికుడు కాలువలోకి దిగాల్సిన అవసరమే లేకుండా వ్యవస్థను రూపొందించాలి. 2023 – 24లో ప్రభుత్వం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (ఎన్‌ఎఎంఎస్‌టిఇ/ నమస్తే) పథకాన్ని ప్రారంభించింది. ప్రమాదకరమైన మానవ శ్రమ స్థానంలో యాంత్రీకృత పారిశుద్ధ్య వ్యవస్థను తీసుకురావడం, పారిశుద్ధ్య కార్మికుల భద్రతను మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యం. అయితే, పథకాలు రూపొందించడం ఒక దశ మాత్రమే. వాటిని ప్రతి పట్టణంలో, ప్రతి మున్సిపాలిటీలో, ప్రతి మురుగునీటి కాలువ వద్ద అమలు చేయడం అస లు పరీక్ష. కాలువలోకి మనిషిని పంపకుండా యంత్రంతో శుభ్రం చేయగల సాంకేతికత అందుబాటులో ఉన్నప్పుడు, ఇంకా మనుషులను ఎందుకు పంపుతున్నారు? పరికరాలు ఉన్నా వాటిని ఉపయోగించడం లేదంటే ఎందుకు? కాంట్రాక్టర్లపై పర్యవేక్షణ ఎవరిది? భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యత ఎవరిది? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం.

భారత్ స్వాతంత్ర్యం సాధించి ఎనిమిది దశాబ్దాలకు చేరువవుతోంది. ఈ సమయంలో దేశం అంతరిక్షంలో కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను విస్తరిస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదగాలని లక్ష్యాలు నిర్దేశించుకుంటోంది. అయితే, అదే దేశంలో ఒక మనిషి మరో మనిషి మలాన్ని చేతులతో తొలగించాల్సి వస్తే, లేదా మురుగునీటి కాలువలోకి దిగి ప్రాణాలు కోల్పోతే, మన అభివృద్ధి నమూనాను మరోసారి పరిశీలించక తప్పదు. ఇప్పుడు చర్చ కేవలం ప్రభుత్వ గణాంకాల్లో ఎంత మంది మాన్యువల్ స్కావెంజర్లు ఉన్నారనే అంశంపై కాకుండా, ఎన్ని జిల్లాలు ఈ ఆచారం నుంచి విముక్తి పొందినట్లు ప్రకటించుకున్నాయనే విషయంపై చర్చ జరగాలి. పారిశుద్ధ్య కార్మికులతో ప్రభుత్వం నేరుగా మాట్లాడాలి. ఈ రంగంలో పనిచేస్తున్న సంస్థలతో కలిసి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలి. పొడి మరుగుదొడ్లు ఎక్కడైనా ఉంటే వాటిని పూర్తిగా తొలగించాలి. మానవ మలాన్ని చేతులతో తొలగించే పనికి శాశ్వతంగా ముగింపు పలకాలి. ఈ దేశం నిజంగా అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే, ముందుగా మానవుడి మానవ మలాన్ని చేతులతో శుభ్రం చేయించే ఈ అమానవీయ వ్యవస్థకు ముగింపు పలకాలి.

(ఐపిఎ సౌజన్యంతో)

## అసెంబ్లీ మీడియా పాయింట్

### అసెంబ్లీ ఎదుట విధ్వంసం సృష్టించేందుకే ఆ ఘటన: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను మరో బిహార్‌గా మార్చేందుకు బిఆర్‌ఎస్ కుట్ర చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ మహిళలను ముందు పెట్టి ‘శిఖండి’ రాజకీయాలు చేయాలని చూశారని, విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను టార్గెట్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు.అసెంబ్లీ ఎదుట జరిగిన ఘటన విధ్వంసం సృష్టించేందుకు పన్నిన కుట్రలో భాగమేనని ఆరోపించారు. గతంలో తమను ఇంటి నుంచి బయటకు రానీయకుండా నిరసనలు అడ్డుకున్నారని, ప్రస్తుతం మాత్రం ప్రతిపక్షాలకు నిరసన తెలిపే పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని అన్నారు. ‘‘బ్లాక్ టికెట్లు అమ్మే బ్యాచ్‌ను కేసీఆర్ అసెంబ్లీకి పంపారు. తెలంగాణను సర్వనాశనం చేసే బ్యాచ్ ఇది’’ అంటూ నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.

### సభలో హుందాతనం పాటించాలి: బిజెపి ఎమ్మెల్యే కె. వెంకటరమణారెడ్డి



వ్యక్తిగత ఈగోలు, ప్రతీకార రాజకీయాలతో శాసనసభ కార్యకలాపాలను అడ్డుకోవడం సరికాదని బిజెపి ఎమ్మెల్యే కె. వెంకటరమణారెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ ఆరు రోజుల్లో మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు ప్రజా సమస్యలపై సరైన చర్చ జరగలేదని పేర్కొన్నారు. ప్రతి దాడికి ప్రతిదాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. పోలీసులను ఇబ్బందులకు గురిచేయడం, రోడ్డుపై అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం ఎలాంటి సందేశాన్ని ఇస్తుందని ప్రశ్నించారు. కులాల మధ్య అంతరాలు పెరిగేలా మాట్లాడటం తగదన్నారు. సభలో లేని గంగుల కమలాకర్‌ను సస్పెండ్ చేయడాన్ని వ్యక్తిగతంగా తాను వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. ‘‘పది సంవత్సరాలు మమ్మల్ని ఇబ్బంది పెట్టారు.. ఇప్పుడు మేము ఇబ్బంది పెడతాం’’ అన్నట్టుగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని, ఎవరి ఇంటిపై దాడి జరిగినా అది మంచిది కాదని చెప్పారు. శాసనసభ్యులు హుందాతనంతో వ్యవహరించి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని వెంకటరమణారెడ్డి అన్నారు.

### అధికారం లేకపోతే బతకలేని పరిస్థితి: ఎమ్మెల్యే రాందాస్ నాయక్



అధికారం లేకపోతే బతకలేని పరిస్థితికి కొందరు రాజకీయ నాయకులు చేరుకున్నారని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజన, బహుజన వర్గాలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో దోచుకున్న సంపదను, అవినీతి వ్యవహారాలను కప్పిపుచ్చుకునేందుకే దాడులకు పాల్పడుతున్నారని రాందాస్ నాయక్ ఆరోపించారు. అధికారమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారి వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

### కెసిఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే నవీన్ యాదవ్



మహిళలు, దళితులు, శాసనసభ, స్పీకర్ పట్ల బిఆర్‌ఎస్ నేతలకు ఏమాత్రం గౌరవం లేదని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆరోపించారు. దళిత సంఘాలు కార్యక్రమం నిర్వహించిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అత్యంత అవమానకరమైన చర్యగా అభివర్ణించారు.బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తీరును తీవ్రంగా ఖండించిన నవీన్ యాదవ్.. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై పిడి యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై మాజీ సీఎం కెసిఆర్ అసెంబ్లీకి హాజరై దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని కోరారు.

### సభను అడ్డుకోవడమే బిఆర్‌ఎస్ నేతల లక్ష్యం: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



శాసనసభ కార్యకలాపాలు సాగకుండా అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే బీఆర్‌ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితమే సమాజం మరిచిపోయిన అంటరానితనం భావనను బీఆర్‌ఎస్ నేతలు మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు.దళితుల పట్ల వివక్షను ప్రదర్శించేలా వ్యవహరించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని ఆమె అన్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన శాసనసభను రాజకీయ వివాదాలకు వేదికగా మార్చడం సరికాదని యశస్విని రెడ్డి పేర్కొన్నారు.

## అసెంబ్లీలో ‘పంచాయతీరాజ్ చట్టం- 2018’ సవరణ బిల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘పంచాయతీరాజ్ చట్టం 2018’ సవరణ బిల్లును రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టారు. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం సమీపంలోని జాతీయ బ్యాంకులో జమ చేసుకునేందుకు వీలుగా ఈ చట్ట సవరణ చేయనున్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీలో జమఅవుతుంది. ఈ చట్ట సవరణ జరిగితే గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని సమీపంలోని జాతీయ బ్యాంక్‌లో జమ చేసే వెసులుబాటు కలుగనుంది.

## లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయొద్దు

### అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇచ్చిన కూనంనేని

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయకూడదని చర్చించేందుకు శాసనసభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టాలని సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని, వాటిని రాష్ట్రంలో అమలు చేయకుండా ఉండే అంశంపై సభలో చర్చించాలని తన వాయిదా తీర్మాన ప్రతిపాదనలో స్పష్టం చేశారు. కార్మిక వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై శాసనసభలో చర్చ అవసరమన్నారు. అయితే కూనంనేని ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ ప్రసాద్ కుమార్ తిరస్కరించారు.

# శాసనమండలి నుంచి బిఆర్‌ఎస్ వాకౌట్









**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనమండలి నుంచి బిఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. శాసనమండలి బుధవారం సమావేశం కాగానే, మంగళవారం సభ నుంచి బిఆర్‌ఎస్ సభ్యులను సస్పెండ్ చేయడం పట్ల బిఆర్‌ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. సభ్యులను సస్పెండ్ చేసే ముందు కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, కారణం కూడా సరిగ్గా చెప్పలేదని వారు అన్నారు. పలువురు బిఆర్‌ఎస్ సభ్యులు వెల్‌లోకి వచ్చి బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అయినా చైర్మన్ తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని బిఆర్‌ఎస్ పక్ష నాయకులు ఎస్.మధుసూదనాచారి నిరసన వ్యక్తం చేస్తూ బిఆర్‌ఎస్ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి సభ నుంచి నిష్క్రమించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దళితులు మంగళవారం కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద డప్పు చప్పుల్లతో నిరసన వ్యక్తం చేస్తే, ఆ ప్రాంతాన్ని బిఆర్‌ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యంలో చీకటి రోజు అని అన్నారు. ఇందుకు ఇది ముమ్మాటికీ దళితులను అవమానపరిచే విధంగా భావించాల్సి వస్తోందన్నారు. గత మూడు రోజులుగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు తీవ్ర కలవరపెడుతున్నాయని చెప్పారు. ఇటీవల కాలంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పాల్గొన్న ర్యాలీ ప్రాంగణాన్ని బిజెపి నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటన మరవకముందే, తెలంగాణ రాష్ట్రంలోనూ అదే రీతిలో జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టావల్సిందిగా కోరారు. మంత్రి వాఖ్యలపై ప్రతిపక్ష నేత మధుసూదనచారి స్పందిస్తూ ఒక మనిషి బతికి ఉన్నప్పుడు ఆ వ్యక్తి ఇంటి ముందు చావు డప్పు కొట్టడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడు, పదేళ్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిపై ఇలాంటి చర్యలకు పాల్పడడం అమనూషమన్నారు. ప్రభుత్వం తన తప్పును తెలుసుకుని కెసిఆర్‌తో పాటు యావత్ తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిల వాదన వినకుండానే వారిని సస్పెండ్ చేయడం అన్యాయమని, వారి సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని, వారి వివరణ వినడంతో పాటు ఓటింగ్ నిర్వహించాలని మధుసూదన చారి చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. సభ్యుల సస్పెన్షన్‌ను ముందస్తు ప్రణాళిక ప్రకారమే ప్రభుత్వం చేసిందని, ఆ బాధ్యతలను పోలీసులకు అప్పగించారని అన్నారు. దీనికి నిరసనగా బిఆర్‌ఎస్ పార్టీ సభ్యులు శాసనమండలి నుంచి వాకౌట్ చేస్తున్నామని సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం వల్ల దళితులు గౌరవంగా బతుకుతున్నారని, ఒక్కో మెట్టు ఎక్కుకుంటూ స్పీకర్ స్థాయికి చేరుకున్న వ్యక్తిపై అసభ్యకర పదజాలం ఉపయోగించడం అవివేకమన్నారు. రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు జరుగుతున్నా బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ కనీసం స్పందించలేదని, ఆయన స్పందన కోసం ఫామ్‌హౌస్ వద్ద డప్పులు కొట్టి దళితులు నిరసన వ్యక్తం చేశారన్నారు. కానీ, ఆ ప్రాంతాన్ని శుద్ధీకరణ చేయడం ద్వారా దళితులపై బిఆర్‌ఎస్ వైఖరి స్పష్టమవుతుందని మండిపడ్డారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శుద్ధీకరణ చేయడాన్ని ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కెసిఆర్ చావు డప్పు అనే దానిని కూడా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని సభ్యులను ఆదేశించారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్







మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్**

ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని అరికట్టి, ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. శాసనమండలిలో బుధవారం ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై కాంగ్రెస్ సభ్యులు విజయశాంతి చేసిన ప్రత్యేక ప్రస్తావనకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యంగా కావాల్సినవి విద్య, వైద్యం అని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అవి భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను నివారించేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటామని మంత్రి చెప్పారు.

**ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి: ఎమ్మెల్సీ విజయశాంతి**

రాష్ట్రంలో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ అడ్డగోలుగా పెరిగిపోయిందని, ఆ ఆసుపత్రుల చర్యలను వెంటనే అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. సభలో ఈ అంశంపై ఆమె ప్రత్యేక ప్రస్తావన చేస్తూ ఏదైనా అనారోగ్య సమస్య కారణంగా ఆసుపత్రికి వెలితే చాలు ఆ ఫీజు, ఈ ఫీజు అంటూ లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆమె ప్రైవేటు ఆసుపత్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఆసుపత్రుల బిల్లులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విజయశాంతి ఆవేదన వ్యక్తం చేశారు.

**బిసి కులగణన చేపట్టాలి: చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)**

జనగణనలో బిసి కులగణన చేపట్టే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో బుధవారం ఈ అంశంపై ఆయన ప్రత్యేక ప్రస్తావన చేశారు. బిసి కులగణన చేపట్టకపోతే విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో బిసిలు మరో పదేళ్ల పాటు వెనకబడి పోతారని పేర్కొన్నారు. బిసి కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు.

## దళితులు ధర్నా చేస్తే ప్రాంతం మైలపడుతుందా?



### బిఆర్‌ఎస్ నేతలకు ప్రభుత్వ విప్‌లు ప్రశ్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళితులు ధర్నా చేస్తే ప్రాంతం మైలపడుతుందా? పసుపు నీళ్లతో శుద్ధి చేస్తారా? అంటూ ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, వేముల వీరేశం, బల్మూర్ వెంకట్ బిఆర్‌ఎస్ నేతల ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు ధర్నా చేసిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో సంప్రోక్షణ చేయడం జాతి వివక్ష, అంటరానితనాన్ని ప్రదర్శించడమేనని వారు మండిపడ్డారు. బుధవారం అసెంబ్లీమీడియాలో వారు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ మొదటి నుంచీ దళితులను మోసం చేయడం, అవమానించడం, అవహేళన చేయడమే విధానంగా పెట్టుకుందని విమర్శించారు. దళిత నేత, శాసనసభాపతిని పరుష పదజాలంతో దూషించడంపై తెలంగాణ సమాజం ఆగ్రహంగా ఉందని బల్మూరి వెంకట్ అన్నారు. తమ జాతికి చెందిన స్పీకర్‌ను అవమానించడాన్ని నిరసిస్తూ దళితులు డప్పు దరువులతో కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తే, ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితులను అవమానించడమేనన్నారు. దీనిపై కేసీఆర్ వెంటనే స్పందించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ కేబినెట్‌లో దళిత నేతగా ఉన్న ఉప ముఖ్యమంత్రిని తొలగించారని, కాంగ్రెస్ పార్టీ దళిత నేత భట్టి విక్రమార్కను ప్రతిపక్ష నేతగా చేస్తే ఆ హోదా లేకుండా చేశారని వేముల వీరేశం ఆరోపించారు. నిరసన తెలిపారనే కారణంతో ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను సభ నుంచి సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. బిఆర్‌ఎస్ నేతల తీరు మార్చుకోకపోతే దళిత సమాజమే ఆ పార్టీని వెలివేసి, అంటరాని పార్టీగా గుర్తిస్తుందని హెచ్చరించారు. కెటిఆర్ ఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజలే బిఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ఇ20 పెట్రోల్ వాడకంతో అనేక ప్రయోజనాలు

### ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం

### కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి వివేక్ వెంకటస్వామి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇథనాల్ వినియోగంతో రైతుల పంటలకు మంచి ధర, కాలుష్యం తగ్గింపు, విదేశీ మారకద్రవ్య ఆదా వంటి ప్రయోజనాలు ఉన్నాయని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ‘ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం’పై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల వాహనాలు పాడవుతున్నట్లు ఇప్పటివరకు వాహన యజమానులు, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి రవాణాశాఖకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 ఇంధన విధానం ప్రకారం ఏప్రిల్ 16 నుంచి దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ విక్రయిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల వాహనాల పికప్, మైలేజీ కొంత తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ సర్వీసింగ్‌తో పెద్దగా ఇబ్బందులు ఉండవన్నారు. రాష్ట్రంలో ఈవి పాలసీని విజయవంతంగా అమలు చేస్తున్నామని, ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం పన్ను మినహాయింపు కల్పిస్తున్నట్లు మంత్రి చెప్పారు.

**కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి వివేక్ వెంకటస్వామి**

కార్మికుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ‘కార్మికుల వేతన సవరణ’పై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలను కాంగ్రెస్ ప్రభుత్వం గణనీయంగా పెంచిందని మంత్రి తెలిపారు. కొత్త వేతనాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.10 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. కార్మికులను అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ నాలుగు కేటగిరీలుగా విభజించి, రాష్ట్రాన్ని మూడు జోన్లుగా వర్గీకరించినట్లు వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్లు జోన్1, మున్సిపాలిటీలు జోన్2, గ్రామీణ ప్రాంతాలు జోన్3గా నిర్ణయించినట్లు వివరించారు. కోర్ ఏరియాలో కనీస వేతనం రూ.10,900 నుంచి రూ.14 వేలకు, జోన్2లో రూ.15 వేలకు, జోన్1లో రూ.16 వేలకు పెంచినట్లు తెలిపారు. తక్కువ వేతనాలు చెల్లించే సంస్థలపై ఫిర్యాదులు వస్తే కార్మిక శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## ఉద్యోగుల జెఎసి ‘చలో హైదరాబాద్’ వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పిఆర్‌సి నివేదికను అమలు చేసి వేతన సవరణ చేపట్టాలని, సిపిఎస్ రద్దుపై నిర్ణయం తీసుకోవాలని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.11 వేల కోట్ల బిల్లులను చెల్లించడంతో పాటు ఉద్యోగుల ఇతర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ సంఘాలు జెఎసి చేపట్టిన ‘చలో హైదరాబాద్’ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. ఈ నెల 18వ తేదీన మరోసారి జెఎసితో సమావేశం ఏర్పాటు చేస్తామని సిఎస్ హామీ ఇచ్చారని అప్పటి వరకు మాత్రమే వేచి చూస్తామని, అప్పటిలోగా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తామని జెఎసి స్పష్టం చేసింది. టిఎన్‌జిఓ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఎంప్లాయీస్ జెఎసి చైర్మన్ మారం జగదీష్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచన మేరకు గురువారం నిర్వహించాల్సిన ‘చలో హైదరాబాద్’ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. పిఆర్‌సి అంశంపై ప్రభుత్వం లేఖ రాసిందని, అసెంబ్లీ సమావేశాల అనంతరం చర్చలకు పిలుస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఈ నెల 18 వరకు వేచి చూస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై లిఖితపూర్వకంగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఎంప్లాయీస్ జెఎసి నేత ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ 13 లక్షల మంది ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే దశలవారీగా ఉద్యమం చేస్తున్నామని తెలిపారు. సిపిఎస్‌పై కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని సిఎస్ స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు.

## తెలంగాణ భాషకు కాళోజీ సేవలు శ్లాఘనీయం



సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ తెలంగాణ భాషకు కాళోజీ చేసిన సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు. ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజీ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ భాష, సాహిత్యానికి మరింత ప్రోత్సాహం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాళోజీకీ సిఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఎంపి ఎం. అనిల్ కుమార్ యాదవ్ నివాళ్లు అర్పించారు.

**కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం : మహేష్‌కుమార్ గౌడ్**


ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు.తెలంగాణ సమాజం, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం కాళోజీ చేసిన పోరాటం చిరస్మరణీయమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తన సాహిత్యం ద్వారా ప్రజా సమస్యలు, సామాజిక అసమానతలు, పాలకుల వైఖరిని ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, యాస, భాష, సంస్కృతి ఆయన రచనల్లో ప్రతిబింబించాయని అన్నారు.అన్యాయాన్ని ప్రశ్నించడం, అణగారిన వర్గాల తరపున నిలబడటం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం వంటి కాళోజీ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**డిజిపి కార్యాలయంలో...**

ప్రజా సమస్యలను తన కలంతో ఎలుగెత్తి చాటి, తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు డిజిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళులర్పించారు. ప్రజల కష్టాలు, సామాజిక సమస్యలను తన రచనల ద్వారా ప్రతిబింబించిన కాళోజీ సాహిత్య సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కాళోజీ రచనలు ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడంతో పాటు సామాజిక మార్పుకు స్ఫూర్తినిచ్చాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐజిలు గజరావు భూపాల్, షానవాజ్ ఖాసిం, ఏఐజీ (అడ్మిన్) జె.అన్యోన్య, ఎస్‌పి రూపేష్, డిఎస్‌పి భాస్కర్, స్టోర్స్ డిఎస్‌సి సత్యనారాయణ, సిఎస్‌ఒ యోగేశ్వరరావుతో పాటు ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కాళోజీ స్ఫూర్తి నేటికీ ఆదర్శం: రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్**

తెలంగాణ మాండలికాన్ని ఎగతాళి చేసిన వారికి తన నిర్భయమైన, శక్తివంతమైన కవితలతో కాళోజీ సమాధానం ఇచ్చారని, ఆయన స్ఫూర్తి నేటికీ ఆదర్శం అని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలు తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తదితరులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిసి కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్. సునీత, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీ నారాయణతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మాదాపూర్ సర్కిల్-50

Lr No. 05/EE/SWM/KPZ/CMC/2026-27, తేది: 08.09.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 05/EE/SWM/KPZ/CMC/2026-27, తేది: 08.09.2026 | గణేష్ పండుగ పనులు, సిఎంసి. | రూ. 26.25 లక్షలు | 09.09.2026 ఉ.11.30గం.ల నుండి, 15.09.2026 ఉ.11.30గం.ల వరకు | శ్రీమతి సిహెచ్.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎస్‌డబ్ల్యూఎం(హెచ్‌క్యూ), సిఎంసి. సెల్ నెం. 7995009113 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్‌ఎల్‌పి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 9642-PP/CL/ADVT/2026-27, Date: 09-09-2026

**పురపాలక సంఘ కార్యాలయము : బెల్లంపల్లి, జిల్లా :: మంచిర్యాల**

కొటేషన్ నోటీస్

కొటేషన్ నోటీస్ నెం. ఇ1/కొటేషన్/05/2026-27/Bpl/Mptly తేది: 08-09-2026

ఈ కార్యాలయములో ఎల్.ఇ.డి. లైట్ల కొరకు పీ.సి.బీలు కొనుగోలు మరియు సప్లై చేయుటకు బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ గారి కార్యాలయంకు సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి.

కొటేషన్స్ కార్యాలయమునకు సమర్పించు తేదీల వివరములు :

01. కొటేషను సమర్పించు చివరి తేది & సమయం : 11.09.2026 up to 11.00am

ఈ బాక్స్ టెండర్ నోటీస్

బాక్స్ టెండర్ నోటీస్ నెం. ఇ1/02/టెండర్/2026-27/Bpl/Mptly తేది :08-09-2026

ఈ కార్యాలయములో అంచనా విలువ రూ.3.00 లక్షల విలువ గల (3) పనులకు మున్సిపల్ సాధారణ నిధులకు గాను సివిల్ కాంట్రాక్టర్ వారి నుండి ఈ కార్యాలయం బాక్స్ టెండర్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి.

బాక్స్ టెండర్ తేదీల వివరములు:

01. టెండర్ షెడ్యూళ్లకై దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేది : 11.09.2026 Upto 1.00 PM
02. టెండర్ షెడ్యూళ్ళు జారీ చేయుటకు తేది : 11.09.2026 from 1.00 PM to 2.00 PM
03. టెండర్లు సమర్పించుటకు చివరి తేదీ & సమయం : 11.09.2026 Upto 3.00 PM
04. టెండర్లు తెరుచుటకు చివరి తేదీ & సమయం : 11.09.2026 at 4.00 PM

ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కమిషనర్, బెల్లంపల్లి మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 9665-PP/CL/ADVT/2026-27, Date: 09-09-2026



## రాంపల్లి చెరువును సందర్శించిన ఎంఎంసి కమిషనర్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ రాంపల్లి చెరువులోని నిమజ్జనం చేసే ప్రదేశాన్ని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికగుప్తాతో కలిసి సందర్శించి రాబోయే వినాయక నిమజ్జన కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వాణి, ఇఇ రమేష్, డిఇ నరేష్, శ్రీనివాస్, రవికిరణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 500 డప్పులతో ఆత్మగౌరవ గర్జన

### డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల ను ఖండిస్తూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో పోచారం డివిజన్ నుండి తూముకుంట చౌరస్తాలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 500 డప్పులతో కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన ప్రదర్శనలో డప్పుల దరువులు, ఆత్మగౌరవ నినాదాలతో తూముకుంట మార్మోగింది. ప్రజాస్వామ్యాన్ని రాజాంగబద్ధ పదవులను అవమానించే వ్యాఖ్యలను ఖండిస్తూ పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్ డిమాండ్ చేశారు. రాజేష్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకులకు దళితుల పట్ల చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బిఆర్‌ఎస్ నాయకులు అక్కసుతో దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. ఆత్మగౌరవం కోసం ప్రజాస్వామ్యం కోసం ఐక్య పోరాటం

## బతుకమ్మ పండుగకు ఘాట్‌ను అందుబాటులోకి తెస్తాం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సాంప్రదాయాల్లో ఒకటైన బతుకమ్మ పండగను మహిళలు ఘనంగా జరుపుకోవాలని అలియాబాద్‌లో బతుకమ్మ ఘాట్‌ను పండగకు అందుబాటులోకి తెస్తామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపల్‌లో జనరల్ నిధులు రూ.10 లక్షలతో బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి మహిళలకు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కనరెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు గాదె వెంకటేష్, గూదె వెంకటేష్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునిగా కర్నే సురేందర్



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పురస్కారాలలో భాగంగా మేడ్చల్ జిల్లా, జవహర్ నగర్ నివాసి స్థానిక గీతాంజలి హైస్కూల్ వైస్ ప్రిన్సిపల్‌గా సేవలందిస్తు న్న కర్నే సురేందర్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ చేతుల మీదుగా సత్కారం. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ వి.బాలకృష్ణా రెడ్డి చేతుల మీదుగా కర్నే సురేందర్ ఈ అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. **అభినందనల వెల్లువ:** రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై గుర్తింపు పొందిన కర్నే సురేందర్‌కు గీతాంజలి పాఠశాల యాజమాన్యం, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు జవహర్ నగర్ ప్రాంత ప్రముఖులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి

### పోక్సో కేసుతో యువకుడి అరెస్ట్



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్, రిమాండ్‌కు పంపిన ఉదం తం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐదేళ్ల క్రితం నగరానికి వచ్చిన ఓ కుటుంబం ఉప్పల్ ప్రాంతంలో తమ రెండో కుమార్తె (మైనర్)తో కల్సి కూలీనాలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. సొంత పని నిమిత్తం గత శనివారం భార్యాభర్తలు ఊరికి వెళ్లి మంగళవారం తిరిగి వచ్చే సరికి పొరుగున ఉండే సమల ఫణి (23) ఇంట్లో ఉండటం గమనించారు. అప్పటికే తమ కుమార్తె ఏడుస్తుండటంతో అనుమానించిన తల్లికి ఆ యువకుడు కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసింది. దీంతో యువకుడిపై చర్యలు తీసుకోవాలంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేర కు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసుకొని యువకుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ గుర్తింపు

**ప్రజాపక్షం/నవాబుపేట:** బాల్య వివాహాల నిర్మూలన కోసం కొనసాగుతున్న ఉద్యమానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ప్రతి సంవత్సరం నవంబర్ 27ను బాల్య, బలవంతపు వివాహాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించడాన్ని వికారాబాద్ జిల్లాలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సాధన సంస్థ స్వాగతించింది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జేఆర్‌సితో కలిసి బాల్య వివాహాల నివారణకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సాధన సంస్థ డైరెక్టర్ డా. ఆలూరి కామేశ్వరి తెలిపారు. పాఠశాలలు, పంచాయతీలు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు బాల్య వివాహాల ముప్పులో ఉన్న కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానిస్తున్నామని చెప్పారు. జేఆర్ సి వ్యవస్థాపకుడు భువన్ రిభు చేపట్టిన అంతర్జాతీయ ఉద్యమానికి సియెర్రా లియోన్ సహా పలు దేశాలు మద్దతు ఇవ్వగా, సెప్టెంబర్ 4న ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని ఆమోదించింది. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని సాధన సంస్థ పిలుపునిచ్చింది.

# విఆర్‌ఎ వారసులకు ఉద్యోగాలు

### ఎంపి ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శ్రవణ్ డిమాండ్



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** జిఒ 81, 85 ప్రకారం 61 ఏండ్లు పైబడిన విఆర్‌ఎల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇచ్చి దళిత, బలహీనవర్గాల కుటుంబాలను ఆదుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విఆర్‌ఎలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ విఆర్‌ఎ జెఎసి ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో విఆర్‌ఎ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమానికి ఎంపి ఆర్.కృష్ణయ్య, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ కుమార్, బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిఒల ప్రకారం రాష్ట్రంలోని 20,555 మంది విఆర్‌ఎల్లో 16,768 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేయగా, 3,797 మంది విఆర్‌ఎల వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందన్నారు. మూడు సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. రూ.లక్షల కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు కానీ విఆర్‌ఎలను క్రమబద్ధీకరించేందుకు ఏమవుతుందని ప్రశ్నించారు. గ్రామాన్ని కాపాడేవిఆర్‌ఎలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ధర్నాలో విఆర్‌ఎజెఎసి గౌరవాధ్యక్షుడు వంగూరు రాములు, రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, ఉపాధ్యక్షులు భరత్, హరీష్, సాగర్, శ్రీకాంత్, రవిసాగర్, యాదవ్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం, పరిశుభ్రతలపై అవగాహన సదస్సులు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రజ ల్లో పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించే లక్ష్యంగా అక్టోబర్ 8 వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. జిల్లా ఐడిఓసి కాంప్లెక్స్‌లో బుధవారం ఆయన 9వ పోషణ్ మాస పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నామన్నారు. పోషకాహార లోపం, రక్త హీనత నివారణ, గర్భిణీలు, బాలింతలు, శిశువుల ఎదుగుదల, సరైన పోషణ, అనుబంధ ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరైన అవగాహన అవసరమన్నారు. జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల పరిధి ప్రాంతాల్లో సామాజిక భాగస్వా మ్య కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా చిన్నారుల ఎత్తు, బరువు తదితర ఎదుగుదల ప్రమాణాలను పర్యవేక్షించటం, పోషకాహార ప్రదర్శనలు, ర్యాలీలు, సదస్సులు, ఇతర కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. స్థానికంగా లభించే వివిధ రకాల పోషక విలువలు కల్గిన ఆహార పదార్థాలను వినియోగించుకొంటూ సమతుల్య ఆహారం తీసుకోవాలో తెలియచేస్తారన్నారు.



## కాళోజీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ మాలతిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లా అధికారి చంద్రావతి, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు బాలానగర్ ఎసిపికి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి గౌరవానికి భంగం కలిగించేలా చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, పులి శ్రీకాంత్ పటేల్ గౌడ్, డిసిసి ఉపాధ్యక్షుడు పులి శివకుమార్‌గౌడ్, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు, డిసిసి అధికార ప్రతినిధి ఎ.మధుమోహన్, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు కావేటి నాగార్జున, యువజన కాంగ్రెస్ నాయకుడు కిట్టు, సత్యపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫామ్‌హౌస్ సంకెళ్లను తెంచుకుని అసెంబ్లీకి రా..

* బిఆర్‌ఎస్ నాయకులకు సవాల్ విసిరిన కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్
* వేయి డప్పుల దరువుతో ర్యాలీ





**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వేయి రోజుల ప్రజాపాలన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని బిఆర్‌ఎస్ నాయకులకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సవాల్ విసిరారు. దమ్ముంటే మాజీ సిఎం కెసిఆర్ ఫామ్‌హౌస్ సంకెళ్లను తెంచుకుని అసెంబ్లీకి రావాలని, ప్రజల ఓట్లతో గెలిచి ఫామ్‌హౌస్‌లో పడుకోవడం కాదు ప్రజా సమస్యలపై అసెంబ్లీ లో గళమెత్తాలని హితవు పలికారు. బుధవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్‌రెడ్డిలు చేసిన దూషణలకు నిరసనగా శామీర్‌పేట డివిజన్ తూంకుంటలోని దొంగల మైసమ్మ చౌరస్తా నుంచి వేల డప్పులతో ఆత్మగౌరవ ప్రదర్శన భారీ ర్యాలీ నిర్వహించి మందాయిపల్లి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లు డప్పులు కొట్టుకుంటు నృత్యాలు చేస్తు ర్యాలీలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్‌లు మాట్లాడుతూ దళిత స్పీకరైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అసభ్యపదజాలంతో దూషించిన ఎంఎల్‌సిలు తాత మధు, నవీన్‌రెడ్డిలను శాసనమండలి నుంచి సస్పెండ్ చేయాలని, గడ్డం ప్రసాద్‌కుమార్ కాళ్లు పట్టుకుని క్షమాపణలు కోరాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేస్తుంటే ఓర్వలేని బిఆర్‌ఎస్ నాయకులు కెటిఆర్, హరీష్ రావులు అసెంబ్లీ వద్ద మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పి వికృత ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. మాజీ సిఎం కెసిఆర్ తూంకుంట రోడ్డునుంచి గత పదేళ్లు రయ్..మని వెళ్లాడే కానీ ఈ రోడ్డు కోసం ఏనాడైనా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని, మా సిఎంను బద్నాం చేయాలని నల్ల టీషర్టులు వేసుకుని నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం చెందారు. తాత మధు, నవీన్‌రెడ్డిలు క్షమాపణలు చెప్పకుంటే బయట తిరుగనివ్వమ ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ ముజుబుద్దీన్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, శామీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నక్క సందీప్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి, అధ్యక్షుడు తుంకి రమేష్, దోసకాయల వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### కాళోజీ నారాయణరావు జయంతి సభలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని జిల్లాలో వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారీ ఆయనకు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాళోజీనారాయణ తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రపంచానికి తెలియజేసిన ప్రజాకవి అని అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజలజీవన విధానాన్ని తన సాహిత్యంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని పేర్కొన్నారు. సామాజిక అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. కాళోజీ ఆశయాలు, ఆలోచనా విధానం నేటి తరానికి సూర్తి దాయకమని, యువత ఆయన సాహిత్యాన్ని అ ధ్యయనం చేసి సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి జయపాల్‌రెడ్డి, డిఆర్‌ఎ స్వర్ణలత, ఆర్‌డిఒ వాసుచంద్ర , డిప్యూటీ కలెక్టర్ పూజ, వ్యవసాయ అధికారి కవిత, తదితరులు పాల్గొన్నారు.

**మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం**

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ఇంజనీర్ శరత్‌చంద్ర వినాయక చవిత పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిసి వినాయక చవతి సందర్భంగా వినాయక విగ్రహన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు పర్యావరణరహితమైన మట్టి వినాయకవిగ్రహలను మాత్ర మే ప్రతిష్టించి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో , ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాల ని ఆకాంక్షించారు. ప్రభుత్వ నిబంధనలు పాటి స్తూ, అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్, జెడ్పిసిఇఓ సుధీర్, మాధవరెడ్డి, తదితరు లు ఉన్నారు.

## సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/తాండూరు:** నేటి విద్యార్థులే రేపటి పౌరులని, ప్రతి విద్యార్థి సిపిఆర్‌పై అవగాహన కల్గి ఉండాలని కంచర్ల విజయలక్ష్మి పౌండేషన్ చైర్మన్ కంచర్ల విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కంచర్ల విజయలక్ష్మి పౌండేషన్ ఆధ్వర్యాన సిపిఆర్‌పై ప్రముఖ వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవ్వరైన ప్రమాద వశాత్తు కింద పడిపోయిన, స్పృహ తప్పి పడిపోయిన వెంటనే వారికి ముందుగా శ్వాసను పరిశీలించా లని, ఆ తరువాత నాడీ వ్యవస్థను పరిశీలించి సిపిఆర్ అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పదిమందిని రక్షించాలని కోరారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళశాల ఇంచార్జీ ప్రిన్సిపల్ నీలప్ప, ఉద్యాపకులు మల్లప్ప, పౌండేషన్ తాండూరు ఇంచార్జీలు అక్బర్ బాబ, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## నిమజ్జనానికి ముందే చెరువులు సిద్ధం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి(ఐఏఎస్) ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా (ఐఏఎస్) ఘట్‌కేసర్ సర్కిల్‌లోని ఎదులాబాద్ చెరువును పరిశీలించారు. గత పదేళ్లుగా నిమజ్జనం చేసిన విగ్రహాల అవశేషాలను దీర్ఘబాహు యంత్రంతో తొలగిస్తున్న పనులను పరిశీలించి రాబోయే నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఉప కమిషనర్ వాణిరెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ రమేష్ బాబు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు నరేష్, శ్రీనివాస్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామల అమరేందర్,రమేష్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.




## ఆర్‌ఎస్‌బి ఫ్యాక్టరీ సేల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన రష్మీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడలోని శ్రీలక్ష్మి కన్వెన్షన్‌లో ఆర్‌ఎస్‌బి ఫ్యాక్టరీ అవుట్‌లెట్ డబుల్ ధమాకా మెగా సేల్స్ ఎగ్జిబిషన్‌ను బుధవారం ప్రముఖ యాంకర్ రష్మీ గౌతమ్ ప్రారంభించారు. రాబోయే పర్వదినాన్ని పురస్కరించుకుని కుటుంబంలోని అన్ని తరాల వారి అభిరుచులను ప్రతిబింబిస్తూ, సంప్రదాయ శైలి మొదలుకుని, ఆధునికత ఉట్టిపడే వైవిధ్యభరితమైన ఉత్పత్తులు ఆర్‌ఎస్‌బి ఫ్యాక్టరీ అవుట్‌లెట్ డబుల్ ధమాకా మెగా సేల్స్ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని ఆమె అన్నారు. 9వ తేదీ నుండి 16వ తేదీ వరకు మెగా సేల్స్ అందుబాటులో ఉంటుందని, ఆర్‌ఎస్‌బి ఎగ్జిబిషన్ సేల్‌కు విచ్చేసి హోల్‌సేల్ ధరలకు నేరుగా ఫ్యాక్టరీ ఉత్పత్తులను ఎంపిక చేసుకోవాలని నిర్వహకులు తెలిపారు.

## బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ సిగ్గుచేటు

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ప్రజాపక్షం /కూకట్‌పల్లి :** ప్రజల సమస్యలను శాసనసభలో లేవనెత్తే అవకాశం లేకుండా బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కడం హేయమైన చర్య అని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బిఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుందని కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజల భూములకు సంబంధించిన 22ఏ సమస్యను పరిష్కరించి, అర్హులైన వారి భూములను ఆ జాబితా నుంచి తొలగించే వరకు పోరాడుతామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదన్నారు. తెలంగాణలో ప్రజా సమస్యలు శాసనసభ దృష్టికి రాకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం బిఆర్‌ఎస్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే బిజెపి, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణలో మాత్రం బిఆర్‌ఎస్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నాయని కృష్ణారావు ఆరోపించారు.



## స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్య విలీనం తగదు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యారంగాన్ని విలీనం చేసే ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేసారు. ఈ డిమాండ్‌తో రామంతాపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు 21వ రోజుకు చేరుకొంది. ప్రభుత్వం జిఓ 97 తో స్కిల్ యూనివర్సిటీలో విలీనంచేసి తమ విద్యావిధానానికి తూట్లు పొడిచే యత్నాలకు పాల్పడుతున్నారన్నారు. దీంతోపాటు పాలిటెక్నిక్ కళాశాలల ప్రభుత్వ స్థలాలను ప్రయివేట్‌పరం చేసే కుట్ర దీని వెనుక ఉన్నట్లు తెలుస్తోందని, ఇప్పటికైనా తమ ఆందోళనలను విరమించేలా ప్రభుత్వ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## నాగారం డివిజన్‌కు 500 వీధిదీపాలు అందజేసిన జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం డివిజన్ పరిధిలో ప్రజల భద్రత,సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి 500 వీధిదీపాలను విరాళంగా ఆందజేశారు. డివిజన్ పరిధిలో అవసరమైన ప్రాంతాలలో ప్రజలకు రాత్రి వేళలో మెరుగైన వెలుతురు,భద్రత కల్పించేలా వీధిదీపాలను ఏర్పాటు చేయాలని ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణికి అందజేసిన లేఖలో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూమయ్యయాదవ్, శ్రీశైలం, బాలనర్సింహ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/బొంరాస్‌పేట్ :** కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో తెలంగాణ తొలిముఖ్యమంత్రి కెసిఆర్ చావు కోరిన షాద్‌నగర్ ఎమ్మెల్యేశంకర్‌పై చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ మండల బీసీ సెల్ మాజీ అధ్యక్షులు రవిగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చావు కోరిన ఎమ్మెల్యేపై స్పీకర్ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా జీవితంలో వున్నా నాయకులు బాధ్యతాయుతమై బాషను మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, మహేందర్‌రెడ్డి, అనంత్‌గౌడ్, సురిగౌడ్, సలాం , శ్రీశైలం పాల్గొన్నారు.

## లిఫ్ట్‌లో పడి యువకుడి దుర్మరణం



ప్రజాపక్షం/మియాపూర్ : లిఫ్ట్ వస్తుందని ఎదురుచూసిన యువకుడు డోర్ తెరిచి ముందుకు అడుగు వేశాడు. కానీ అక్కడ లిఫ్ట్ లేదు.. క్షణాల్లోనే నాలుగో అంతస్తు నుంచి గుంతలో పడిపోయాడు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికులను కలచివేసింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ ఫేజ్5, బ్లాక్ బీ3లో వెంకటేష్ తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి నాలుగో అంతస్తులో నివసిస్తున్నారు. ఆయన కుమారుడు విజయ్ బాబు (24) కు వినికిడి, చూపునకు సంబంధించిన ఇబ్బందులతోపాటు మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం విజయ్‌బాబు నాలుగో అంతస్తులోని లిఫ్ట్ వద్దకు వెళ్లి డోర్‌ను తెరిచాడు. ఆ సమయంలో లిఫ్ట్ మొదటి అంతస్తులో ఉన్న విషయాన్ని గుర్తించకుండా ముందుకు కాలు వేయడంతో ఒక్కసారిగా గుంతలోకి జారిపోయాడు. నాలుగో అంతస్తు నుంచి పడిన అతడు మొదటి అంతస్తులో నిలిచి ఉన్న లిఫ్ట్ పైభాగంపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో విజయ్‌బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్ద శబ్దం రావడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యు లు, అపార్ట్‌మెంట్‌వాసులు వెంటనే అతడిని బయటకు తీసి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే విజయ్‌బాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. నాలుగో అంతస్తులో లిఫ్ట్ లేకున్నా డోర్ ఎలా తెరుచుకుందనే అంశంతోపాటు లిఫ్ట్ భద్రతా వ్యవస్థ, నిర్వహణ పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గురువుల సేవలు చిరస్మరణీయం



ప్రజాపక్షం/శంకర్‌పల్లి:ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని గణేష్‌నగర్ వార్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలను బుధవారం శంకర్‌పల్లి మాజీ సర్పంచ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాము, రాకేష్, కన్న, పాషా, తరుణ్, వంశీ, సన్నీ, మణి, శ్రీరామ్ పాల్గొన్నారు.

## కాళోజీ ఆశయసాధనకు కృషి



ప్రజాపక్షం/షాద్‌నగర్: కాళోజీ నారాయణరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని షాద్‌నగక్ తాలుకా జెఎసి చైర్మన్ మూలే జనార్ధన్ కోరారు. బుధవారం షాద్‌నగర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, కన్వీనర్ నక్కబాల్‌రాజ్ యాదవ్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, శ్రీహరి, రామారావు, కృష్ణయ్య, వెంకటరమణ, క్రాంతికుమార్,గోర్ల రాము, వేణుగోపాల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వావిలాల సుజీవన్, శ్రీధర్, ముబారక్, సుధాకర్‌రెడ్డి, చందులాల్, గోదా మాదవులు, షర్పుద్దీన్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా పోషకార మాసం



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో బుధవారం పోషక మాసం కార్యక్రమం జరిగింది. పోషకాహారం చిరు ధాన్యాల ప్రాముఖ్యతపై ఆకు కూరల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. పెరటి తోటల పెంపకం,ప్రాముఖ్యత, కిచేన్ గార్డేన్ గురించి వివరించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిషన్, మాజీ ఎంపిటిసి లక్ష్మి పతి గౌడ్,మాధవి, వార్డు సభ్యురాలు మాధవి, పంచాయతి కార్యదర్శి పుష్పలత, ఎన్‌జిఓ సంస్థ ప్రతినిధి కృష్ణ, మేఘన, రవిప్రసాద్, రాజు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ తులసి తదితరులు హజరైనారు.

## భూగర్భ జలాల వృద్ధికి కృషి

ప్రజాపక్షం/యాచారం : భూగర్భజలాల పెంపు కోసం ప్రతిఒక్కరు ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవాలని యాచారం ఎంపిడిఓ రాధరాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్కిజ్‌గూడ గ్రామంలో ఫారం పాండు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ భూగర్భ నిల్వల పెంపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అసిసేంట్ ఇంటజనీర్ శివశంకర్ రెడ్డి, అసిస్టెంట్ కృష్ణామాచారి, కూలీలు పాల్గొన్నారు.


## అడ్డంకులు సృష్టిస్తున్న బిఆర్ఎస్ నేతలు



ప్రజాపక్షం/షాద్‌నగర్ : శాసన సభ సమావేశాలు సజావుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే అడ్డంకులు సృష్టిస్తున్నదేవరో తెలంగాణ రాష్ట్ర ప్రజలు గ్రహించాలని రాష్ట్ర గిరిజన ఆదివాసి విభాగం కోఆర్డినేటర్ పి.రఘునాయక్ కోరారు. బుధవారం షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యకూడలి వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, కెటిఆర్, హరిష్‌రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, రమేష్, చంద్రశేఖర్, కుమారస్వామి గౌడ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

### తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి





ప్రజాపక్షం/రంగారెడ్డి: రసాయనిక మందుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకుని, పంటల వైవిధ్యీకరణ ద్వారా వ్యవసాయంలో స్థిరమైన ఆదాయాన్ని సాధించాలని ఆయన సూచించారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో కొంగరకలాన్‌లోని ఐడిఓసిలో బుధవారం జిల్లా స్థాయి కిసాన్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోదండరెడ్డి, అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆత్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయ అధికారి సుజాత జిల్లాలో వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతి, అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ రసాయనిక మందుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు అమలు చేస్తున్న అన్ని పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వరి సాగును తగ్గించి కూరగాయల సాగు వైపు రైతులు మళ్లాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రతి రైతు నేల ఆరోగ్యం (సాయిల్ హెల్త్)పై అవగాహన పెంచుకోవాలని, తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆత్మ పిడి మధుమోహన్ ఆత్మ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, రైతులకు అందుతున్న సేవలపై అవగాహన కల్పించగా హయత్‌నగర్ కెవికె శాస్త్రవేత్తలు పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటలు, సుస్థిర వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. అనంతరం ముఖ్య అతిథులు, జిల్లా అధికారులు, రైతులు ఏర్పాటు చేసిన 15 రకాల స్టాళ్లను సందర్శించి, వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, సాంకేతికతలు,సేవలను పరిశీలించారు.

### కూరగాయల సాగుకు ప్రోత్సాహం

కూరగాయల సాగును ప్రోత్సహించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖల సమన్వయంతో కొంగరకలాన్ లోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్(ఐడిఓసి)లో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాలో రైతులకు 80 వేల చేతితో అంటుకట్టిన టమాటా మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన ఈ కిసాన్ మేళాలో పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటలు, సుస్థిర వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, భూసార పరిరక్షణతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎం.కోదండరెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.సురేష్, అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ డిఎలు విడుదల చేయాలి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఆరు డిఎలు తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం షాద్‌నగక్ ఆర్‌డిఓ కార్యాలయంలో వద్ద ఈనెల 10న నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ రెండవ పిఆర్‌సిని తక్షణమే అమలు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఆరు డిఎలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని, ఓపిఎస్‌ను పునరుద్దరించాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయడం, జీవో 317 ద్వారా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత, ఏఓ జ్యోతి, డిటిలు బాలవర్ధన్, మధు, సీనియర్ అసిస్టెంట్లు చంద్రమోహన్, స్వర్ణకుమారి, ప్రవీణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు ప్రవలిక, శోభతోపాలు ఉపాధ్యాయులు తిరుమలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ రచనలు నేటితరానికి స్ఫూర్తిదాయకం

### సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: కాళోజీ రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, సామాజిక రుగ్మతలు, అన్యాయాలు, అసమానతలపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కాళోజీ నారాయణరావు చేసిన కృషి మరువలేనిదని సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం రమేష్ రెడ్డి అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతికి విశేష సేవలందించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాళోజీ సాహితీ, సామాజిక సేవలను అధికారులు, పోలీసు సిబ్బంది స్మరించుకున్నారు. ప్రజల భాషలోనే ప్రజల సమస్యలను తన రచనల్లో ప్రతిబింబించిన కాళోజీ .. తెలంగాణ ప్రజల జీవన విధానం, కష్టాలు, ఆకాంక్షలకు తన కలంతో గొంతుకగా నిలిచారని సిపి తెలిపారు. సామాజిక రుగ్మతలు, అన్యాయాలు, అసమానతలపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. తెలంగాణ భాషకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో కాళోజీ పాత్ర కీలకమన్నారు. తెలంగాణ యాసను, ప్రజల నుడికారాన్ని సాహిత్యంలో గౌరవప్రదంగా నిలిపిన ఆయన రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అర్థం చేసుకుని, వాటిపై స్పందించే తత్వం కాళోజీ నుంచి ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీసు ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొని కాళోజీకి ఘనంగా నివాళులర్పించారు.

## తెలంగాణ ఆకాంక్షను చాటిన కాళోజీ

ప్రజాపక్షం/రంగారెడ్డి: తెలంగాణ ప్రజల జీవన విధానం, వారి కష్టాలు, ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కోదండరెడ్డి, కిరణ్మయి హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల జీవన విధానం, వారి కష్టాలు, ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన ప్రజాకవి అని, తెలంగాణ భాష,సంస్కృతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తాయని, కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని



కాళోజీ జయంతిని నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. తెలంగాణ మాండలిక భాషకు, ప్రజల యాసకు కాళోజీ విశిష్టమైన గుర్తింపు తీసుకు వచ్చారని తెలిపారు. సమాజంలోని అసమానతలు, అన్యాయాలపై తన రచనల ద్వారా ప్రశ్నించిన కాళోజీ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలుగు భాషను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారి కేషు రామ్, కలెక్టరేట్ ఏ.ఓ సునిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అర్హులైన ఓటర్లు 'సర్' సద్వినియోగం చేసుకోవాలి

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి స్వర్ణ మాధవి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఎస్ఐఆర్ ను సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, సాహెబ్ నగర్ డివిజన్ కోఆర్డినేటర్ సర్వ మాధవి పేర్కొన్నారు. టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గడ్ ఆదేశాల మేరకు బుధవారం సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో భవాని ఎంక్లేవ్‌లో ఎస్ ఐ ఆర్‌పై కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ మాధవి మాట్లాడుతూ సమగ్ర ఓటరు నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డివిజన్లోని అర్హులైన ఓటర్ల ఓట్లను కోల్పోకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. సాహెబ్ నగర్ డివిజన్‌లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరికి ఓటర్ నమోదును చేయించడానికి బి ఎల్ ఓ లకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సహకరించాలన్నారు. ఆదేవిధంగా మధుయాష్కీ గౌడ్ ఆదేశాల మేరకు డివిజన్‌లో పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ముందంటుందని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సాహెబ్ నగర్ డివిజన్ ఎస్సీ సెల్ చైర్ పర్సన్ సరస్వతి, నాయకులు రాంబాబు గౌడ్, నందకిషోర్, శశికాంత్, బోడ రాజశేఖర్, సూర్యనారాయణ గౌడ్, శంకర్ నాయక్, కొత్త శ్రీధర్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, పారంద స్వామి, శ్రీనివాస్ గౌడ్, విష్ణువర్ధన్, వరుణ్ గౌడ్, సోమయ్య గౌడ్, నాగేందర్, చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధికి సహకరించండి

ప్రజాపక్షం/కొత్తూరు: పంచాయతీల అభివృద్ధికి అధికారులు పూర్తి స్థాయిలో సహకరించేందుకు కృషి చేయాలని సర్పంచ్‌లు కోరారు. బుధవారం కొత్తూరు మండల అభివృద్ధి అధికారిణి అరుంధతి అధ్యక్షతన మండల సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని మక్తగూడ గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, దాంతో వాటర్‌మెన్ భగీరథ నీటితోపాటు బోరు వాటర్ జత చేసి సరఫరా చేస్తుండటంతో కాలుష్యం నీటిలో ఉండిపోయి సక్రమంగా తాగునీరు రావడం లేదని సభ దృష్టికి సర్పంచ్ శ్రీరాములు తీసుకువచ్చారు. సంబంధిత అధికారులు స్పందిస్తూ భగీరథ నీరు సక్రమంగా వచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎక్కడ పడితే అక్కడ పైపులైన్లు లీకేజీలు, మరమ్మత్తులు సక్రమంగా లేవని, గ్రామాల్లో ఉన్న నీటి ట్యాంకుల్లోకి నీరు చేరడం లేదని సర్పంలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు తాగునీరు ఇవ్వకుంటే మీరు ఎందుకు అని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ పైపులైన్లు వేసి అనేక ఇబ్బందులు సృష్టిస్తున్నారని సర్పంచులు వాపోయారు. శిథిలావస్థకు చేరిన స్థంబాల స్థానంలో కొత్త వాటిని వేస్తామని అధికారులు వివరించారు. సమావేశంలో తహసీల్దార్ ముంతాజ్ భేగం, డిప్యూటి తహసీల్దార్ జంగయ్యతోపాలు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మియాపూర్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

### సీజ్ బోర్డులకే సీజ్?

### మక్తా మహబూబ్‌పేట్ సర్వే నంబర్ 44లో అనుమతుల్లేని నిర్మాణాలు

### ప్రజావాణిలో సిఎంసి కమిషనర్‌కు 20 ఫిర్యాదులు

ప్రజాపక్షం/మియాపూర్ : అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలను అధికారులు సీజ్ చేస్తారు. అక్రమ నిర్మాణాలు ఆగిపోయాయని ప్రజలు నమ్ముతారు. కానీ కొద్దిరోజులకే సీజింగ్ బోర్డులు మాయమై మళ్లీ పనులు మొదలైతే.. ఆ సీజ్‌కు అర్థమేమిటి? అధికారుల ఆదేశాలకు విలువెక్కడుంది? మియాపూర్ మక్తా మహబూబ్‌పేట్‌లోని సర్వే నంబర్ 44 పరిధిలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ నిర్మాణాల వ్యవహారం ఇప్పుడు ఈ ప్రశ్నలనే లేవనెత్తుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్న నిర్మాణాలపై సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సిఎంసి కమిషనర్ సృజనకు 20 ఫిర్యాదులు అందజేసినట్లు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు తౌటిరెడ్డి సంతోష్‌రెడ్డి తెలిపారు. ప్రజలు పదేపదే ఫిర్యాదు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

**సీజ్ బోర్డులు తొలగించి మళ్లీ పనులా?....** సిఎంసి అధికారులు గతంలో సీజ్ చేసిన కొన్ని భవనాలకు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి తిరిగి నిర్మాణాలు చేపడుతున్నట్లు సంతోష్‌రెడ్డి ఆరోపించారు.కొన్ని భవనాల్లో నిర్మాణాలను పూర్తిచేసి గృహప్రవేశాలు కూడా నిర్వహిస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై గతంలో నోటీసులు జారీ చేసినప్పటికీ పనులు కొనసాగుతుండటం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల ఒత్తిళ్ల కారణంగానే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిర్మాణాలు నిజంగా అనుమతులకు విరుద్ధంగా ఉంటే వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

**ప్రజలను కలవకుండా తప్పించుకుంటున్నారా?...** మియాపూర్ సర్కిల్48 డిప్యూటీ కమిషనర్ జి. శ్రీనివాస్ ప్రజల సమస్యలపై స్పందించడం లేదని, విజిటింగ్ అవర్స్‌లో కార్యాలయానికి వచ్చే ప్రజలను కూడా కలవకుండా వ్యవహరిస్తున్నారని సంతోష్‌రెడ్డి ఆరోపించారు. ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాల్సిన అధికారులే ప్రజలకు అందుబాటులో లేకపోతే సామాన్యులు ఎవరిని ఆశ్రయించాలని నిలదీశారు. ప్రజావాణిలో వచ్చిన




ఫిర్యాదులను పక్కనపెట్టి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించేలా అధికారులు వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై సిఎంసి ఉన్నతాధికారులు, సైబరాబాద్ కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

**విజిలెన్స్, ఎసిబి విచారణ జరపాలి...** అక్రమ నిర్మాణాల వెనుక అధికారుల పాత్ర ఉందా? రాజకీయ ఒత్తిళ్లతో చర్యలు నిలిచిపోయాయా? అనే విషయాలను తేల్చేందుకు విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

సీజ్ బోర్డులు తొలగించి నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు విచారణలో తేలితే సంబంధిత బిల్డర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదులు చేసిన ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా,ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సిఎంసి ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబర్ 44 లోని నిర్మాణాల అనుమతులు, సీజింగ్ వివరాలు, నోటీసులు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై క్షేత్రస్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉంది.



## జలవనరులు కాపాడేందుకు.. మట్టి వినాయక విగ్రహాలకే పూజలు

### హెచ్ఎండిఏ జాయింట్ కమిషనర్ శ్రీవత్స కోట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో హెచ్ఎండిఏ బుధవారం తన కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. హెచ్ఎండిఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవత్స కోట ఈ కార్యక్రమంలో పాల్గొని విగ్రహాలను పంపిణీ చేశారు. పండుగలను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా బాధ్యతాయుతంగా జరుపుకోవాలని, జల వనరులు, పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి విగ్రహాలనే వినియోగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీకి నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాలోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆయనకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. సాహిత్యం, పౌర హక్కులు, సామాజిక ఉద్యమాలు, ప్రజా చైతన్యానికి తన జీవితాన్ని అంకితం చేసిన కాళోజీ, ప్రజల గళంగా, హక్కుల కోసం అనేక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తెలుగుతో పాటు మరాఠీ, కన్నడ, హిందీ, ఉర్దూ భాషల్లోనూ రచనలు చేసిన బహు భాషా సాహిత్యవేత్తగా పేరు గడించిన కాలోజీ, తెలంగాణ భాష, సాహిత్యం, సాంస్కృతిక వారసత్వానికి చేసిన సేవలు నేటికీ స్ఫూర్తినిస్తున్నాయని కమిషనర్ అన్నారు. కాళోజీకి నివాళులు అర్పించిన వారిలో అదనపు కమిషనర్ (ఆరోగ్యం పారిశుద్ధ్యం) ఎన్.రవికిరణ్, సిపిఆర్ఓ మొయిజుద్దీన్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శారద తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టులో మట్టి గణేశ్ విగ్రహాల పంపిణీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యావరణహిత గణేశ్ చతుర్థి వేడుకలను ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో మట్టి గణేశ విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, పలువురు న్యాయవాదులతో పాటు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ వారికి మట్టితో తయారు చేసిన గణేశ్ విగ్రహాలను అందచేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌కు బదులుగా సహజమైన మట్టి విగ్రహాలను ఎంచుకుని పండుగను బాధ్యతాయుతంగా జరుపుకోవాలని ఈ కార్యక్రమం పౌరులకు పిలుపునిచ్చింది. సామూహిక భాగస్వామ్యం, సుస్థిర పండుగ వేడుకలు, సరైన నిమజ్జన ఏర్పాట్ల ప్రాముఖ్యతను ప్రధాన న్యాయమూర్తి నొక్కిచెప్పగా, ఈ చొరవకు న్యాయమూర్తులు, న్యాయవాదుల నుంచి విశేష ప్రశంసలు లభించాయి.

## ఎమ్మెల్యే శ్రీగణేష్‌పై ఫిర్యాదు

**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌పై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్టు చేసి కుట్రపూరితంగా బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని.. అయితే కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తన పిఎ, ఫొటోగ్రాఫర్, అనుచరులకు ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయాలని ఆదేశాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్‌పై కేసు నమోదు చేయాలని మన్నె క్రిశాంక్, ఇతర బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు.


## పర్యావరణాన్ని కాపాడుకుందాం



**ప్రజాపక్షం/పంజాగుట్ట :** మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామనే లక్ష్యంగా టిజిపిసిబి ఆధ్వర్యంలో పంజాగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మట్టి గణపతుల తయారీ, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చార్మినార్ మండల డిప్యూటీ డీఈఓ శ్రవణ్ కుమార్, పిసిబి ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఆర్.రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## ఎంపి అనిల్‌కుమార్‌కు శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/చార్మినార్/అబిడ్స్ :** రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని అనిల్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలాఉండగా.. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి కె.వెంకటేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొని అనిల్ కుమార్ యాదవ్‌కు శాలువాకప్పి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# హాస్టళ్ల మార్పునకు 3 నెలల గడువు




జనవరి నుంచి హైడ్రా తనిఖీలు : హైడ్రా రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని హాస్టళ్లలో నివసించే వారి భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పటిష్టమైన, అన్ని అనుమతులున్న భవనాల్లోకి హాస్టళ్లను తరలించేందుకు నిర్వాహకులకు మూడు నెలల గడువు ఇచ్చినట్టు తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి తనిఖీలు చేపట్టి, కూలే ప్రమాదమున్న భవనాలను తొలగిస్తామని వెల్లడించారు. ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు మృతి చెందడం, పక్క భవనాలు దెబ్బతినడంతో పాటు ఢిల్లీలో ఈ నెల 6న హాస్టల్ భవనం కూలి ఏడుగురు చనిపోయిన ఘటనల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. ఈ మేరకు బుధవారం హైడ్రా కార్యాలయంలో హాస్టళ్ల నిర్వాహకులు, భవన యజమానులతో సమావేశం నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, నిర్మాణ పటిష్టత వంటి అంశాల్లో రాజీ పడొద్దని కమిషనర్ సూచించారు. తక్కువ ఫీజుల కోసం విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని, పిల్లల భద్రతకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 50 గజాల్లో ఏడంతస్తుల భవనాలు నిర్మిస్తే అవి సూసైడ్ బాంబర్లుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే అంజయ్యనగర్‌లో కూలిన భవనం పక్కన ప్రమాదకరంగా ఉన్న మరో ఆరు భవనాలను తొలగించినట్టు తెలిపారు. మూడు కార్పొరేషన్‌లతో సమన్వయం చేసుకుని అనుమతుల్లేని భవనాల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లపై తనిఖీలు చేపడతామని కమిషనర్ వెల్లడించారు. అనుమతుల్లేని, కాలపరిమితి దాటిన కట్టడాలతో పొంచిఉన్నముప్పును హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య వివరించారు.



## కూకట్‌పల్లి ఐడిఎల్ చెరువులో.. నిమజ్జనానికి హైడ్రా భగీరథ ప్రయత్నం


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కూకట్‌పల్లిలోని ఐడిఎల్ చెరువులో గణేశ్ నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా హైడ్రా ముమ్మర ఏర్పాట్లు చేపట్టింది. ప్రధాన రహదారి వైపు చెరువును లోతుగా తవ్వి నీటితో నింపేందుకు చర్యలు చేపట్టిన హైడ్రా, ఇప్పటికే 20 అడుగులకు పైగా పూడికను తొలగించి ఊట నీరు చేరేలా ఏర్పాట్లు చేసింది. చెరువు తవ్వకంలో నేరుగా చేరిన మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కొబ్బరి పీచు వంటివి పెద్ద మొత్తంలో బయటపడుతున్నాయి. దశాబ్దాలుగా పేరుకుపోయిన పిఓపి వల్ల చెరువులో కాలుష్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు ఇంకే పరిస్థితి కూడా లేకుండా పోయిందని అధికారులు తెలిపారు. రాంకీ సంస్థ సహకారంతో పర్యావరణానికి ముప్పు లేకుండా ఈ పూడికను తొలగిస్తున్నారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ స్వయంగా చెరువును సందర్శించి ఏర్పాట్లను సమీక్షించి, నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావుతో పాటు స్థానిక నాయకులు కూడా కమిషనర్‌ను కలిసి ఏర్పాట్లు చేయాలని కోరారు. నిమజ్జనం అనంతరం పూర్తిస్థాయిలో పూడిక తొలగించి 72 ఎకరాల మేర చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్టు రంగనాథ్ వెల్లడించారు.

## ప్రజా సమస్యలు గాలికొదిలేసి కాంగ్రెస్, బిఆర్ఎస్ వీధి నాటకాలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ప్రజా సమస్యలను విస్మరించి రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఎ నిషేధిత భూముల సమస్య, ఉద్యోగుల డిఏలు, పిఆర్‌సి, ఎల్‌నినో ప్రభావం, రైతుల సాగునీరు, ప్రజలకు తాగునీరు వంటి కీలక అంశాలపై చర్చించాల్సిన అసెంబ్లీని ఇరు పార్టీలు వ్యక్తిగత దూషణలకు వాడుకుంటున్నాయని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. బిజెపి ఇచ్చిన వాయిదా తీర్మానాలను కూడా చర్చకు రాకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని బిజెపి కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## మట్టి గణపతులనే పూజిద్దాం



స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి సూచించారు. సమాచార శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ పండుగలను పర్యావరణహితంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని కోరారు. జల వనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు మట్టి గణపతులనే పూజించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్‌తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.




## కెడిఆర్ అకాడమీ హవా

**ప్రజాపక్షం/తార్నాక :** జాతీయ స్థాయిలో నిర్వహించే టైకా ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కెడిఆర్ సంస్థ ద్వారా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తూ ఎంతో మందికి ఉపాధి కూడా కల్పిస్తున్న సంస్థ యజమాని, శిక్షకుడు కె. దయాకర్‌రావుని అభినందించారు. కెడిఆర్ హబ్సిగూడ శాఖ బాల బాలికలు విశాల్, విహాన్ బంగారు పతకాలు సాధించగా.. సాన్విత, అలీ, ధ్యాన్, నిరవ్ వెండి పతకాలను.. అయాన్ కాంస్య పతకం గెలుపొందారు.

## గిగ్ కార్మికులకు 5 ప్రగతి కేంద్రాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో వివిధ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్, డెలివరీ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం, జెప్టో సంయుక్తంగా 'ప్రాజెక్ట్ ప్రగతి' కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఇందులో భాగంగా నగరంలో ఐదు ప్రగతి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఇరు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. రోడ్లపై ఎక్కువ సమయం గడిపే గిగ్ కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యం. 2024లో నిర్వహించిన హీట్‌వాచ్ సర్వే ప్రకారం, నగరంలో 69 శాతం మంది గిగ్ కార్మికులకు పరిశుభ్రమైన మరుగుదొడ్ల సదుపాయం లేదని, 80 శాతానికి పైగా మందికి పని సమయంలో నీడలో విశ్రాంతి సదుపాయం అందుబాటులో లేదని వెల్లడైంది. జెప్టో డెలివరీ భాగస్వాములతో పాటు క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ, ఈకామర్స్, అపారెల్ రంగాల్లోని గిగ్ కార్మికులందరికీ ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. వీటిలో సురక్షిత విశ్రాంతి స్థలం, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స, మొబైల్ ఛార్జింగ్, వైఫై, ఆరోగ్య శిబిరాలు, ఈశ్రమ్ నమోదుపై అవగాహన వంటి సదుపాయాలు కల్పించనున్నారు. వీటి ఏర్పాటు, నిర్వహణ ఖర్చులను జెప్టో భరించనుంది. ఈ సందర్భంగా మెట్రోపాలిటన్ ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ నగర ఆర్థిక వ్యవస్థలో గిగ్ కార్మికుల పాత్ర కీలకంగా మారుతోందన్నారు. జెప్టో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వికాస్ శర్మ మాట్లాడుతూ దేశంలో గిగ్ వర్కర్స్ 2029–30 నాటికి 2.35 కోట్లకు చేరనుందని, ఈ నేపథ్యంలో కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించడం అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి.సృజన, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ బి.సంతోష్, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధి గుప్తా, డిటిసిపి డైరక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డి, ఎంఎంసి అదనపు కమిషనర్(అడ్మిన్) వేణు గోపాల్, సిఎంసి చీఫ్ సిటీప్లానర్ బి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ధర్నా వాయిదా సరికాదు

### చంద్రశేఖర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ధర్నాను వాయిదా వేయడం ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లడమేనని తెలంగాణ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. సెప్టెంబర్ 18న ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తుందనే నమ్మకంతో ధర్నాను వాయిదా వేయడం సమంజసం కాదన్నారు. పిఆర్‌సి అమలు, పెండింగ్ డిఎల విడుదల, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఉద్యోగుల ఆరోగ్య పథకం సమస్యల పరిష్కారం వంటి డిమాండ్లపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు. సెప్టెంబర్ 18న ఇచ్చే హామీలు స్పష్టంగా, కాలపరిమితితో ఉండాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ ఉద్యోగ సంఘాలను కలుపుకుని ప్రభుత్వంపై పోరాటం చేస్తామని చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.



## ప్రజాకవి కాళోజీకి నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** పద్మవిభూషణ్, ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు, దివంగత ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి, తెలుగు భాషా దినోత్సవం వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు టిజిపిసిబి సభ్యకార్యదర్శి జి.రవి, అధికారులు, సిబ్బంది కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదిలాఉండగా... జలమండలిలో కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రభు, కేదారేశ్వరి, కిరణ్ కుమార్, మహేష్ కుమార్, సీజీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

## కెసిఆర్‌పై అట్రాసిటీ కేసు పెట్టాలి

### సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో దేవని సతీశ్ ఫిర్యాదు



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** మాజీ సిఎం కెసిఆర్ ప్రోత్సాహంతోనే బిఆర్ఎస్ ఎంఎల్‌సి తాతా మధు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాల, మాదిగ సంఘాల జెఎసి చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్ మాదిగ అన్నారు. ఈ మేరకు కెసిఆర్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లో మాట్లాడుతూ దళితులను అవమానించేలా కెసిఆర్ వ్యవహరించారన్నారు. స్పీకర్‌పై ఎంఎల్‌సి తాతా మధు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తాము ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద డప్పు చప్పుళ్లతో నిరసన తెలిపామన్నారు. అయితే, తాము దళితులమనే కారణంతో ఫామ్‌హౌస్ రోడ్డుపై నడిచినందుకు ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కెసిఆర్ శుద్ధి చేయించారన్నారు. దీన్నిబట్టి దళితుల పట్ల ఆయనకున్న వివక్షకు నిదర్శనమన్నారు. కెసిఆర్ చర్యలకు నిరసనగా గురువారం ట్యాంక్‌బండ్ 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పసుపు నీళ్లతో శుద్ధి చేస్తామని సతీశ్ మాదిగ స్పష్టం చేశారు.

## పేపర్‌బాయ్ @ డా.నగేష్

### పేదరికాన్ని జయించి ఉస్మానియా నుంచి పిహెచ్‌డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** కూలీ పనులకు వెళ్లి.. న్యూస్ పేపర్లు వేసి.. ఉద్యమాల్లో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నా... ఏదీ ఆయన లక్ష్యానికి అడ్డుకాలేకపోయాయి. కడు పేదరికం అనుభవిస్తూనే ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పట్టా అందుకునే స్థాయికి చేరుకున్న తుంగతుర్తికి చెందిన డా.పాల్వాయి నగేష్ స్ఫూర్తినిస్తున్నాడు. సూర్యాపేట్ జిల్లా తుంగతుర్తికి చెందిన పాల్వాయి ఎల్లయ్య, రామనర్సమ్మ దంపతుల కుమారుడు పాల్వాయి నగేష్ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనబరిచారు. విద్యతో పాటు సామాజిక స్పృహతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రవ్యాప్త పాదయాత్రలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలోనే 'భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ' అనే అంశంపై పరిశోధన చేసి పరిశోధన గ్రంథాన్ని సమర్పించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతులమీదుగా పాల్వాయి నగేష్ అధికారికంగా పిహెచ్‌డి పట్టాను అందుకున్నారు. పేదరికాన్ని జయించి ఉన్నత పట్టాను పొందిన నగేష్ అందరికి ఆదర్శంగా నిలిచారు.



## తలసేమియాపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వంశపారంపర్యంగా వచ్చే జన్యుపరమైన రక్త సంబంధిత వ్యాధులైన తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాపై అక్టోబర్ 2325 తేదీల్లో అంతర్జాతీయ అవగాహన సదస్సును హెచ్ఐసిసి నోవాటెల్‌లో నిర్వహించనున్నట్టు తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్) చీఫ్ మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్, సెక్రటరీ డా.సుమన్ జైన్, వైస్‌ప్రెసిడెంట్ రత్నావలి తెలిపారు. బుధవారం నగరంలో సొసైటీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఇటీవల తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాపై మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. ముందస్తు స్క్రీనింగ్, వ్యాధి నిర్ధారణ, నివారణ, సకాలంలో చికిత్సపై సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ డా.పద్మ అవగాహన కల్పించినట్టు వివరించారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డా.శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్ డా.శంకర్, వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఎంపిహెచ్, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

## 18న ఆదివాసీల మహాధర్నా




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** షెడ్యూల్ తెగల జాబితా నుంచి లంబాడి సామాజిక వర్గాన్ని తొలగించడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న ధర్నాచౌక్ వద్ద చలో ఆదివాసుల ఆత్మఘోష మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు ఆదివాసి సంఘాలు ప్రకటించాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసి సంఘాల నాయకులు వెంకటరమణ, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, శ్రావణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనలో ఆదివాసీ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు తమ సామాజిక వర్గ అభివృద్ధికి అడ్డంకిగా మారిన లంబాడీలను షెడ్యూల్ తెగల జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న ఇందిరా పార్కు ఆదివాసీల ఆత్మ ఘోష మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మీడియా సమావేశంలో ఆదివాసీ నాయకులు రామలింగయ్య, పాపయ్య పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లు అరెస్ట్

**ప్రజాపక్షం/ముషీరాబాద్ :** అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సందర్భంగా ఇందిపార్కు చౌరస్తా నుంచి ర్యాలీగా బయలు దేరుతున్న అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షురాలు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి , వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.పద్మశ్రీ, కోశాధికారి పి.మంగల ఆధ్వర్యంలో వందలాది మంది అంగన్వాడి టీచర్లు, హెల్పర్స్ ర్యాలీగా తరలివెళ్లేందుకు ప్రయత్నించగా ఇందిరా పార్కు చౌరస్తాలోనే వారిని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు.



## ఎమ్మెల్సీలను బర్తరఫ్ చేయాలి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిలను బర్తరఫ్ చేయాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ సారథి చైర్ పర్సన్ వెన్నెల కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత సంఘాల నాయకులు జేబి రాజు, ఐలయ్య, చెన్నయ్యలతో కలిసి మాట్లాడారు. బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్న తీరు యావత్ సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందని అన్నారు.

# రూ.10వేల కోట్లతో ఏడు రైల్వే కారిడార్లు

ఐదు మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులు
కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ :** రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 8 మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుల (దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులకు)కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటిలో తెలంగాణ, ఎపి, తమిళనాడు, కర్ణాటక పరిధిలోని 17 జిల్లాలను కలుపుతూ 5 మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. రూ.10వేల కోట్లకు పైగా వ్యయంతో 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. ఇందులో ప్రధానంగా తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ, బుధవారం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులను, 2029–30 నాటికి పూర్తి చేయాలని కేబినెట్ ప్రణాళిక వేసింది. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. 'బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే జూన్ నాటికి టెస్టింగ్ కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్ పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుంది' అని అశ్విని వైష్ణవ్ తెలిపారు. అరక్కోణం రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్– కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్–బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలంకరూర్–దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్–ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది. వీటితో పాటు బంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌ల్లోని 14 జిల్లాల గుండా రైల్వే కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. ఖరగ్‌పూర్ – ఝార్సుగూడ, కట్నీ– పెండ్రా రోడ్ సెక్షన్ల మధ్య నాలుగో లైన్, అలాగే బిలాస్‌పుర్ (ఉస్లాపుర్) – పెండ్రా రోడ్ సెక్షన్ల మధ్య మూడో లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నూతన ప్రాజెక్టుల ద్వారా భారతీయ రైల్వే ప్రస్తుత నెట్‌వర్క్ సుమారు 540 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. నూతన లైన్ల ద్వారా దాదాపు 52 లక్షల జనాభా ఉన్న 2,121 గ్రామాలకు రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయి. ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(ఝార్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

# గత ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి రూ.1,473 కోట్ల విరాళాలు

కాంగ్రెస్ కంటే ఏడు రెట్లు అధికం



**న్యూఢిల్లీ :** గత ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపి తన కేంద్ర కార్యాలయం నుండే దాదాపు రూ. 1,473 కోట్లను సమీకరించింది. కాంగ్రెస్ పార్టీ తన కేంద్ర, రాష్ట్ర విభాగాల ద్వారా మొత్తం రూ. 207 కోట్ల నికర ఆదాయాన్ని మాత్రమే నమోదు చేసింది. కాంగ్రెస్ కంటే బిజెపి అందుకున్న మొత్తం నికరక ఆదాయం ఏడు రెట్లు అధికం. ఎన్నికల సంఘానికి సమర్పించిన వ్యయ వివరాల ప్రకారం ఈ విషయం వెల్లడైంది. అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి ఎన్నికలకు సంబంధించిన సమగ్ర వ్యయ నివేదికను ఇదివరకే బహిర్గతం చేసిన కాంగ్రెస్, మార్చి 15 నుండి మే 6 వరకు సాగిన ఎన్నికల కాలంలో రూ. 207.17 కోట్ల నికర ఆదాయాన్ని, రూ. 248.55 కోట్ల వ్యయాన్ని నమోదు చేసింది. అదే కాలంలో బిజెపి తన కేంద్ర కార్యాలయం ద్వారానే రూ. 1,472.8 కోట్ల ఆదాయాన్ని పొందింది. కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలకు సంబంధించిన ఆ పార్టీ వ్యయ నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు, కాబట్టి ఆ పార్టీ మొత్తం ఆదాయం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎన్నికల ప్రక్రియ ముగిసే సమయానికి బిజెపి తన కేంద్ర కార్యాలయంలో ప్రారంభంలో ఉన్న దాని కంటే గణనీయంగా ఎక్కువ నిధులను కలిగి ఉంది. మార్చి 15న రూ. 6,722.6 కోట్లుగా ఉన్న ఆ పార్టీ ముగింపు నిల్వ, మే 6 నాటికి రూ. 7,627.2 కోట్లకు పెరిగింది. అంటే ఎన్నికల సమయంలో రూ. 904.6 కోట్ల పెరుగుదల నమోదైంది. మరోవైపు, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆర్థిక వనరులు తగ్గుముఖం పట్టాయి. కేంద్ర కార్యాలయం, ఐదు రాష్ట్రాల విభాగాలను కలిపి చూస్తే, ఎన్నికల ప్రారంభంలో ఆ పార్టీ వద్ద సుమారు రూ. 169.06 కోట్లు (రూ. 22.9 కోట్లు నగదు రూపంలో, రూ. 146.1 కోట్లు బ్యాంకు ఖాతాల్లో) ఉండగా, ముగింపు సమయానికి ఆ మొత్తం సుమారు రూ. 103.2 కోట్లకు పడిపోయింది. అంటే రూ. 65.86 కోట్ల తగ్గుదల కనిపించింది. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న బిజెపి వ్యయ వివరాల ప్రకారం, ఆ పార్టీ అసోం, తమిళనాడు, పుదుచ్చేరిలలో సుమారు రూ. 159.7 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో సుమారు రూ. 130.4 కోట్లు పార్టీ సాధారణ ప్రచారం కోసం, మిగిలిన మొత్తం అభ్యర్థులు, సంబంధిత ఖర్చుల కోసం వినియోగించబడ్డాయి. అత్యధికంగా అసోంలో రూ. 96.27 కోట్ల వ్యయం నమోదైంది. ఇందులో రూ. 76.73 కోట్లు పార్టీ సాధారణ ప్రచారం కోసం, రూ. 19.54 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చు చేశారు. సాధారణ ప్రచార వ్యయంలో ప్రకటనలు, స్టార్ క్యాంపెయినర్ల (ప్రముఖ ప్రచారకుల) ప్రయాణ ఖర్చులు ప్రధానంగా ఉన్నాయి. తమిళనాడులో పార్టీ రూ. 51.56 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో సాధారణ ప్రచారం కోసం రూ. 44.51 కోట్లు, అభ్యర్థుల కోసం రూ. 7.05 కోట్లు ఉన్నాయి. మీడియా ప్రకటనలకు సుమారు రూ. 23.96 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి సుమారు రూ. 10.04 కోట్లు ఖర్చయ్యాయి. ప్రచార సామగ్రి కోసం మరో రూ. 5.85 కోట్లు వెచ్చించారు. పుదుచ్చేరిలో, బిజెపి రూ. 11.90 కోట్ల వ్యయాన్ని నివేదించింది. ఇందులో సాధారణ ప్రచారం కోసం రూ. 9.19 కోట్లు, అభ్యర్థుల కోసం రూ. 2.71 కోట్లు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ మొత్తం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారం కోసం రూ. 143 కోట్లు, అభ్యర్థుల కోసం రూ. 105.55 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదించింది. దీంతో దాని మొత్తం ఎన్నికల వ్యయం రూ. 248.55 కోట్లకు చేరింది. కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారం కోసం రూ. 40.52 కోట్లు ఖర్చు చేయగా, ఆ పార్టీ రాష్ట్ర, స్థానిక విభాగాలు ఈ అంశం కింద మరో రూ. 102.49 కోట్లు ఖర్చు చేశాయి. వామపక్ష కూటమిని (లెఫ్ట్ ఫ్రంట్) అధికారం నుండి తొలగించిన కేరళలో అత్యధికంగా రూ. 59.28 కోట్ల వ్యయం జరిగింది, ఆ తర్వాతి స్థానంలో రూ. 22.62 కోట్లతో అసోం నిలిచింది.

# ప్రధాన మంత్రి కులగణన ప్రక్రియ విఫలం కావాలని కోరుకుంటున్నారు!

ప్రక్రియను సరైన పద్ధతిలో నిర్వహించాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** ప్రస్తుత కుల గణన విధానంలో డ్రాప్‌డౌన్ జాబితాకు బదులుగా స్వేచ్ఛాయుత ప్రశ్నలను ఉపయోగించాలన్న ప్రభుత్వ నిర్ణయం చాలా తీవ్రమైన లోపం అని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ప్రక్రియ మొత్తం విఫలం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరుకుంటున్నట్లుగా కనిపిస్తోందని మండిపడింది. గత నాలుగు రోజుల్లో దేశవ్యాప్తంగా తమ పార్టీ 17 పత్రికా సమావేశాలు నిర్వహించిందని, కుల గణనను సరైన పద్ధతిలో నిర్వహించాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తెలిపారు. 'కుల గణన అంటే కేవలం కులాలను లెక్కించడం మాత్రమే కాదు, సామాజిక న్యాయాన్ని నిర్ధారించడం కూడా. సరైన ప్రశ్నలు.. సరైన సమాచారం.. సరైన వాటా... సామాజిక న్యాయం' అని రమేశ్ ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పదేపదే డిమాండ్ చేసినప్పటికీ, ప్రస్తుత కుల గణన విధానంలో డ్రాప్ డౌన్ జాబితాకు బదులుగా స్వేచ్ఛాయుత ప్రశ్నలను ఉపయోగించాలన్న మోదీ ప్రభుత్వ నిర్ణయం చాలా తీవ్రమైన లోపం అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి మోదీ, కులగణన ప్రక్రియ మొత్తం విఫలమయ్యేలా, ఒకే కులానికి వేర్వేరు పేర్లు, ఉపకులాలు, స్పెల్లింగ్‌లను జనగణనలో నమోదు చేయాలని కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది అని రమేష్ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంయుక్తంగా ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారని, కులగణనను సరైన పద్ధతిలో నిర్వహించాలన్నది పార్టీ ప్రధాన డిమాండ్ అని కూడా ఆ లేఖలో పేర్కొన్నారన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని రమేశ్ దుయ్యబయ్యారు. ఆగస్టు 20 నాటి ఆ లేఖలో, ప్రస్తుత కులగణన ప్రక్రియపై ఈ ఇద్దరు సీనియర్ నాయకులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రశ్నాపత్రాన్ని రద్దు చేసి, ధృవీకరించబడిన కులాల జాబితా ఆధారంగా కొత్తది తయారు చేయాలని ఆ లేఖలో డిమాండ్ చేశారని రమేశ్ చెప్పారు. తెలంగాణ, బిహార్‌లలో జరిగిన కుల సర్వేల మాదిరిగా, ముందుగా సిద్ధం చేసి, ధృవీకరించబడిన కులాల జాబితా ఆధారంగా గణన నిర్వహించడం దీనికి ఒక ఆచరణాత్మక పరిష్కారం అని ఆయన అన్నారు.

# రాయ్‌బరేలిలో రోడ్ల అధ్వానం

'దిశ' సమావేశంలో రాహుల్‌గాంధీ ఆగ్రహం



**రాయ్‌బరేలి :** తన నియోజకవర్గమైన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలిలో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పిఎంజిఎస్‌వై) కింద నిర్మించిన రోడ్ల అధ్వాన్న పరిస్థితిపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. గుంతలతో నిండిన రోడ్ల ఫోటోలను ప్రదర్శిస్తూ, వాటి నిర్మాణానికి బాధ్యత వహించే ఏజెన్సీల వివరాలను డిమాండ్ చేశారు. బుధవారం రాయ్‌బరేలిలో జరిగిన దిశ సమావేశంలో పాల్గొన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రాయ్‌బరేలిలో ఉన్న రాహుల్‌గాంధీ, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించేందుకు కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి కాంగ్రెస్ అమేథీ ఎంపి కిషోరీ లాల్ శర్మ, ఇతర ఎన్నికైన ప్రతినిధులు, అధికారులతో కలిసి హాజరయ్యారు. దిశ కమిటీ నామినేటెడ్ సభ్యుడు ఉమేష్ బహదూర్ సింగ్ అలియాస్ బాబ్లు సింగ్ మాట్లాడుతూ, 'గాంధీ దెబ్బతిన్న పిఎంజిఎస్‌వై రోడ్ల ఫోటోలను అధికారుల ముందు ఉంచి, చర్యలు తీసుకోవాలని కోరుతూ నిర్దిష్ట రోడ్ల పేర్లను కూడా పేర్కొన్నారు' అని తెలిపారు. రోడ్లను మరమ్మతు చేస్తామని పిఎంజిఎస్‌వై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సమావేశానికి హామీ ఇచ్చారని సింగ్ చెప్పారు. వివిధ ఏజెన్సీలు నిర్మించిన రోడ్లను స్పష్టంగా గుర్తించాలని, ప్రతి రోడ్డుకు ఏ ఏజెన్సీ బాధ్యత వహించిందో చూపే రికార్డులను నిర్వహించాలని గాంధీ నొక్కి చెప్పారు. అధికారుల నుండి కేవలం సమాచారం కోరకుండా, రాహుల్‌గాంధీ జిల్లాలోని రోడ్ల పరిస్థితిని పరిశీలించి, సమావేశంలో ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలను సమర్పించిన తర్వాతే ఈ రోడ్ల సమస్యను లేవనెత్తారు అని సింగ్ అన్నారు. సమావేశానికి కంటే ముందు రాహుల్ గాంధీ భుమౌ భుమౌ అతిథి గృహంలో కాంగ్రెస్ కార్యకర్తలను, పలు సంస్థల ప్రతినిధులను కలిశారు. రాయ్‌బరేలీ, అమేథీ, సుల్తాన్‌పూర్‌కు చెందిన ప్రజలు కూడా ఆయనను కలిసి తమ తమ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించారు అని నగర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు సునీల్ సింగ్ భదౌరియా తెలిపారు. రాహుల్‌గాంధీ ఆరోగ్య విభాగానికి రెండు అంబులెన్స్‌లను కూడా అందజేసి, సుమారు రూ. 3 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారని పార్టీ నాయకులు తెలిపారు. ఈ దిశ సమావేశానికి యూపీ ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి మనోజ్ కుమార్ పాండే, ఉద్యానవన శాఖ మంత్రి దినేష్ ప్రతాప్ సింగ్, ఇతర ఎన్నికైన ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఆహార భద్రతతో సహా పలు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు పాండే అనంతరం విలేకరులతో అన్నారు.

# ప్రాంతీయ భద్రతకు భారత్-శ్రీలంక కృషి

దిస్సనాయకేతో రాజ్‌నాథ్‌సింగ్ భేటీ
శ్రీలంకలో రక్షణమంత్రి మూడురోజుల పర్యటన



**కొలంబో:** ప్రాంతీయ భద్రతకు శ్రీలంకతో సంయుక్తంగా కృషి చేస్తామని భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హామీ ఇచ్చారు. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకేతో బుధవారం కొలంబోలో ముఖాముఖీ సమావేశం సందర్భంగా నాయకులు ఇద్దరూ ప్రాంతీయ భద్రత నిర్ధారణ,ఇరు దేశాల భాగస్వామ్యంపై చర్చించారు. గడచిన 38 సంవత్సరాలలో మొట్టమొదటిసారి భారత రక్షణమంత్రి శ్రీలంకలో పర్యటిస్తున్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం కొలంబో వెళ్ళారు. ఉన్నతస్థాయి అధికార బృందం ఆయన వెంట ఉంది. దిస్సనాయకే శ్రీలంక అధ్యక్షుడుగా పదవీబాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తరపున రాజ్‌నాథ్ సింగ్ ఆయనకు అభినందనలు తెలియజేశారు. శుభ సందేశాన్ని అందించారు. రెండు దేశాల ప్రజలు ఎంతో గాఢమైన స్నేహ సంబంధాలను కొనసాగిస్తున్నారన్న విషయాన్ని దిస్సనాయకే ఈ సమావేశంలో ప్రముఖంగా ప్రస్తావించారు.భారత్ భద్రతకు నష్టం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను శ్రీలంక భూభాగం నుండి అనుమతించబోమని కూడా ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్‌కు దిస్సనాయకే హామీ ఇచ్చారు. ఈ మేరకు శ్రీలంక రక్షణశాఖ విడుదల చేసిన ప్రకటన ఉద్ఘాటించింది.

ఈ సమావేశం ఎంతో ప్రయోజనకరంగా జరిగిందని రాజ్‌నాథ్‌సింగ్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. అదేవిధంగా భారతదేశం ఎల్లప్పుడూ తమ దేశానికి అండదండా ఉంటోందని దిస్సనాయకే గుర్తుచేసుకున్నారు. దిత్వా తుఫాను బీభత్సం సందర్భంగా ఆపరేషన్ సాగర్ బంధు ద్వారా భారతదేశం తమకు సమగ్ర పునరావాస ప్యాకేజీని అందించిందని,నివాసాల పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేసుకున్నారు. దీనికి కేవలం ఒక సహాయంగా కాకుండా భారత్ పొరుగుదేశంపట్ల ఒక బాధ్యతగా భావించిందన్నారు. శ్రీలంకలో భారత్ నిర్మించిన మూడు బెయిలీ బ్రిడ్జీలను ఇరు దేశాల నాయకులు దృశ్యమాధ్యమ విధానం ద్వారా ప్రారంభించారు. ఎల్ 70 గన్స్‌ను శ్రీలంక వైమానికి దళానికి ఇవ్వడంపై ఎంఓయును నాయకులు పునరుద్ధరించారు. ఈ ఒప్పందం ద్వారా రెండు దేశబూల మధ్యా రక్షణ సహకారం వృద్ధి చెందుతుంది. ఎన్‌సిసి యూత్‌ను రెండు దేశాలలో పర్యటనలకు ఎంఓయు చేసుకున్నారు. శ్రీలంక ఎప్పుడు సంక్షోభంలో ఉన్నాగానీ భారతదేశం ఎల్లప్పుడు అండగా ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్ భరోసా ఇచ్చారు.

## 'అన్ని కేసులను సమానంగా చూస్తాం'

రాహుల్ పరువు నష్టం కేసుపై సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపై దాఖలైన పరువు నష్టం కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత సైన్యాన్ని రాహుల్ కించపరిచిన కేసుకు సంబంధించిన విచారణలో జాప్యం జరుగుతోందంటూ ఫిర్యాదుదారుడి తరఫు న్యాయవాది చేసిన వాదనలపై స్పందించింది. కోర్టు అన్ని కేసులను సమానంగా చూస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ బిల్లుపై ఎంపిల ఆందోళన

ఈ బిల్లు సంస్థ స్వయం ప్రతిపత్తిని తగ్గిస్తుందని మండిపాటు

**న్యూఢిల్లీ :** భారత గణాంక సంస్థ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్) పరిధిని విస్తరించేందుకు ప్రతిపాదించిన ప్రభుత్వ బిల్లుపై పలువురు ఎంపిలు ప్రశ్నలు సంధించారు. ఈ బిల్లు ఆ సంస్థ స్వయం ప్రతిపత్తిని తగ్గిస్తుందని పేర్కొన్నారు. బిజెపి ఎంపి భర్తృహరి మహతాబ్ నేతృత్వంలోని పార్లమెంటరీ ఆర్థిక స్థాయీ సంఘం సమావేశంలో సభ్యులు 'ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ బిల్లు, 2026'పై ఆందోళన వ్యక్తం చేసి, దానిని క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఈ బిల్లుపై చర్చించేందుకు కమిటీ తొలిసారి సమావేశమైంది. ప్రతిపాదిత చట్టం ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ స్వయంప్రతిపత్తిని తగ్గించవచ్చని భావిస్తున్నందున, వారిలో చాలామంది ప్రభుత్వ చర్యను ప్రశ్నించారని చర్చల గురించి తెలిసిన వర్గాలు తెలిపాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దానిని ప్రవేశపెట్టిన సమయంలో, చాలా మంది ఎంపిలు తమ అభ్యంతరాలను లేవనెత్తారు. తదనంతరం, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ బిల్లును సమగ్ర పరిశీలన కోసం పార్లమెంటరీ కమిటీకి పంపారు. నివేదిక సమర్పించడానికి కమిటీకి మూడు నెలల గడువు ఇచ్చారు. అయితే, మంజూరు చేసిన సమయం కంటే ఈ బిల్లుకు చాలా ఎక్కువ సమయం పడుతుందని బుధవారం వర్గాలు తెలిపాయి. ఈ బిల్లు, సంస్థ పరిపాలనను బలోపేతం చేయడానికి, విద్యాపరమైన శ్రేష్ఠతను, పరిశోధనను ప్రోత్సహించడానికి, అలాగే గణాంక శాస్త్రం, దాని అనుబంధ రంగాలలో అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి వీలుగా, ఆ సంస్థను ఒక 'కార్పొరేట్ సంస్థ'గా నమోదు చేయాలని కోరుతోంది. ఈ బిల్లు ప్రకారం, భారత రాష్ట్రపతి ఈ సంస్థకు విజిటర్‌గా ఉంటారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు దాని ప్రధాన విధాన కార్యనిర్వాహక సంస్థగా ఉంటాయి. ఈ బోర్డుకు ఒక చైర్‌పర్సన్ అధ్యక్షత వహిస్తారు, ఈయన విద్యా, పారిశ్రామిక, విద్యా, ప్రజా విధాన, గణాంక శాస్త్ర రంగాల నుండి ఒక ప్రముఖ వ్యక్తి అయి ఉంటారు. ఈ బోర్డు కేంద్ర ప్రభుత్వానికి జవాబుదారీగా ఉంటుందని బిల్లు పేర్కొంది. ఈ సంస్థకు ఒక అకడమిక్ కౌన్సిల్ ఉంటుంది, ఇది దాని ప్రధాన విద్యా సంస్థగా పనిచేస్తుంది. దీనికి సంస్థ డైరెక్టర్ అధ్యక్షత వహిస్తారు. పూర్తికాల ప్రొఫెసర్లు, పూర్తికాల అధ్యాపకులందరూ అకడమిక్ కౌన్సిల్‌లో సభ్యులుగా ఉంటారు. 1959 నాటి ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ చట్టం, ఈ సంస్థను జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా ప్రకటించి, గణాంక శాస్త్రంలో డిగ్రీలు, డిప్లొమాలను ప్రదానం చేసే అధికారాన్ని దానికి కల్పించింది. గణాంకాలు, గణితం, పరిమాణాత్మక అర్థశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, గణాంకాలకు సంబంధించిన ఇతర విషయాలలో, సంస్థ ఎప్పటికప్పుడు నిర్ధారించిన విధంగా, డిగ్రీలు, డిప్లొమాలను ప్రదానం చేసే అధికారాన్ని సంస్థకు కల్పిస్తూ 1995లో ఈ చట్టాన్ని సవరించారు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం, 1959 చట్టంలో ఇన్‌స్టిట్యూట్ యొక్క పాలన, పరిపాలన, ఆర్థిక, జవాబుదారీతనం మరియు పనితీరుకు సంబంధించి పరిమిత నిబంధనలు ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న విద్యా మరియు పరిశోధనా వాతావరణం యొక్క అవసరాలకు అనుగుణంగా స్పందించడానికి ఈ చట్టం సరిపోదు. అందువల్ల, గణాంక శాస్త్రాలు, అనుబంధ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కేంద్రంగా రాణించేందుకు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ అయిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయడానికి వీలుగా సమగ్ర చట్టాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం 1959 ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ చట్టాన్ని రద్దు చేయాలని నిర్ణయించిందని బిల్లు పేర్కొంది. ఈ చట్టపరమైన సంస్కరణ, భారతదేశపు టెక్, ఆర్థిక రంగాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న భారీ ప్రతిభ కొరతను పూరిస్తూ, కొత్త తరం నాణ్యమైన డేటా సైంటిస్టులు, గణాంకవేత్తలకు శిక్షణ ఇచ్చేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి వీలు కల్పిస్తుందని బిల్లు చెబుతోంది.

# శాస్త్రవేత్త సిఎన్ఆర్ రావుకు 'సర్' నోటీసు



**బెంగళూరు:** భారతరత్న, ప్రముఖ శాస్త్రవేత్త సిఎన్ఆర్ రావుకు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్)కు సంబంధించిన నోటీస్ జారీ అయ్యింది. ఆయన పేరు ముందున్న 'ప్రొఫెసర్' అనే పదం ఇంగ్లీష్ స్పెల్లింగ్‌లో అదనంగా 'ఎఫ్' ఉండటంతో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. రసాయన శాస్త్రంలో అత్యంత క్లిష్టమైన అంశాలపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్త సిఎన్ఆర్ రావు, కర్ణాటక రాజధాని బెంగళూరులో నివసిస్తున్నారు. అయితే 'సర్' ప్రక్రియలో భాగంగా ఆయన పేరులో వ్యత్యాసాన్ని ఎన్నికల అధికారులు గుర్తించారు. పాత ఓటర్ల జాబితాలో ఆయన పేరు ప్రొ సిఎన్ఆర్ రావు అని ఉండగా, సవరించిన జాబితాలో అదనంగా ఒక 'ఎఫ్' అక్షరం చేరింది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్త సిఎన్ఆర్ రావుకు 'సర్' నోటీస్ జారీ అయ్యింది. ఆయన పేరులోని వ్యత్యాస్యంపై విచారణ కోసం బెంగళూరులోని మల్లేశ్వరం ప్రాంతంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సమీపంలోని కేంద్రానికి హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. అయితే దీనిపై వివాదం చెలరేగడంతో ఇసి స్పందించింది. ఆ కేంద్రంలోని ఎన్నికల అధికారుల ముందు సైంటిస్ట్ సిఎన్ఆర్ రావు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. ఎన్నికల అధికారులు ఆయన ఇంటికి వెళ్లి అవసరమైన ధృవీకరణ ప్రక్రియను చేపడతారని పేర్కొంది. మరోవైపు ఓటర్ల జాబితా వివరాల్లో పేరు సరిపోలకపోవడం వల్ల సామాజిక కార్యకర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన హరేకళ హజబ్బకు కూడా 'సర్' నోటీసు జారీ అయ్యింది. దీనిపైనా విమర్శలు రావడంతో కర్ణాటక ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) స్పందించారు. ఆ సమస్య పరిష్కారమైందని స్పష్టం చేశారు. పలు రాష్ట్రాలకు చెందిన సాధారణ ప్రజలతోపాటు ప్రముఖ వ్యక్తుల పేర్లు 'సర్' ప్రక్రియలో ఓటరు జాబితాల నుంచి మాయం కావడం, నోటీసులు అందడంపై ఈసీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# న్యాయవ్యవస్థ విమర్శలకు వ్యతిరేకి కాదు...కానీ అవి సమాచారం లేని వాదనలు

ఎన్‌సిఇఆర్‌టి ఉత్తర్వులో సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** 'న్యాయ వ్యవస్థ విమర్శలకు వ్యతిరేకం కాదు, అలా ఉండకూడదు కూడా' అని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే అటువంటి విమర్శలను సరైన వేదిక ద్వారా, నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన పద్ధతిలో జరగాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది.న్యాయ వ్యవస్థలోని అవినీతి గురించి ప్రస్తావించిన 8వ తరగతి ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకంలోని అంశాలకు సంబంధించిన సుమోటో (స్వయంగా చేపట్టిన) విచారణను ముగిస్తూ ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.విమర్శకు, మౌనానికి మధ్య వ్యత్యాసం లేదని, బాధ్యతాయుతమైన చర్చకూ, సమాచారం లేని వాదనకు మధ్యే వ్యత్యాసం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. 'న్యాయ వ్యవస్థ ఒక సంస్థగా విమర్శలకు విముఖంగా ఉండదు, ఉండజాలదు. న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శ అనేది ఒక చైతన్యవంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి చట్టబద్ధమైన, అవసరమైన లక్షణం. ఇది సంస్థాగతమైన జవాబుదారీతనం. స్వీయదిద్దుబాటుకు దోహదపడుతుంది. అయితే, అవసరమైనది ఏమిటంటే, అటువంటి విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగం ద్వారా వినిపించాలి. అంతేగానీ, సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్య ప్రణాళికలోకి ధృవీకరణ లేకుండా అవి ప్రవేశించకూడదు' అని సెప్టెంబరు 1న ఇచ్చిన తన ఉత్తర్వులో ధర్మాసనం పేర్కొంది. ఈ ఉత్తర్వులోని అంశాలు తర్వాత అందుబాటులోకి వచ్చాయి. కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల సంఘం సూచించిన సవరణల ఆధారంగా, వివాదాస్పద అధ్యాయాన్ని మార్చారని సుప్రీంకోర్టు గమనించింది. న్యాయవ్యవస్థలోని అవినీతిపై అభ్యంతరకరమైన కంటెంట్‌తో ఉన్న 8వ తరగతి సాంఘిక శాస్త్ర పుస్తకానికి సంబంధించిన సుమోటో కేసును ధర్మాసనం విచారిస్తోంది. న్యాయవ్యవస్థలోని అవినీతికి సంబంధించిన వివాదాస్పద అధ్యాయంపై తలెత్తిన వివాదం నేపథ్యంలో, ముగ్గురు విద్యావేత్తలతో సంబంధాలు తెంచుకోవాలని కేంద్రం, రాష్ట్రం, ఇతరులను ఆదేశిస్తూ మార్చి 11న ఇచ్చిన తన ఉత్తర్వును సుప్రీంకోర్టు గతంలో సవరించింది. ఇచ్చిన వివరణను పరిగణనలోనికి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం ముగ్గురు విద్యావేత్తలు, మార్చి 11వ తేదీ ఉత్తర్వులో తాము చేసిన పరిశీలనల ప్రభావానికి లోనుకాకుండా, ఈ విషయంపై కేంద్రం, రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాలు, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు పొందే సంస్థలు స్వతంత్ర నిర్ణయం తీసుకునేందుకు స్వేచ్ఛనిచ్చారు. 8వ తరగతి విద్యార్థులకు భారత న్యాయవ్యవస్థపై ప్రతికూల చిత్రాన్ని ప్రదర్శించేందుకు ముగ్గురు విద్యావేత్తలు ప్రొఫెసర్ మైఖెల్ డానినో, సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్.. 'ఉద్దేశపూర్వకంగా', 'తెలిసి' వాస్తవాలను వక్రీకరించారని, నమోదు చేసిన మార్చి 11నాటి ఉత్తర్వులోని ఒక భాగాన్ని కూడా అది ఉపసంహరించుకుంది. ముగ్గురు విద్యావేత్తలు దాఖలు చేసిన దరఖాస్తుపై విచారణ జరుపుతున్నప్పుడు ధర్మాసనం ఈ ఉత్తర్వును జారీ చేసింది. ఆ దరఖాస్తులో వారు తమ వాదనను వివరిస్తూ, విషయ రూపకల్పనలో ఏ ఒక్క వ్యక్తికీ పూర్తి అధికారంలేదని, అది ఒక సామూహిక ప్రక్రియ అని పేర్కొన్నారు. తమ వ్యాఖ్యలు వ్యక్తుల గురించి కాకుండా, విషయాల సందర్భంలోనే చేశామని కూడా కోర్టు పేర్కొంది.

# అమెరికా–ఇరాన్ ట్యాంకర్ల యుద్ధం

- 13 చమురు నౌకలు ధ్వంసం: ఖర్గ్‌ద్వీప సమీపంలో దాడి
- మళ్ళీ 100 డాలర్లు దాటేసిన చమురు ధర
- సౌదీ అరేబియాపై కొనసాగుతున్న హౌతీల దాడులు
- దిగుమతి బిల్లు పెరుగుదలతో భారత్ బెంబేలు
- యుద్ధం ముగించేందుకు కొత్త ఆలోచనలు: ఖతార్ ప్రకటన

**దుబాయ్:** అమెరికా–ఇరాన్ మధ్య పశ్చిమాసియాలో చమురు ట్యాంకర్లపై దాడుల యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో అంతర్జాతీయస్థాయిలో ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటిపోయాయి.ఆ తర్వాత స్వల్పంగా 99.90 డాలర్లకు చేరింది. మళ్ళీ దాడులు జరిగితే మార్కెట్ కుదేలవుతుంది. ఈ పరిస్థితుల్లో వరుసగా మూడోరోజు కూడా దేశీయ మార్కెట్లు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. సెన్సెక్స్ 523 పాయింట్లు క్షీణించింది. ముడి చమురు ధరలతో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తుతున్నాయి.

జోర్డాన్‌లో అమెరికాకు చెందిన అల్ అజ్రఖ్ సైనిక స్థావరంపైన,మరో పది చమురు నౌకలపైనా ఇరాన్ ఐఆర్‌జిసి దళాలు భీకర దాడులు చేయగా, అమెరికా కూడా ఐదు ఇరాన్ నౌకలను ధ్వంసం చేసింది.వీటిల్లో నాలుగు ఐఆర్‌జిసి చమురు నౌకలు ఒమన్ గల్ఫ్‌లో ధ్వంసం కాగా,ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రం ఖర్గ్ ద్వీపం సమీపంలో ఒక చమురునౌకను అమెరికా ధ్వంసం చేసింది.తాము దాడిచేసిన నౌకలలో ఒక ఎం/టి రీస్కో నౌక ఒమన్‌గల్ఫ్‌లో మునిగిపోయినట్లు సెంట్‌కామ్ పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియోను విడుదల చేసింది. శనివారంనాడు కూడా మూడు ఇరాన్ చమురు ట్యాంకర్లను అమెరికా దళాలు ధ్వంసం చేశాయి. ఇంకోవైపు సౌదీ అరేబియాపై ఇరాన్ మద్దతు గల హౌతీ ఉగ్రవాద సైన్యాల దాడులు కొనసాగుతున్నాయి. ఎర్ర సముద్రంలో చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది.

తమ యుద్ధ నౌకలను ధ్వంసం చేసేందుకు ఇరాన్ రెండు సార్లు విఫలయత్నం చేసిందని,నౌకలు తప్పించుకుని ఎదురుదాడులు చేశాయని సెంట్‌కామ్ ప్రకటించింది. ఐఆర్‌జిసికి నిధులు సమకూర్చేందుకు ఉపయోగపడుతున్న చమురు స్మగ్లింగ్ నౌకలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది.ఇరాన్ ప్రయోగించిన 20 క్షిపణులలో 18 క్షిపణులను కూల్చివేసినట్లు జోర్డాన్ సాయుధబలగాల ప్రతినిధి ప్రకటించారు. ఐఆర్‌జిసి కూడా ఒక ప్రకటన చేస్తూ, ఎంతమాత్రం సురక్షితం కాని,నిషేధిత మార్గంలో ప్రయాణం చేస్తున్న రెండు అమెరికా నౌకలు,ఎనిమిది చమురు ట్యాంకర్లు, మరో పది నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు పేర్కొంది.

తమ యుద్ధ నౌకలపై దాడికి ఇరాన్ విఫలయత్నం చేసిందని, తాము దాడులను ఆపకుండా కొనసాగిస్తామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో బుధవారం ప్రకటించారు. కాగా తాము విధించిన పది నిబంధనలను ఉల్లంఘించి దొడ్డిదారిన వెళుతున్న రెండు అమెరికా నౌకలు,మరో ఎనిమిది చమురు ట్యాంకర్లపై దాడులు చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. శాంతి చర్చల్లో మధ్యవర్తిపాత్ర వహిస్తున్న ఖతార్ విదేశీమంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ, ఆరునెలల యుద్ధాన్ని ముగించేందుకు మధ్యవర్తి దేశాలు కొత్త ఆలోచనలు చేస్తున్నాయని పేర్కొంది. ఈ యుద్ధం,చమురు ధరల పెరుగుదల ఇదేవిధంగా కొనసాగితే పారిశ్రామిక విధ్వంసం సంభవిస్తుందని హెచ్చరించారు. ఖతార్ ప్రధానమంత్రి, విదేశాంగమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ బిన్ జాస్సిమ్ అల్ థానీ మంగళవారం నాడు చైనా విదేశాంగమంత్రి వాంగ్ యితో బీజింగ్‌లో సమావేశమై పశ్చిమాసియాలో స్థిరత్వం, మూతపడిన హోర్ముజ్ జలసంధి తెరిచేందుకు పరిష్కారాలపై చర్చించారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం వంద డాలర్లకు చేరువగా వచ్చిన ముడి చమురు ధర 100 డాలర్లు దాటి వెళ్ళిపోయింది. తమ యుద్ధ నౌకప ఇరాన్ దాడి చేసిందని అమెరికా ఆగ్రహించి తీవ్రస్థాయిలో ప్రతీకార దాడులకు దిగింది. ప్రపంచ చమురు ధరకు ప్రామాణికంగా భావించే బ్రెంట్ క్రూడాయిల్ ధర యుద్ధ సమయంలో ఈ స్థాయికి ఎన్నడూ పెరగలేదు.ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం మొదలైనప్పటినుండీ చమురు ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతున్నాయి. అంతకుముందు శాంతి సమయంలో ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్లు మాత్రమే ఉండేది.




జులై నెలలో తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో ముడి చమురు బ్యారెల్ 100 డాలర్లు దాటిపోగా, ఇప్పుడు అదే పరిస్థితి తలెత్తింది. చైనా తర్వాత భారీస్థాయిలో 88 శాతం మేరకు అంతర్జాతీయ ముడి చమురు దిగుమతులపై ఆధారపడిన భారతదేశంలో కూడా ఆందోళన రేకెత్తుతోంది. చమురు దిగుమతుల బిల్లు ఇప్పటికే భారంగా ఉన్న మోదీ ప్రభుత్వానికి ఈ దశలో మరింత పెనుభారం కానున్నది. భారత్‌లో మూడునెలలుగా స్తంభింపజేసిన డీజిలు,పెట్రోలు, వంటగ్యాస్ ధరలు భగ్గుమనే దశకు పరిస్థితులు దారితీశాయి.

## నాయకత్వాన్ని వదులుకోను: ఫ్రెడరిక్ మెర్జ్

సిడియు ఓట్‌బ్యాంక్ నష్టం దిగ్భ్రాంతికరం

జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్



**బెర్లిన్:** జర్మనీ తూర్పు ప్రాంతంలో ఉన్న అతి పెద్ద రాష్ట్రం సాక్సోనీ–అన్హాల్ట్‌లో జాత్యాహంకార, పచ్చిమితవాద ఎ.ఎఫ్.డి పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు చేరువ కావడంపై జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తమ పార్టీ సిడియు ఓట్‌బ్యాంకు తీవ్ర నష్టం కలిగించిందని అంగీకరిస్తూనే,తాను ఛాన్సలర్‌గా,పార్టీ నేతగా నాయకత్వంలో కొనసాగుతానన్నారు. ఈ ఎన్నికల్లో ఓటమి ద్వారా నాయకత్వాన్ని వదిలిపెట్టడం తనకు ఎలాంటి ప్రత్యామ్నాయం కాదన్నారు. పరిస్థితులను ధీటుగా ఎదుర్కొంటామన్నారు.ఎ.ఎఫ్.డి విజయంవల్ల మెర్జ్ పదవికి గండం వచ్చిందని, క్రిస్మస్ నాటికి దేశంలో కొత్త ఛాన్సలర్ పదవీ బాధ్యతలు చేపడతారని ఎ.ఎఫ్.డి.నాయకులు,విశ్లేషకులు పలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న తరుణంలో మెర్జ్ ఈ ప్రకటన చేశారు.

ఎ.ఎఫ్.డి.పార్టీ ఘన విజయం (44శాతం)సాధించినప్పటికీ ఇంకా పూర్తి మెజార్టీ లేదు. మూడు స్థానాలు తక్కువయ్యాయి. దీంతో ఎ.ఎఫ్.డి నాయకులు ఇతర పార్టీల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా విజయం సాధించామని, తమతో కలిసి పనిచేయాలని దేశ ప్రజాస్వామ్యం డిమాండ్ చేస్తోందని వారు పేర్కొన్నారు. ఐతే ఎ.ఎఫ్.డితో కలిసి పనిచేసేందుకు ప్రధాన స్రవంతి పార్టీలు సిద్ధంగా లేవు. సోవియట్ యూనియన్ పతనానంతరం తూర్పు జర్మనీ,పశ్చిమ జర్మనీలు రెండుగా ఉండేవి. మధ్యలో బెర్లిన్ గోడ ఉండేది. సోవియట్ యూనియన్ అంతర్థానమైన తర్వాత బెర్లిన్‌గోడను కూల్చివేశారు. తూర్పు–పశ్చిమ జర్మనీలు ఏకమయ్యాయి. కానీ 1989 తర్వాత తూర్పు జర్మనీలో ఉన్న ప్రజలలో కొంత అసంతృప్తి చెలరేగింది. జర్మనీ ఐక్యమైన తర్వాత తూర్పు జర్మనీలో తీవ్ర నిరుద్యోగం ప్రబలింది. ముఖ్యంగా మహిళలు ఎక్కువమంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇక్కడ పరిమితమయ్యారు. సోవియట్ పాలనలో తూర్పు జర్మనీలో నిరుద్యోగాన్ని ఆ ప్రాంత ప్రజలు చవిచూడలేదు. విలీనం తర్వాత నిరుద్యోగం,దారిద్ర్యం తూర్పు జర్మనీలో విజృంభించింది. పశ్చిమ జర్మనీలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. దీంతో తూర్పు జర్మనీ ప్రజలు గతాన్ని తలచుకుంటూ ఓస్టాల్జీలో ఉంటున్నారు. ఈ అసంతృప్తి కూడా ఎ.ఎఫ్.డి విజయానికి ఒక కారణంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ ప్రతిపాదించిన ఆర్థిక సంస్కరణలకు అంతగా ప్రజాదరణ లభించలేదు. ఐనప్పటికీ తన ఆర్థిక సంస్కరణలు ముందుకు తీసుకువెళతానని ఆయన పునరుద్ఘాటించారు.

## ‘ఎఐ’ టెక్నాలజీ చోరీ చేశారు
## అమెరికా ఆరోపణలకు చైనా ఖండన

**బీజింగ్:** తమ కృత్రిమ మేధ టెక్నాలజీని చైనా కంపెనీలు చోరీ చేశాయని, పారిశ్రామిక స్థాయిలో ఈ యత్నాలు ముమ్మరంగా చేస్తున్నారంటూ అమెరికా ఆరోపణలు చేసింది. దీనిపై చైనా తీవ్రస్థాయిలో స్పందించింది.సెప్టెంబరు నెలాఖరులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్,చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య ప్రణాళికాబదధమైన సంభాషణలు జరుగుతాయని అంచనావేస్తున్న తరుణంలో వచ్చిన ఈ ఆరోపణలకు చైనా దిగ్భ్రాంతి చెందింది. ఈ ఆరోపణలను ఖండించింది.చైనాకు చెందిన ఎ.ఐ దవలపర్లు అమెరికాకు చెందిన ఎ.ఐ సామర్థ్యాలను చోరీ చేసే ప్రయత్నాల్లో నిమగ్నమై ఉన్నారని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ డల్లాస్‌లోని బిజినెస్ స్కూలులో జరిగిన సమావేశంలో ఆరోపించారు. ఎఫ్‌బిఐ నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ,సైబర్ సెక్యూరిటీ,మౌలిక సదుపాయాల భద్రతా ఏజెన్సీ ఉమ్మడిగా బుధవారంనాడు ఒక అడ్వైజరీని జారీ చేశాయి. చైనా ఎఐ దవలపర్స్ అమెరికా ఎఐ మోడల్స్‌ను చోరీచేసి వాటిని అనుకరించే ప్రయత్నం ముమ్మరంగా చేస్తున్నారని ఈ ఉమ్మడి అడ్వైజరీ పేర్కొంది. అమెరికాకు చెందిన ఆంత్రోపిక్‌కు చెందిన క్లౌడ్,ఓపెన్ ఎఐ,జిపిటి,గూగుల్ జెమినీ,స్పేస్ ఎక్స్ ఎఐ గ్రోక్ వంటివాటిని 2024 నుండి అనుకరించి కాపీ చేసే ప్రయత్నాలు చైనా కంపెనీలు చేస్తున్నాయని ఆరోపించింది. చైనా డీప్‌సీక్,ఆలీబాబా,మూన్‌షాట్ ఎఐ,జెడ్.ఎఐ పేర్లను అమెరికా గూఢచారి సంస్థలు తమ అడ్వైజరీలో పేరుపెట్టి ప్రస్తావించాయి. చైనా ప్రభుత్వ సహాయ సహకారాలతోనే ఆ దేశ కంపెనీలు ఈ చోరీ చర్యలకు దిగుతున్నాయని పేర్కొంది. దీనిపై చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ ఒక ప్రకటన చేస్తూ ఈ విధమైన ఆరోపణలు చేయవద్దని కోరారు. తీవ్రంగా ఖండించారు.

## హేయమైన చర్య
(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చెప్పారని ఓ మహిళ పేర్కొనడం లాంటి చర్యలు అంటరానితనాన్ని ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. దళితులు నిరసనకు వెళ్లిన ప్రాంతాన్ని శుద్ధి చేశారన్న ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు సమాజంలో సామాజిక విభజనకు, విద్వేషాలకు దారితీస్తాయని సాంబశివరావు హెచ్చరించారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతలు సహా ఏ వ్యక్తినైనా చచ్చిపోవాలని కోరుకోవడం, పిండప్రదానాలు చేయడం, అవమానకరమైన భాష ఉపయోగించడం రాజకీయాల్లో ఆమోదయోగ్యం కాదన్నారు. సభ లోపల, బయట వ్యక్తిగత దూషణలు, కుల వివక్షకు తావులేకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని స్పీకర్‌ను కోరారు. అవసరమైతే న్యాయ నిపుణులతో సంప్రదించి ప్రత్యేక బిల్లు తీసుకురావాలని, కులం పేరుతో ఒకరినొకరు అవమానించే ఘటనలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. లేకపోతే అంబేద్కర్, గాంధీతో పాటు సామాజిక సంస్కరణల కోసం పోరాడిన మహనీయులందరికీ అవమానకరమని ఆయన పేర్కొన్నారు.

**చట్టసభల్లో నిర్మాత్మకమైన చర్చ జరగాలి**

చట్టసభలో సమస్యలపై నిర్మాణాత్మక చర్చ జరగాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందుకు సభ్యులు తమకు కేటాయించిన సమయాల్లో అంశాల వారీగా మాట్లాడాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఎ భూములు సహా ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని, ప్రతిరోజూ గొడవలతో సభా సమయం వృథా చేయడం సరికాదని బిజెపి సభ్యులకు సూచించారు. స్పీకర్ ఎజెండాలో అంశాలను చేర్చిన తర్వాత వాటిపై చర్చించడం ద్వారా ప్రజలకు మంచి సందేశం వెళ్తుందని పేర్కొన్నారు.

**బిఆర్ఎస్ సభ్యుల సస్పెండ్‌ను పరిశీలించాలి**

వర్షాకాల మొత్తం సమావేశాలకు బిఆర్ఎస్ సభ్యుల సస్పెషన్‌ను ఒక్క రోజుకే పరిమితం చేయాలని స్పీకర్‌ను కూనంనేని సాంబశివరావు కోరారు. బిఆర్ఎస్ సభ్యులు అప్పీల్ చేస్తే పరిశీలిస్తామన్న శాసనసభా వ్యవహార శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు చెప్పిన అంశాన్ని ప్రస్తావిస్తూ గురువారం నుంచి వారికి సభలో పాల్గొనే అవకాశం కల్పిస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. బిఆర్ఎస్, బిజెపి సహా అన్ని పార్టీల సభ్యులు సభలో అంశాల వారీగా కూర్చొని ప్రజా సమస్యలపై చర్చించాలని సాంబశివరావు కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఎ భూములు తదితర అంశాలపై ప్రతిపక్ష సభ్యులతో కలిసి తాము కూడా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సభా సమయం తక్కువగా ఉన్నందున అందరూ సహకరించి సభను సజావుగా సాగనివ్వాలని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.





## ప్రధాన కార్యదర్శిగా నర్సింహ
(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సలహాదారు ఎం.డి.యూసుఫ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.డి.యూసుఫ్, రాష్ట్ర అధ్యక్షుడిగా బి.వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ఎం.నర్సింహ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసిరెడ్డి సీతారామయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్.విలాస్, పి.ప్రేమపావని, ఎం.ఎస్.మూర్తి, ఇ.వెంకన్న, టి.రామాంజనేయులు, వనంపల్లి జైపాల్‌రెడ్డి, మారగోని ప్రవీణ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శిగా పల్లా దేవేందర్‌రెడ్డి, కార్యదర్శులుగా టి.సమ్మయ్య, నరాటి ప్రసాద్, వై.ఓమయ్య, మేకల శ్రీనివాస్, ఎండి.ఇమ్రాన్, పానుగంటి పర్వతాలు, కె.రాజ్‌కుమార్, మేకల దాస్, హాసినా బేగం, రావి శివరామక్రిష్ణ, కోశాధికారిగా కమతం యాదగిరి ఎన్నికైనట్లు తెలిపారు. మొత్తం 121 మంది కౌన్సిల్ సభ్యులు, 47 మంది కార్యవర్గ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేశం, ఎం.నర్సింహ్మ మహాసభ ఆమోదించిన 54 తీర్మానాలను విడుదల చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస పెన్షన్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. కేంద్రంలోని బిజెపి, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తూ కార్మికుల శ్రమను దోచుకుని బడా పారిశ్రామికవేత్తలకు అప్పగించే విధానాలను అనుసరిస్తోందని వారు ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పెద్దఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తోందని, కార్మికులకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సైతం వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

## కమిటీ పరిశీలన (మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించిన ఘటనపై ఎథిక్స్ కమిటీ చర్చించింది. ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై కూడా సభ్యులు దృష్టి సారించారు. మహిళా ఎమ్మెల్యేల విషయంలో తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై న్యాయపరమైన సలహాలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. చట్టసభల గౌరవం, సభ హుందాతనాన్ని కాపాడేలా అవసరమైన చర్యలపై ఎథిక్స్ కమిటీ మరోసారి సమావేశం కావాలని నిర్ణయించింది.

## సస్పెన్షన్ (మొదటి పేజీ తరువాయి)

పల్లా రాజేశ్వర్ రెడ్డి, పి.సబితా ఇంద్రారెడ్డి, కల్వకుంట్ల సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వి.సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, కె.పి. వివేకానందను అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. శాసనసభ బుధవారం ఉదయం సమావేశం కాగానే బిఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ‘వి వాంట్ జస్టిస్’ అని నినాదాలు చేశారు. బిఆర్ఎస్ ఎల్పి నేత కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద చావు డప్పు కొట్టిన ఘటనకు బాధ్యులైన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. సభలో బిఆర్ఎస్ సభ్యుల ఆందోళనలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందిస్తూ సభ్యులు లేవనెత్తిన అంశాన్ని రాతపూర్వకంగా ఇస్తే అవకాశం ఇస్తానని తెలిపారు. స్పీకర్ పోడియం ముందు నిలబడి నినాదాలు చేయడం న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించిన వారు కూడా ఇలా చేయడమేమిటని బిఆర్ఎస్ సభ్యుల పట్ల స్పీకర్ అసహనం వ్యక్తం చేశారు. సభలో పరిస్థితిని చక్కదిద్దేందుకు స్పీకర్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు పలుమార్లు సభ్యులను తమ స్థానాలకు వెళ్లాలని కోరినా బిఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. ప్రశ్నోత్తరాల సమయానికి అంతరాయం కలుగుతుండటంతో సభా నియమాలను ఉల్లంఘిస్తున్న సభ్యులపై చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్పీకర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి శ్రీధర్ బాబు బిఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేయాలని ప్రవేశనెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించడంతో కెటిఆర్, హరీశ్ రావుతో పాటు మొత్తం 22 మంది బిఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత సమావేశాల ముగింపు వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## దద్దరిల్లిన అసెంబ్లీ
(మొదటి పేజీ తరువాయి)

దుయ్యబట్టారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ శతాబ్దాల సామాజిక పురోగతి సాధించిన తెలంగాణలో దళితులు నడిచిన బాటలను శుద్ధి చేయడం వర్ణవివక్షకు, దొరతనపు పోకడలకు అద్దం పడుతోందని విమర్శించారు. ఈ చర్య ద్వారా బిఆర్ఎస్ నేతలు దళితుల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ స్థానాన్ని, వారి కుటుంబ సభ్యులను అవమానించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. స్పీకర్‌కు ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎవరి చావును కోరుకోవడంలేదని, కెసిఆర్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండి, ప్రతిపక్ష నేతగా సేవలు అందించాలని తాము ఆకాంక్షిస్తున్నామని, కానీ సభను అడ్డుకునే బెదిరింపులకు భయపడేదే లేదని స్పష్టం చేశారు. సభాపతిని అవమానించడం సభ్య సమాజానికే అవమానకరమని వ్యాఖ్యానించారు. దళిత సంఘాలు రోడ్డుపై నడిస్తే పసుపు నీళ్లతో శుద్ధి చేయడం ఏ యుగపు పోకడ అని నిలదీశారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని, బిఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకని అన్నారు. పదేళ్లు మంత్రులుగా పనిచేసిన అనుభవజ్ఞులు స్పీకర్‌ను శాసించేలా వ్యవహరించడం సరికాదన్నారు. దొరతనం పోకడలను భరించేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదన్నారు. ‘శుద్ధి కార్యక్రమం’ అంశంపై శాసనసభలో చర్చ జరగాల్సిందేనని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సభా గౌరవాన్ని కాపాడటంతో పాటు సామాజిక న్యాయం, ప్రజల ఆత్మగౌరవాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని సభా కార్యక్రమాలను సజావుగా సాగేందుకు ప్రతిపక్ష సభ్యులు సహకరించాలన్నారు.

**‘దళితులు నడిస్తే శుద్ధి చేస్తారా.. ఏ యుగంలో బతుకుతున్నాం’ : శ్రీధర్ బాబు**

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కెసిఆర్ వందేళ్లకు పైగా జీవించాలని, సమాజానికి తన సేవలు అందించాలని కోరుకుంటున్నామని, ఎవరి మరణాన్ని కాంగ్రెస్ పార్టీ కోరుకోబోదని స్పష్టం చేశారు.

సభ సజావుగా సాగేందుకు ప్రతిపక్షం సహకరించాల్సిన బాధ్యత ఉందని, స్పీకర్‌ను బెదిరించడం లేదా సభా కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని సూచించారు. ‘మీకు ఏం కావాలో లిఖిత పూర్వకంగా ఇవ్వండి. దళితులు నడిచిన చోట బిఆర్ఎస్ నేతలు శుద్ధి చేశారు. మనం ఏ యుగంలో బతుకుతున్నాం. దళితులు నడిస్తే శుద్ధి చేస్తారా? ఈరోజు శాసనసభ నడవాలి. బిఆర్ఎస్ సహకరించాలి. సభ నడువొద్దని బిఆర్ఎస్ నిర్ణయం తీసుకుని వచ్చింది. స్పీకర్‌ను బెదిరించడం సరికాదు’ అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కెసిఆర్ ఇంటి దగ్గర శుద్ధి చేయడం దళితులను అవమానపరచడమేనని మండిపడ్డారు. స్పీకర్‌ను తిట్టిన సంగతి మర్చిపోకముందే బిఆర్ఎస్ నేతలు మరోసారి కులతత్వాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. ఈ అంశంపై చర్చ జరగాలని పట్టుబట్టారు.

**బిజెపి, బిఆర్ఎస్ భావజాలం ఒక్కటే : మంత్రి సీతక్క**

ఢిల్లీలో బిజెపి, గల్లీలో బిఆర్ఎస్ ఇద్దరిదీ ఒకే భావజాలమని మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆరోపించారు. దళితులు, అణగారిన వర్గాల పట్ల ఈ రెండు పార్టీల వైఖరి ఒకే విధంగా ఉందన్నారు. కెసిఆర్ ఫామ్‌హస్ కు మూడు కిలోమీటర్ల దూరంలోనే నిరసన కారులను పోలీసులు అడ్డుకున్నారన్నారు. దళితులు నడిచిన నేలపై పసుపు నీళ్ల చల్లి శుద్ధి చేయడం దుర్మార్గమైన చర్య? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల మూతికి ముంత కట్టి, నడుముకు తాటాకులు కట్టించిన మధ్యయుగ నాటి అమానవీయ ఆచారాలను బిఆర్ఎస్ అమలు చేస్తుంటే, బిజెపి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మంత్రి వాటికి శ్రీహరి మాట్లాడుతూ ఆధునిక సమాజాన్ని ఆటవిక సమాజం వైపు తీసుకెళ్లేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు సమాజాన్ని చీల్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందన్నారు. మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ బిఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక ఆలోచన అని అన్నారు. ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిరసన వ్యక్తం చేసిన నేలను శుద్ధిచేసిన ఘటనపై చర్చకు రాకుండా బిజెపి అడ్డుకుంటుందని మండిపడ్డారు. దళిత అణగారిన వర్గాల అణచివేత, వివక్ష, అన్యాయం జరిగినప్పుడల్లా కమ్యూనిస్టులు అండగా నిలబడ్డారని, ఆ తర్వాత నక్సలైట్ పార్టీ చైతన్యం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఎంఐఎం సభ్యులు మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ ఫామ్‌హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేసిన ప్రాంతాన్ని శుద్ధి చేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## తక్షణం రద్దు చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

కోసం తిరగాల్సి వస్తోందన్నా రు. తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని, వారికి యూరియా సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు సబ్సిడీ యూరియా అందించే సహకార సంఘాలకు గతంలో రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరించేదని, ఇటీవల కాలంలో దానిని ఉపసంహరించుకోవడంతో యూరియా ధరలు పెరిగినట్లు సభ దృష్టికి తీసుకోచ్చారు. ఈ నేపథ్యంలో రానున్న కాలంలో రైతులు వ్యవసాయానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని నెల్లికంటి సత్యం హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునర్ పరిశీలించి, రైతులకు సకాలంలో అవసరమైన మేరకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని నెల్లికంటి సత్యం కోరారు.

**భూమి సాగు చేసే అసలు రైతులకు ఎరువుల అందేలా యాప్: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

గతంలో ఆధార్ ఆధారంగా ఎరువులు పంపిణీ చేసేవారని, కానీ సబ్సిడీ ఎరువులు కేవలం భూమిని సాగు చేసే అసలైన రైతులకు మాత్రమే అందేలా చూసేందుకు ‘ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్’ను ప్రవేశపెట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. యాప్‌లో తలెత్తే సమస్యలను భారత ప్రభుత్వ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందని సిపిఐ సభ్యులు నెల్లికంటి సభ్యులు అడిగిన సమాధానమిచ్చారు. స్మార్ట్‌ఫోన్‌లు లేని రైతులు ఎఫ్ఎఫ్ఎస్ పరిధిలోని కామన్ సర్వీస్ సెంటర్లు (సిఎస్‌సిఎస్) ద్వారా ఎరువులను బుక్ చేసుకోవచ్చని మంత్రి తెలిపారు.

**అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఎ.వి.ఎన్.రెడ్డి అడిగిన ప్రశ్నకు, సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ఉప ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంపై రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు నీటి లభ్యత, పంటల సాగు తదితర అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు, రైతులపై ప్రతికూల ప్రభావం పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఐ ఎమ్మెల్సీ సత్యం కోరారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎల్‌నినో ప్రభావంపై ఆయన ఉప ప్రశ్న వేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

**విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి**

గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ)ల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో బుధవారం ఈ అంశంపై ఆయన ప్రత్యేక ప్రస్తావన చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో విఆర్ఎలు 80 రోజుల పాటు సమ్మె చేస్తే 20 వేల మందిలో 15 వేల పైచిలుకు విఆర్ఎలకు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. మిగతా సుమారు 5 వేల మంది విఆర్ఎలు ఉద్యోగాలు కల్పించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. విఆర్ఎల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, అర్హులైన వారికి వివిధ డిపార్ట్‌మెంట్‌లలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

## ఫామ్‌హౌస్‌లో కుట్ర
(మొదటి పేజీ తరువాయి)

నియమిస్తున్నట్టు సిఎం ప్రకటించారు.

స్పీకర్‌పైన బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలు, ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిరసన వ్యక్తం చేసిన ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనపైన శాసనసభలో బుధవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్పీకర్‌పైన వ్యాఖ్యల ఘటనకు నిరసనగా ఫామ్ హౌస్ వద్ద దండోరా వేయాలని ప్రజాస్వామ్యవాదులు నిరసనకు దిగారని, దళితులు తమ మనసులోని భావాన్ని వ్యక్తం చేసేందుకే డప్పును ఒక సాధనంగా ఉపయోగిస్తారన్నారు. తమను బానిసలుగా భావించొద్దని, సహనాన్ని కోల్పోయేలా వ్యవహరించొద్దని, బిఆర్ఎస్‌ను మేల్కొలిపేందుకు వారు అక్కడికి వెళ్లారని వివరించారు. ఫామ్ హౌస్ వద్ద పోలీసుల బందబస్తును కూడా ఏర్పాటు చేశామని, అక్కడికి నిరసన వ్యక్తం చేసేందుకు వచ్చిన వారిలో నలుగురు ప్రతినిధులను కెసిఆర్ లోపలికి పిలిచి, బాధ్యతతో వ్యవహరించాల్సి ఉండేదని, కానీ కెసిఆర్ మళ్లీ ఉన్మాదిగా వ్యవహరించారని దుయ్యబట్టారు. అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నామా.?లేదా రాతి యుగంలో ఉన్న రాక్షసుల్లా వ్యవహరిస్తారా? అని అన్నారు. దళితులు నడిచిన నేలను శుద్ధిచేస్తే, బిఆర్ఎస్ మనసుల్లో పేరుకున్న అంటరానితనాన్ని ఎలా శుద్ధి చేయాలని, నీళ్లతోనా? యాసిడ్ తో కడగాలా? అని ప్రశ్నించారు. శుద్ధి చేయాల్సింది దళితులు నడిచిన నేలను కాదని, బిఆర్ఎస్ అహంకారం, అంటరానితనం ఆలోచనలను, కెసిఆర్ మనసులో పేరుకుపోయిన దొర అహంకారాన్ని అని, ఈ బాధ్యతను తెలంగాణ సమాజం తీసుకుంటుందని రేవంత్ రెడ్డి తెలిపారు.

**ఆకుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేయాలి...**

ఈ సంఘటలనపైన సమాజంలో చీలికలు తీసుకొచ్చిన దొరలు, దళితులు అనే బేదబావం తీసుకొచ్చి, సమాజాన్ని విభజించాలని,ఒక కుటుంబం చేసే చర్య, మిగతా వారికి ఆపాదించేందుకు ప్రయత్నించడం సమాజానికి మంచిది కాదని. అలాంటి కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేయాల్సిన అవసరం ఉందని సిఎం అన్నారు. ప్రభుత్వం స్పీకర్‌కు అండగా నిలబడుతుందన్నారు. స్పీకర్‌ను మానసికంగా గాయపర్చాలన్న మాటల, బాణాలు, సమాజాం ఆశామాషిగా వదిలిపెట్టబోదని స్పష్టం చేశారు. చట్టాలు, సెక్షన్లను అడ్డం పెట్టుకుని, బెయిల్స్ పొందినప్పటికీ తెలంగాణ సమాజం మాత్రం అలాంటి వారికి బెయిల్ ఇవ్వబోదన్నారు. అత్యంత బలవంతుడైన నిజాంరాజును తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా తెలంగాణ సమాజం మట్టికరిపించారని సిఎం గుర్తుచేశారు.

**తీవ్రవాదులకు, బిఆర్ఎస్‌కు తేడా లేదు...**

పార్లమెంట్ పై దాడి, ముంబై దాడులకు పాల్పడిన కసబ్‌కు, పుల్వామాలో సైనికులపై దాడి చేసిన తీవ్రవాదులకు, సభాపతిపై బిఆర్ఎస్ ఉపయోగించిన భాషకుకు పెద్ద తేడా లేదని సిఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. ఉన్మాదానికి లోనై ఉసిగొల్పిన కొంతమంది ముష్కరులు పోలీసు అధికారులపై దాడులు చేయడంతో పాటు సభాపతిని, ఆయన తల్లిని కూడా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మగౌరవంపైన దాడి చేస్తే ఇందుకు కారకులైన వారిని తెలంగాణ సమాజం, శాసనసభ ఉప్పు పాతర వేస్తుందని సిఎం హెచ్చరించారు. స్పీకర్‌కు ప్రభుత్వం అండగా ఉటుందన్నారు. నిరసన వ్యక్తం చేసిన నేల మైలపడుతుందనే పసుపుతో శుద్ధిచేసినట్టు బిఆర్ఎస్ నాయకులు సంధ్యరావు తెలిపిన విషయాన్ని సిఎం సభలో వివరించారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఉత్తరాఖండ్ లోని ఒక మైదానంలో జరిగిన సభలో ప్రసంగిస్తే, ఆ మైదానాన్ని బిజెపి అనుబంధ సంస్థ శుద్ధీకరణ చేపట్టడం హేయమైన చర్యగా సిఎం అభివర్ణించారు. దీనిపైన పోరాటం కొనసాగుతోందన్నారు.

# విజయం దిశగా ఈస్ట్ జోన్

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026లో ఈస్ట్ జోన్ విజయం దిశగా సాగుతోంది. 372 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఈస్ట్ జోన్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్లకు 212 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్(98 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులతో 80) దూకుడుగా ఆడగా.. శిఖర్ మోహన్(85 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సో 52) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. వైభవ్ సూర్యవంశీ(8), అభిమన్యు ఈశ్వరన్(3) తీవ్రంగా నిరాశపర్చారు. క్రీజులో కుమార కుశాగ్ర (34 బ్యాటింగ్), మహమ్మద్ ఖురైషి( సిక్సో 26 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. సౌత్ జోన్ బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, త్రిపురణ విజయ్, నిదీష్, షేక్ రషీద్ తలో వికెట్ తీసారు. ప్రస్తుతం ఈస్ట్ జోన్ 584 పరుగుల ఆధిక్యంలో ఉంది. గురువారం మ్యాచ్‌కు ఆఖరి రోజు కాగా.. ఈస్ట్ జోన్ డిక్లేర్ చేసి సౌత్ జోన్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించే అవకాశం ఉంది. ఆఖరి రోజు ఆటలో ఎంత దూకుడగా ఆడినా.. 584 పరుగుల



లక్ష్యాన్ని ఛేదించడం కష్టం. సౌత్ జోన్ ఆలౌట్ కాకపోతే మ్యాచ్ డ్రా అవుతుంది. అప్పుడు తొలి ఇన్నింగ్స్లో ఆధిక్యం సాధించిన ఈస్ట్ జోన్‌ను విజేతగా ప్రకటిస్తారు. గెలిచినా.. మ్యాచ్ డ్రా అయినా ఈస్ట్ జోన్‌నే టైటిల్ వరించనుంది.

### చేజారిన తిలక్ వర్మ శతకం..

242/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సౌత్ జోన్.. తొలి ఇన్నింగ్స్‌లో 336 పరుగులకు ఆలౌటైంది. తిలక్ వర్మ(211 బంతుల్లో 9 ఫోర్లతో 99)శతకం చేజార్చుకోగా.. దేవదత్ పడిక్కల్(104 బంతుల్లో 4 ఫోర్లతో 62) హాఫ్ సెంచరీతో రాణించాడు. చామ మిలింద్(68 బంతుల్లో 7 ఫోర్లతో 43) పర్వాలేదనిపించాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్(3/62) మూడు వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ(2/42), ఖరైషి(2/99), శిఖర్ మోహన్ (2/67) రెండేసి వికెట్లు పడగొట్టారు.

### సౌత్ జోన్‌ను ముంచిన స్టార్లు..

అద్వితీయమైన ప్రదర్శనతో ఫైనల్ చేరిన సౌత్ జోన్‌ను స్టార్ ఆటగాళ్లు నట్టేట ముంచేసారు. నేరుగా ఫైనల్ మాత్రమే ఆడుతున్న మహమ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ తీవ్రంగా నిరాశపర్చారు. సిరాజ్ చెత్త బౌలింగ్ ఓటమికి ప్రధాన కారణమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 25 ఓవర్లు బౌలింగ్ చేసిన అతను 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యంతో ఈస్ట్ జోన్ భారీ స్కోర్ నమోదు చేసి సౌత్ జోన్ పతనాన్ని శాసించింది.

# 6 నెలల్లో 41 మ్యాచ్‌లు.. టీమిండియా షెడ్యూల్

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ అనంతరం టీమిండియా ఆటగాళ్లకు చిన్నపాటి విరామం లభించింది. కానీ వచ్చే 6 నెలల్లో టీమిండియా ఆటగాళ్లకు తీరికలేని షెడ్యూల్ ఉంది. అప్కమింగ్ ఐపీఎల్ 2027 సీజన్ వరకు వచ్చే ఐదు నెలల్లో టీమిండియా 41 మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో ఏడు టెస్టు, 14 వన్డేలు, 20 టి–20లు ఉన్నాయి. వచ్చే ఆదివారం(సెప్టెంబర్ 13) నుంచి టీమిండియా మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనుంది. సొంతగడ్డపై అఫ్గానిస్థాన్‌తో మూడు టి20ల సిరీస్ ఆడనున్న టీమిండియా.. అనంతరం మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్ల కోసం వెస్టిండీస్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఓవైపు వెస్టిండీస్ సొంతగడ్డపై సిరీస్ ఆడుతుండగానే.. మరోవైపు శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని మరో జట్టు ఆసియా గేమ్స్ ఆడనుంది. అక్టోబర్ చివర్లో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత్ అక్కడ రెండు టెస్టు, ఐదు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. ఈ పర్యటన అనంతరం శ్రీలంక 3 వన్డేలు, 3 టీ20ల కోసం భారత్‌కు రానుంది. ఈ మ్యాచ్‌లు డిసెంబర్లో జరగనున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో జింబాబ్వే భారత్‌కు కోసం ఆస్ట్రేలియా భారత్ పర్యటనకు రానుంది. ఈ సిరీస్‌తో టీమిండియా అంతర్జాతీయ సీజన్ ముగియనుంది. ఫిబ్రవరి 27 వరకు ఈ సిరీస్ జరగనుండగా.. ఆ తర్వాత ఐపీఎల్




2027 ప్రారంభం కానుంది. సెప్టెంబర్ చివర్లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టి–20 జట్టు జపాన్ వేదికగా జరిగే ఆసియా గేమ్స్‌లో బరిలోకి దిగనుంది. అక్కడ భారత్ ఫైనల్ చేరితే మూడు మ్యాచ్‌లు ఆడనుంది. అంతేకాకుండా జపాన్‌తో ఓ చారిత్రాత్మక మ్యాచ్‌తో బరిలోకి దిగనుంది. తీరిక లేని షెడ్యూల్ నేపథ్యంలో ప్లేయర్స్ ఇంజ్యూరీ మేనేజ్మెంట్ బిసిసిఐకి సవాల్‌గా మారనుంది. ఆటగాళ్లను గాయాల బెడద నుంచి రక్షించుకునేందుకు రొటేషన్ పాలసీని పాటించే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన బిసిసిఐ రివ్యూ మీటింగ్లో ఆటగాళ్ల గాయాల బెడద గురించి ప్రధానంగా చర్చించారు. ఆటగాళ్లకు తగిన విశ్రాంతి దొరికేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

### టీమిండియా తదుపరి షెడ్యూల్..

భారత్ X అఫ్గానిస్థాన్ 3 టి20లు సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు
భారత్ X వెస్టిండీస్ 3 వన్డేలు, 5 టి20లు సెప్టెంబర్ 27 అక్టోబర్ 16
జపాన్ X భారత్ ఏకైక టి–20 మ్యాచ్ సెప్టెంబర్ 22
ఆసియా గేమ్స్ 2026 3 టి20లు(ఫైనల్ చేరితే) సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3
న్యూజిలాండ్ X భారత్ 2 టెస్టులు, 5 వన్డేలు, 5 టి20లు అక్టోబర్ 22 నవంబర్ 27
భారత్ X శ్రీలంక 3 వన్డేలు, 3 టి20లు డిసెంబర్ 13 నుంచి 27
భారత్ X జింబాబ్వే 3 వన్డేలు జనవరి 3–7 (2027)
భారత్ X ఆస్ట్రేలియా 5 టెస్ట్ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ జనవరి 21 ఫిబ్రవరి 27 (2027

# 'గొల్లాల' గుర్తింపు

తెలంగాణలో చారిత్రక ప్రాధాన్యంగల గొల్లాల గుడి ఆలయాన్ని జాతీయ ప్రాధాన్యత కలిగిన స్మారక కట్టడంగా పురావస్తు శాఖ (ఎఎస్ఐ) ప్రకటించింది. గొల్లాల గుడి ఆలయం తెలంగాణలోని ములుగు జిల్లాలో పాలంపేట గ్రామంలో ఉంది. ప్రసిద్ధ కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) ఆలయానికి ఈ ఆలయం నైరుతి దిశలో కొద్దిదూరంలో ఉంది. రామప్ప ఆలయాన్ని యునెస్కో ఇది వరకే ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. కాగా, గొల్లాల ఆలయాన్ని క్రీ.శ. 1213వ శతాబ్దాలకు చెందినది. కాకతీయుల పాలనలో నిర్మించారు. తెలుగు ప్రాంతాల్లో ప్రభావవంతమైన కాకతీయ రాజవంశం 12వ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం వరకు తూర్పు దక్కన్‌లోని విస్తారమైన ప్రాంతాన్ని పాలించింది. ప్రస్తుత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రధాన భూభాగాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలు కూడా వారి రాజ్యంలో భాగంగా ఉండేవి. గొల్లాల గుడి నిర్మాణంలో అరుదైన 'త్రికూటాలయ' శైలి కనిపిస్తుంది. ఇందులో మూడు ప్రత్యేక గర్భగృహాలు ఉంటాయి. ఇవన్నీ స్తంభాలతో కూడిన ఒక కేంద్ర మండపంతో అనుసంధానమై ఉంటాయి. మధ్య గర్భగృహంలో శివలింగం ఉంది. ఆలయం వెలుపలి గోడలపై హిందూ దేవతల శిల్పాలతో కూడిన సూక్ష్మమైన శిల్పకళా గూళ్లు కనిపిస్తాయి. ఆలయ ద్వారాలు, పైభాగంలోని నిర్మాణ అంశాలపై అత్యంత నైపుణ్యంతో చెక్కిన హంసల శిల్పాలు, సంక్లిష్టమైన జాలి పనితనం ఆకట్టుకుంటాయి. ఎత్తయిన పీఠంపై ఆలయం నిర్మించారు. ఈ పీఠాన్ని పుష్పాలు, జంతువుల ఆకృతులతో అలంకరించారు. ప్రధాన ఆలయానికి ఎదురుగా రెండు ప్రత్యేక ఉపాలయాలు ఉన్నాయి. వాటికి సున్నితంగా చెక్కిన ద్వారపాలకుల శిల్పాలు కాపలాగా నిలిచాయి. ప్రాచీన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం (ఎఎంఎఎస్ఆర్/ ఆమ్సర్), 1958కింద గుర్తింపు పొందుతాయి. ఈ కట్టడాలపై కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే భారత పురావస్తు శాఖకు ప్రత్యక్ష అధికారం ఉంటుంది. సాధారణంగా ఒక కట్టడం లేదా ప్రదేశానికి



కనీసం 100 ఏళ్ల చారిత్రక ప్రాధాన్యం ఉండాలి. జాతీయ ప్రాధాన్యత కలిగిన స్మారకంగా అధికారికంగా ప్రకటించిన తర్వాత ఆ కట్టడం చుట్టుపక్కల కార్యకలాపాలను జాతీయ స్మారక చిహ్నాల ప్రాధికార సంస్థ (ఎన్ఎంఎ) నియంత్రిస్తుంది. సాధారణంగా స్మారక కట్టడం చుట్టూ 100 మీటర్ల పరిధిని 'నిషేధిత ప్రాంతం'గా ప్రకటిస్తారు. ఈ ప్రాంతంలో నిర్మాణ కార్యకలాపాలకు అనుమతి ఉండదు. దాని తరువాత మరో 200 మీటర్ల పరిధిని 'నియంత్రిత ప్రాంతం'గా పరిగణిస్తారు.




## అరుదైన సమాధి

చైనాలోని షాన్సీ ప్రావిన్స్‌లో మింగ్ రాజవంశ కాలానికి చెందిన అరుదైన సమాధిని పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. శిల్పాలు, అలంకరణలు, ప్రత్యేకమైన చిత్రలేఖనంతో కూడిన ఈ సమాధి మింగ్ కాలం నాటి నిర్మాణకళ, శిల్పకళ, అంత్యక్రియల సంప్రదాయాలపై కొత్త అవగాహన కల్పిస్తోంది. ఈ సమాధిని అప్పటి ఉన్నత స్థాయి అధికారికి నిర్మించి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. షాన్సీ ప్రాంత చరిత్ర, సంస్కృతిలోని వైభవాన్ని కూడా ఈ ఆవిష్కరణ ప్రతిబింబిస్తోంది. కాగా, ఇటలీలోని డొలోమైట్స్ పర్వతాల్లో మరో ఆసక్తికరమైన చారిత్రక ఆనవాలు బయటపడింది. మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో మౌంట్



క్రిస్టల్లో 2,700 మీటర్లకు పైగా ఎత్తులో సైనికులు నిర్మించిన ఆల్పైన్ శరణాలయాన్ని గుర్తించారు. తీవ్రమైన చలి, మంచు, కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో సైనికులకు ఇది ఆశ్రయంగా ఉపయోగపడింది. ఇటాలియన్, ఆస్ట్రోహంగేరియన్ సేనల మధ్య జరిగిన తీవ్ర పోరాటాలకు ఈ ప్రాంతం వేదికైంది. ఈ రెండు ఆవిష్కరణలు భిన్న కాలాలు, ప్రాంతాల చరిత్రను ప్రతిబింబిస్తూ మానవ నాగరికత వదిలిన విలువైన ఆనవాళ్లను మన ముందుకు తెస్తున్నాయి.

## ఉత్తర అమెరికాలో ప్రాచీన సంస్కృతి

ఉత్తర అమెరికాలోని 'గ్రేట్ లేక్స్' ప్రాంతంలో సుమారు 9,500 సంవత్సరాల క్రితం వికసించిన 'ఓల్డ్ కాపర్ కాంప్లెక్స్' ప్రపంచంలోని అత్యంత ప్రాచీన లోహ వినియోగ సంస్కృతుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇది అర్కాయక్ యుగానికి చెందిన స్థానిక ఆదివాసీ సమాజాల సాంకేతిక



నైపుణ్యానికి నిదర్శనం. నేటి అమెరికాలోని మిషిగాన్ రాష్ట్రంలోని అప్పర్ పెనిన్సులా, ముఖ్యంగా కీవినా, ఐల్ రాయల్ ప్రాంతాల్లో హిమానీనదాల కదలికల వల్ల భూమి ఉపరితలంపైకి వచ్చిన అత్యంత స్వచ్ఛమైన సహజ తామ్రం వీరికి లభించింది. ఈ తామ్రంలో స్వచ్ఛత 99 శాతం వరకు ఉండటంతో దానిని నేరుగా ఉపయోగించే అవకాశం కలిగింది. ఈ ప్రజలకు తామ్రాన్ని కరిగించి వస్తువులు తయారు చేసే సాంకేతిక పరిజ్ఞానం అప్పటికి ఇంకా తెలియదు. అయినప్పటికీ వారు రాతి సుత్తులు, రాతి పనిముట్ల సహాయంతో తామ్రాన్ని పదేపదే కొట్టి కావలసిన ఆకారంలోకి మార్చేవారు. అవసరమైనప్పుడు మంట వేడితో తామ్రాన్ని కొంత మృదువుగా చేసి, మళ్లీ చల్లారిన తర్వాత మలిచే 'కోల్డ్ వర్కింగ్' పద్ధతిని అనుసరించారు. ఈ విధానంలో కత్తులు, ఈటెల మొనలు, చేపలు పట్టే గాలాలు, గొడ్డళ్లు, సూదులు, ఆభరణాలు, ఆచారాలకు ఉపయోగించే వస్తువులు తయారు చేశారు. కాలక్రమేణా తామ్రం కేవలం పనిముట్ల తయారీకే పరిమితం కాలేదు. క్రీ.పూ. 1000 ప్రాంతానికి వచ్చేసరికి అది సామాజిక హోదాకు, ప్రతిష్ఠకు చిహ్నంగా మారింది. అందమైన ఆభరణాలు, అలంకార వస్తువులు, ప్రత్యేక ఆచారాలకు సంబంధించిన వస్తువులు తయారు చేయడం ప్రారంభమైంది. ఈ తామ్ర వస్తువులు గ్రేట్ లేక్స్ ప్రాంతాన్ని దాటి ఉత్తర అమెరికాలోని అనేక ప్రాంతాలకు చేరుకోవడం వల్ల విస్తృత వాణిజ్య సంబంధాలు కూడా ఏర్పడ్డాయి. ఓల్డ్ కాపర్ కాంప్లెక్స్ మానవ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది. లోహాన్ని కరిగించకుండానే దాని సహజ లక్షణాలను వినియోగించి అత్యుత్తమ పనిముట్లు తయారు చేసిన ఈ సంస్కృతి, మానవ సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్య నెట్‌వర్క్‌లు, సామాజిక పరిణామం ఎంత తొలిదశలోనే అభివృద్ధి చెందాయో స్పష్టంగా తెలియజేస్తుంది.


## కార్మికుల ఐక్య పోరాటంతోనే సమస్యలు పరిష్కారం : వాసిరెడ్డి



ప్రజాపక్షం/కాసిపేట :కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు తప్పవని ఎఐటియుసి అధ్యక్షుడు, వేజ్ బోర్డు సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. కాసిపేట 1వ గనిపై బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వంతో పలుమార్లు చర్చించినా ఫలితం లేకపోవడంతోనే సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. అన్ని సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున సమ్మెకు వెళ్తామని హెచ్చరించడంతో యాజమాన్యం దిగివచ్చిందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆర్ఎల్‌సి సమక్షంలో గత నెల 27న 24 డిమాండ్లపై యాజమాన్యంతో ఎఐటియుసి ఒప్పందం కుదుర్చుకుందని వెల్లడిస్తూ, ఆ వివరాలతో కూడిన కరపత్రాన్ని కార్మికులకు వివరించారు. పిట్ కార్యదర్శి వి.రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు దాగం మల్లేష్, చిప్ప నరసయ్య, బియ్యాల వెంకటస్వామి, ఎస్.నాగేశ్వరరావు, మీనుగు లక్ష్మీనారాయణ, పార్వతి సురేష్, చౌద లింగయ్య, కోళ కమలాకర్, ఐ.సంపత్, జె.రంజిత్ కుమార్, ఎస్.అశోక్, గణేష్, బల్లెం శ్రీనివాస్, బియ్యాల రాజన్న, శంకరయ్య, కామెర రాములు, ఎం. సురేష్, ఎం.మహేష్, భాస్కర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు
పుట్కూరి ప్రణీత్ గౌడ్, భాషబోయిన సంతోష్ డిమాండ్




ప్రజాపక్షం/హనుమకొండ : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్కూరి ప్రణీత్ గౌడ్, భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల శాపంగా మారిన జిఓ నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ విద్యార్థి సంఘం 90 వసంతాలు పూర్తి చేసుకుని 91వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, ఉద్యమాల ఖిల్లాగా పేరొందిన హనుమకొండ జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర వార్షికోత్సవాలను సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో వైభవంగా, నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, జిల్లా సమితి సభ్యులు కందకట్ల అజయ్, అనిల్ ముదిరాజ్, శ్రావణ్, వినీల్, అహ్మద్ పాల్గొన్నారు.

# భూ రికార్డుల అక్రమాలపై విచారణ కమిషన్

22ఎ నిషేధ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి
2011 కౌలు రైతుల చట్టాన్ని అమలు చేయాలి
రైతు సంఘాల డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : భూభారతి భూ రికార్డుల్లో చోటు చేసుకున్న అక్రమాలు, అవకతవకలపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన విచారణ కమిషన్ ఏర్పాటు చేసి రికార్డులను సరిచేయాలని పలువురు వ్యక్తులు డిమాండ్ చేశారు. 22ఎ నిషేధ భూములపై సంపూర్ణ వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని, 2011 కౌలు రైతుల చట్టాన్ని అమలు చేసి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మగ్దూంభవన్‌లో రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ఉపాధ్యక్షులు జక్కుల రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వ్యవసాయ విశ్లేషకులు దొంతి నర్సింహారెడ్డి, హైకోర్టు న్యాయవాది మహమ్మద్ సాదిక్ అలీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఉపాధ్యక్షులు ప్రభులింగం కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కోశాధికారి డిజీ నరేంద్ర ప్రసాద్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూరికార్డులను అందుబాటులో ఉంచి రైతులు




స్వయంగా పరిశీలించుకునే అవకాశం కల్పించాలని కోరారు. సాదా బైనామాలకు భూ రికార్డులను కంప్యూటరీకరించే సమయంలోనే అనేక అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన సుమారు 9 లక్షల దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 22ఎ నిషేధ జాబితాలో గతంలో ఉన్న భూములకు అదనంగా ప్రస్తుత ప్రభుత్వం మరో 14 లక్షల ఎకరాలను చేర్చిందని మహమ్మద్ సాదిక్‌అలీ ఆరోపించారు. 22ఎ, భూభారతి, కౌలు రైతుల చట్టం అమలుపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరపాలని, సిసిఎల్ఎకు పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తికి భిన్నంగా నేడు భూయాజమాన్యంలో అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ధరణి, భూభారతిలో జరిగిన అక్రమాలను నిష్పక్షపాతంగా విచారించి భూ రికార్డులను ప్రక్షాళన చేయాలని కోరారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులతో మెట్ట పంటలు వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.8వేల పరిహారం ఇవ్వాలని, కౌలు రైతులకు తక్షణమే గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు, కౌలు రైతు సంఘాల నేతలు పి.రామకృష్ణారెడ్డి, తోకల రాంరెడ్డి, సుధాకర్ గౌడ్, బానేష్, గంటి సురేష్, గిరి, మాధవరెడ్డి చుక్క మొగిలి అల్వాల్ రెడ్డి, రాబర్ట్, నిమ్మల నరసింహ, జంగయ్య, దశరథ, మల్లారెడ్డి, కొమరయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### అసెంబ్లీ సమావేశాల్లో 2011 కౌలు రైతుల చట్టంపై చర్చించాలి : కొప్పోజు

అసెంబ్లీ సమావేశాల్లో 2011 కౌలు రైతుల చట్టంపై చర్చించి తక్షణమే అమలు చేసి, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసేలా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజబహదూర్ గౌర్ హాల్‌లో జక్కుల రామారావు అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం విస్తృత కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా కొప్పోజు సూర్యనారాయణ మాట్లాడుతూ 2011 చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 13 జిల్లాల నుంచి హాజరైన రైతులు, కౌలు రైతులు సమావేశంలో తమ సమస్యలను వివరించారు. అనంతరం సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

### రైతు సంఘం నూతన రాష్ట్ర కమిటీ





గౌరవ అధ్యక్షుడిగా జాలాది రవి, అధ్యక్షుడిగా జక్కుల రామారావు, ప్రధాన కార్యదర్శిగా కొప్పోజు సూర్యనారాయణ ఎన్నికైయ్యారు. కోశాధికారిగా ఎ.శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.రామకృష్ణారెడ్డి, వాడే లక్ష్మి, బండమీది వెంకన్న, బొల్లు ప్రసాద్, మహమ్మద్ పాషా, సహాయ కార్యదర్శులుగా అన్నెం పాపిరెడ్డి, బి.సుభాన్ రెడ్డిలతో పాటు 21 మందిని రాష్ట్ర కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 11 నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి భిక్షపతి

ప్రజాపక్షం/హనుమకొండ : సెప్టెంబర్ 11న జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వాలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలు చేర్చి నేటి తరానికి అందించాలని డిమాండ్ చేస్తున్న పెడచెవిన పెడుతున్నారన్నారు. ట్యాంక్ బండ్‌పై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న నాయకుల విగ్రహాలను, సంఘటనలో జరిగిన ప్రాంతాలలో ప్రభుత్వాధికారకంగా టూరిజం పరంగా అభివృద్ధి చేయాలన్నారు. సెప్టెంబర్ 11న




హనుమకొండ జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యాలయం నుంచి ఏకశిల పార్క్ వరకు వందలాది మందితో ర్యాలీ నిర్వహించి టాను నాయక్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించడం జరుగుతుందని, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరబోయిన కరుణాకర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకటరాజం, కొట్టే పాక రవి తదితరులు పాల్గొన్నారు.

## అధికారికంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

సిపిఐ మహబూబాబాద్ జిల్లా
కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్

ప్రజాపక్షం/మహబూబాబాద్ : అధికారికంగా తెలంగాణ సాయుధ పోరాటం వారోత్సవాలను నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం, 18వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశానికి విజయసారధి హాజరై మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను సెప్టెంబర్ 11నుండి 17వరకు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బి. అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండా సందీప్, చొప్పరి శేఖర్, బైస స్వామి పాల్గొన్నారు.





బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

# 11న దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె

### ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ వెల్లడి

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** దీర్ఘకాలింగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 11న దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె చేపట్టనున్నట్టు ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎఐబిఒఎ) తెలిపింది. బ్యాంకు ఉద్యోగులు, అధికారులందరికీ సమానంగా ఫర్మార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్‌ఐ)ని ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఐదు రోజుల బ్యాంకింగ్‌ను తక్షణమే అమలు చేయాలని కోరింది. ప్రభుత్వ బ్యాంకులను పరిరక్షించాలని, ఐడిబిఐ ప్రైవేటీకరణకు యత్నించే చర్యలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 28, 29, 30 తేదీల్లో మరో విడత దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించింది. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అసోసియేషన్ జాతీయ చైర్మన్ అనిల్ కుమార్ వెల్లంకి, జాతీయ సంయుక్త కార్యదర్శి పి.మురళి, ఎపి, తెలంగాణ అధ్యక్షులు ఐ.హరనాథ్, ప్రధానకార్యదర్శి ఎస్.సుబ్రహ్మణ్యం, ఎఐఐడిబిఒఎ నేతల నేత విఠల్, కెబిఒఎ నేత సుగీత తదితర నేతలు ఆవిష్కరించారు. అనంతరం అనిల్ కుమార్ వెల్లంకి మాట్లాడుతూ బ్యాంకు పనితీరు, వ్యాపారం, లాభాలు ఏ ఒక్క అధికారి లేదా ఎగ్జిక్యూటివ్ కృషి వల్ల మాత్రమే సాధ్యం కావన్నారు. సబ్‌స్టాఫ్, క్లరికల్ సిబ్బంది, అధికారులు, సీనియర్ అధికారులు, ఎగ్జిక్యూటివ్‌లు సమష్టి కృషి ఫలితంగా నేడు బ్యాంకింగ్ వ్యాపారం లాభదాయకంగా నడుస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను లాభాల్లో నడిపిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా కేంద్రప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వరంగ బ్యాంకులను డిజిన్వెస్ట్‌మెంట్ పేరిట ప్రైవేట్‌పరం చేసి ప్రజల సొమ్ము లూటికి, విదేశీ పెట్టుబడిదారులకు అప్పగించే ప్రతిపాదనను దుర్మార్గమన్నారు. దేశ పారిశ్రామిక అభివృద్ధిలో చారిత్రక పాత్ర పోషించిన ఐడిబిఐ బ్యాంక్‌లో ప్రభుత్వం, ఎల్‌ఐసికి ఉన్న 60.72శాతం వాటాను ప్రైవేట్ లేదా విదేశీ సంస్థలకు విక్రయించే డిజిన్వెస్ట్‌మెంట్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ చర్చల సందర్భంగా కార్మిక సంఘాలతో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం వారంలో ఐదు రోజుల బ్యాంకింగ్‌ను తక్షణమే అమలు చేయాలని కోరారు. పిఎల్‌ఐ పంపిణీలో 2024 నవంబర్ నుంచి అమల్లోకి తెచ్చిన వివక్షపూరిత మార్గదర్శకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగుల మధ్య అసమానతలు సృష్టించడం తగదన్నారు. పైస్థాయి నుంచి కిందిస్థాయి బ్యాంకు ఉద్యోగులందరికీ యాన్యువలైజ్డ్ పే ఆధారంగా దామాషా పద్ధతిలో న్యాయబద్ధంగా పిఎల్‌ఐ చెల్లించాలని అనిల్ కుమార్ వెల్లంకి కోరారు.

# రాష్ట్రంలో వారం రోజులు వర్షాలు

### పలుచోట్ల భారీ వర్షాల హెచ్చరిక
### ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు
### ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలకు ప్రత్యేక అప్రమత్తత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వచ్చే వారం రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముండగా, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధ, గురువారాల్లో కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గురు, శనివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగనున్నాయి. మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో కురిసే అవకాశం ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు విస్తృతంగా కురిసే అవకాశముందన్నారు. శని, ఆదివారం ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. ఉత్తర, మధ్య తెలంగాణలోని అనేక జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగనున్నాయన్నారు. ఆది, సోమవారం రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శం

### సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గడీల పాలనకు, దొరల నిరంకుశత్వానికి ఎదురొడ్డి అణచివేతపై తిరుగుబాటు జెండా ఎగరేసిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆమె పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ఐలమ్మ ఎగరేసిన ధిక్కార పతాకం చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆమెకు ఘన నివాళులర్పించారు. అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ఆదర్శమని అన్నారు. సమ్మక్క–సారక్క, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని సిఎం తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవం, ధిక్కార స్ఫూర్తికి ప్రతీకలుగా నిలిచిన ఆ మహనీయుల పోరాట వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఫేక్ మార్ఫింగ్.. ఎఐ చిత్రాలపై

# డిజిపికి బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా, డిజిటల్ వేదికల్లో మార్ఫింగ్, ఎఐ జనరేటెడ్ చిత్రాలు, తప్పుడు ప్రచార కంటెంట్‌ను వ్యాప్తి చేస్తున్న వారిపై తక్షణమే దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ శాసనసభాపక్షం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్‌చారి కలిసి తెలంగాణ డిజిపి (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్‌కు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం అసెంబ్లీ వద్ద బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి, దురుసు ప్రవర్తన ఘటనల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఉద్దేశపూర్వకంగా ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫేక్, మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలను నిజమైనవిగా చూపిస్తూ ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడంతో పాటు ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని బిఆర్‌ఎస్ శాసనసభాపక్షం పేర్కొంది. సైబర్ క్రైమ్ విభాగం వెంటనే సోషల్ మీడియా పోస్టులను గుర్తించి.. వాటిని రూపొందించిన, అప్‌లోడ్ చేసిన వ్యక్తులను గుర్తించాలని కోరింది. చిత్రాలపై సాంకేతిక ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించడంతో పాటు సంబంధిత డిజిటల్ ఆధారాలు, అకౌంట్ వివరాలు, యూఆర్‌ఎల్‌లు, టైమ్‌స్టాంప్‌లు, మెటాడేటాను భద్రపరచాలని విజ్ఞప్తి చేసింది. ఫేక్ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకుని, సైబర్ క్రైమ్, పరువునష్టం, తప్పుడు సమాచార ప్రచారానికి సంబంధించిన వర్తించే చట్టాల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిజిపిని కోరారు. రాజకీయ భేదాలు ఉన్నాయనే కారణంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కల్పిత డిజిటల్ కంటెంట్ సృష్టించి ప్రచారం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో పోలీసుల వైఖరిపై, అలాగే సంబంధిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కూడా చట్టప్రకారం చర్య లు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. మొత్తం వ్యవహారంపై నిష్పక్షపాతంగా, అత్యవసరంగా దర్యాప్తు చేసి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిజిపిని బిఆర్‌ఎస్ నేతలు కోరారు.

# కెసిఆర్ అంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ అంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉందని, ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నామని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ ఆరోగ్యం విషయంలో కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతలను గౌరవించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీదని, ముఖ్యమంత్రి తర్వాత అంతటి భద్రతను ప్రతిపక్ష నేతగా కెసిఆర్‌కు ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కెసిఆర్ బాత్‌రూమ్‌లో జారిపడిన సమయంలో గ్రీన్ ఛానల్ ద్వారా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే కెసిఆర్ అసెంబ్లీకి అరుదుగా హాజరయ్యారని అన్నారు.వాజ్‌పేయి, జైపాల్‌రెడ్డి విషయంలో కాంగ్రెస్ అనుసరించిన మానవతా వైఖరిని ప్రస్తావిస్తూ, అనారోగ్యంతో ఉన్న వాజ్‌పేయిని అమెరికాకు పంపించి చికిత్స చేయించిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. జైపాల్‌రెడ్డికి బైపాస్ సర్జరీ చేయించిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు.కెసిఆర్ ఆరోగ్యంపై రాజకీయ ఆరోపణలు చేయడం కంటే కుటుంబంలో ఉన్న సమస్యలను కాంగ్రెస్‌కు ఆపాదించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ సాక్షాత్తు ముఖ్యమంత్రికి పిండప్రదానం చేయడం, ఇలాంటి రాజకీయ సంస్కృతి మంచిది ఆయన పేర్కొన్నారు. కెసిఆర్ ఆరోగ్యం చెడిపోవాలని హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేయించారన్న కవిత వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఇప్పటివరకు వివరణ ఇవ్వలేదని తెలిపారు. కవిత చేసిన వ్యాఖ్యల వీడియోను ప్రస్తావిస్తూ, ఆరోపణలపై హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాత మధు చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమన్నారు. దళితులకు అత్యున్నత పదవులు ఇచ్చి గౌరవించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# కాళోజీ సేవలు ఎంతో గొప్పవి

### ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించాలి : ఆర్‌టిసి ఇడి ఎం.రాజశేఖర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ భాషకు ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు చేసిన సేవలు ఎంతో గొప్పవని, ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిజిఎస్ ఆర్‌టిసి ఇడి(ఐటి) ఎం. రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆర్‌టిసి బస్‌భవన్‌లో కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్‌టిసి ఇడి (ఐటి) ఎం. రాజశేఖర్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ప్రజల గొంతుకగా నిలిచి హక్కుల కోసం పోరాడిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎ విజయపుష్ప, సిపిఎం ఉషాదేవి, సిఎంఇ జానీరెడ్డి, సిటిఎం శ్రీదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కెటిఆర్‌పై ఎంపి మల్లు రవి ఫిర్యాదు

### సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు..
### చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ చేసినట్లు పేర్కొంటున్న అనుచిత, అవమానకర వ్యాఖ్యలపై నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి పోలీసులను ఆశ్రయించారు. రాజకీయ విమర్శల పరిధిని దాటి వ్యక్తిగతంగా అవమానించేలా వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపిస్తూ బేగంబజార్ సెంట్రల్ జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ముఖ్యమంత్రి వంటి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజా జీవితంలో ఉన్న పదవుల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని మల్లు రవి పేర్కొన్నారు. సంబంధిత వీడియోలు, మీడియా కథనాలు, సోషల్ మీడియాలో ప్రచారమైన సమాచారంతో పాటు ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరిచి సమగ్ర విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. బిఎన్‌ఎస్–2023లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మల్లు రవి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ, వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలకు చట్టపరమైన హద్దులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

# గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

### ఈనెల 25న అర్ధరాత్రి వరకు మెట్రో..
### రాత్రంతా ఎంఎంటిఎస్ సేవలు
### విద్యుత్ వైర్లు, రోడ్డు పనులపై సిపి సజ్జనర్ కీలక ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపును ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు హైదరాబాద్ పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. నిమజ్జన మార్గాల్లో ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్ ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం ఆయన అధ్యక్షతన వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమగ్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. నిమజ్జన మార్గాల్లో రోడ్లకు అడ్డంగా వేలాడుతున్న విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ వైర్లను వెంటనే తొలగించి, తగిన ఎత్తులో క్లియరెన్స్ కల్పించాలని సిపి ఆదేశించారు. గతంలో రామాంతపూర్‌లో చోటుచేసుకున్న ప్రమాదాలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేశ్ మండపాలకు నిబంధనల ప్రకారం సురక్షిత విద్యుత్ కనెక్షన్లు, ఎర్తింగ్ కల్పించి, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అనుమతులు పొందేలా చూడాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 14 నాటికి ప్రధాన నిమజ్జన మార్గాలు, ఫీడర్ రూట్లలో కొనసాగుతున్న రోడ్డు, నాలా, స్లాబ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జనం ముగిసే వరకు కొత్తగా రోడ్ల తవ్వకాలు, కేబుల్ పనులు చేపట్టవద్దని ఆదేశించారు. పాతబస్తీలో మెట్రో పనుల కారణంగా విద్యుత్ స్తంభాల మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు హైదరాబాద్ జిల్లా పరిధిలో 26 ప్రాంతాల్లో, బాలాపూర్ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 24 గంటలూ అంబులెన్సులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు.

**రవాణాపై ప్రత్యేక దృష్టి..**

నిమజ్జనం రోజున ట్రాఫిక్ నియంత్రణకు తగిన పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేయాలని, ఆర్‌టిసి, రవాణా శాఖలు అవసరమైన బస్సులు, గూడ్స్ వాహనాలు, డ్రైవర్లను సమకూర్చాలని సిపి సూచించారు. క్రేన్లు, ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, మెయింటెనెన్స్ బృందాల వివరాలను ముందుగానే పోలీసులకు అందించాలని తెలిపారు. సెప్టెంబర్ 25న జరిగే ప్రధాన నిమజ్జనం సందర్భంగా ప్రజల సౌకర్యార్థం **రాత్రి 1 గంట వరకు మెట్రో సేవలు, అలాగే నాంపల్లి, లక్డీకాపూల్, ఖైరతాబాద్, సంజీవయ్య పార్క్, జేమ్స్ స్ట్రీట్, బేగంపేట్ స్టేషన్ల నుంచి రాత్రంతా ఎంఎంటీఎస్ సేవలు** అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.



# త్వరితగతిన పిఆర్‌సి నివేదిక

### పే రివిజన్ కమిషన్ ఛైర్మన్‌కు సిఎస్ లేఖ
### ఉద్యోగ జెఎసి సంఘాలతో సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పిఆర్‌సి నివేదికను త్వరితగతిన పూర్తి చేసి సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పే రివిజన్ కమిషన్ చైర్మన్‌ను కోరారు. నివేదిక సమర్పణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ పే రివిజన్ కమిషన్ చైర్మన్‌కు సిఎస్ లేఖ రాశారు. గత ఆగస్టు 20న జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి), ఇతర ఉద్యోగ సంఘాలు ఇచ్చిన నోటీసు నేపథ్యంలో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఉద్యోగ సంఘాల జెఎసి, ఇతర సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పిఆర్‌సి, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్), పెండింగ్ డిఎలు, ఇతర బిల్లులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సిపిఎస్‌కు సంబంధించిన వివిధ సమస్యలను అధ్యయనం చేసేందుకు పిఆర్‌సి నిపుణులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీ సిపిఎస్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేయనుంది. ప్రస్తుతం శాసనసభ, శాసనమండలి సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలోపెండింగ్‌లో ఉన్న డిఎలు, ఇతర బిల్లులపై చర్చించేందుకు ఈనెల 18న జేఏసీ, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మరోసారి సమావేశం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

# జిల్లా వినియోగదారుల కమిషన్ నియామకాలపై వివరాలివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిల్లా వినియోగదారుల కమిషన్ల అధ్యక్షులు, సభ్యుల నియామకాలపై పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అర్హతలు లేనివారిని నియమించారంటూ న్యాయవాది విజయ్‌గోపాల్ దాఖలు చేసిన కోవారెంటో పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ జరిపారు. పలువురు అధ్యక్షులు, సభ్యులకు నిర్దేశిత అర్హతలు లేవని, సంబంధిత పరీక్షల్లో ఉత్తీర్ణతకు సంబంధించిన రికార్డులు కూడా లేవని పిటిషనర్ తెలిపారు. నియామకమైన అధ్యక్షుల అర్హతలు, ఎంపిక ప్రక్రియ, సెలక్షన్ కమిటీ సిఫారసులు, ప్రభుత్వ ఆమోదం తదితర వివరాలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని హైకోర్టు తెలిపింది. జిల్లా జడ్జి అర్హతలున్న న్యాయవాదులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జడ్జిలుగా నియమిస్తున్నప్పుడు జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులుగా ఎందుకు నియమించరాదని న్యాయమూర్తి ప్రశ్నించారు. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేశారు.

# ఉదయ్‌కృష్ణారెడ్డికి హైకోర్టులో ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ట్రైనీ ఐపిఎస్ అధికారి ఎం.ఉదయ్‌కృష్ణారెడ్డికి లైంగిక సామర్థ్య పరీక్ష నిర్వహించేందుకు కింది కోర్టు ఇచ్చిన అనుమతిని హైకోర్టు రద్దు చేసింది. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన దరఖాస్తు చట్ట నిబంధనలకు అనుగుణంగా లేదని, మద్రాసు, కర్ణాటక హైకోర్టులు జారీ చేసిన మార్గదర్శకాలను కూడా పాటించలేదని హైకోర్టు పేర్కొంది. అవసరమైతే చట్టప్రకారం తగిన పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

# అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాల్సిందే

### జిహెచ్‌ఎంసికి స్పష్టం చేసిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెండు అంతస్తులు మాత్రమే నిర్మించాల్సిన114.14 చదరపు గజాల స్థలంలో గౌండ్ ప్లస్ అయిదు లేదా ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. 75 చదరపు గజాల వరకు స్వీయ ధ్రువీకరణతో నిర్మాణాలకు అవకాశం ఉన్న నిబంధనను దుర్వినియోగం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసిని ఆదేశించింది. సిద్దంబజార్, బేగంబజార్‌లో నిర్మాణాలను పరిశీలించి అనుమతులు ఉన్నాయో, నిబంధనల ప్రకారమే పనులు జరుగుతున్నాయో తనిఖీ చేయాలంది. సిద్దంబజార్‌లో పిటిషనర్ చేపట్టిన నిర్మాణానికి సీలు వేసి నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. రాజ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. 114.14 చదరపు గజాల్లో గౌండ్ ప్లస్ రెండంతస్తులకు మాత్రమే అనుమతి సాధ్యమైనప్పుడు నాలుగు, ఐదు అంతస్తుల నిర్మాణాన్ని ఎలా క్రమబద్ధీకరించాలని కోరుతున్నారో అర్థం కావడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలను సెక్షన్ 455ఎ, 455ఏఏ కింద క్రమబద్ధీకరించే అవకాశం లేదన్నారు. నిర్మాణ అనుమతులను ప్రదేశాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని, ఉల్లంఘనలు ఉంటే పనులను అడ్డుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు.

# మాకు సురక్షిత వసతి కల్పించండి

### కశ్మీరీ పండిట్ ఉద్యోగులు డిమాండ్

**శ్రీనగర్ :** కశ్మీరీ వలసదారుల కోసం ఉద్దేశించిన ప్రధాన మంత్రి ఉపాధి పథకం కింద నియమితులైన కశ్మీరీ పండిట్ ఉద్యోగులు, తమకు ఉన్న ఉగ్రవాద ముప్పు దృష్ట్యా సురక్షితమైన వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరసన తెలిపారు. ఈ నెల చివరిలోగా తమకు సురక్షితమైన వసతి కల్పించకపోతే నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని ఉద్యోగులు హెచ్చరించారు.యునైటెడ్ లిబరేషన్ కౌన్సిల్ అనే ఉగ్రవాద సంస్థ, కాశ్మీర్‌లో పనిచేస్తున్న కశ్మీరీ పండిట్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఆ బృందం, సోషల్ మీడియాలో పలువురు కశ్మీర్ పండిట్ ఉద్యోగుల పేర్లు, ఫోన్ నెంబర్లను పోస్ట్ చేసి, జమ్ములో కూడా వారిని లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించింది. 'మా కార్యాలయాల్లోని భద్రతా ఏర్పాట్లతో మే ం సంతోషంగా ఉన్నాం. మాకు ఉన్న ఏకైక ఆందోళన వసతి గురించే. ఇప్పటికే పూర్తి అయిన 26 భవనాలలో ఉద్యోగులకు యాజమాన్య యంత్రాంగం కేటాయింపులు చేయాలి' అని ఇక్కడ 'ప్రెస్ ఎన్‌క్లేవ్'లో నిరసన తెలుపుతున్న ఒక ఉద్యోగి తెలియజేశారు. ఏదో ఒక సాకుతో వసతి కోసం ఉద్యోగులను నానా తిప్పలు పెడుతున్నారని ఆయన చెప్పారు.

# 12న న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సు ప్రారంభం

### ఇంధనం, ఆహారం, సరఫరా వ్యవస్థపై ప్రధాన చర్చ




**న్యూఢిల్లీ :** రెండు రోజులపాటు జరిగే బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సదస్సు ఈనెల 12వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రారంభమవుతుంది. భౌగోళిక, రాజకీయ సంక్షోభాలు ఎదుర్కొంటున్న ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ,కీలక సరఫరాలు సజావుగా సక్రమంగా కొనసాగించడం వంటి విషయాలపై ప్రధానంగా నాయకులు దృష్టి సారిస్తారు. విచ్ఛిన్నమైన భౌగోళిక,రాజకీయ వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి, ప్రపంచ స్థిరత్వాన్ని కాపాడేందుకు,సాధారణ వాతావరణాన్ని వెనక్కు తీసుకువచ్చేందుకు ఈ సదస్సులో నాయకులు చర్చలు,తీర్మానాల ద్వారా తమ వంతు కృషి చేస్తారు. రష్యా, చైనా సహా ప్రపంచ నాయకులు ఈ సదస్సులో పాల్గొంటారు. దీంతో రాజధానిలో భారీ భద్రతాఏర్పాట్లు చేశారు.చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్,రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్,ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో తదితర ప్రముఖులు సదస్సులో పాల్గొంటారు. ఐతే పొరుగున ఉన్న బంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ ఈ సదస్సుకు హాజరవుతున్నారా?లేదా? అనే విషయాన్ని ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ ధృవీకరించలేదు. మరోవైపు పశ్చిమాసియాలో సంక్షోభంపై ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య విభేదాలు ఉన్నందువల్ల, ఇంకా ఉన్న సమయం కేవలం మూడురోజులే కావడంవల్ల ఈ కూటమి దేశాలు ఒక ఉమ్మడి ప్రకటన చేసేందుకు ఏకాభిప్రాయానికి వచ్చాయా?లేదా? అనే విషయంపై కూడా ఇంకా స్పష్టత రాలేదు. ఏకాభిప్రాయ చట్రంలో ఈ కూటమి తన విధులు నిర్వహిస్తోంది. వాస్తవానికి బ్రిక్స్ ఆవిర్భవించినప్పుడు బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు మాత్రమే సభ్యులుగా ఉన్నాయి. ఆ తర్వాత 2024లో ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా దేశాలు సభ్యులుగా చేరాయి. 2025లో ఇండోనేసియా బ్రిక్స్ సభ్యత్వం స్వీకరించింది.అదే విధంగా బెలారస్, బొలీవియా, కజఖస్థాన్, క్యూబా, మలేసియా, నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, వియత్నాం దేశాలు కూడా గత ఏడాదిలోనే బ్రిక్స్ భాగస్వామ్యదేశాలుగా చేరాయి.




## తెలంగాణ భాష కోసమే రాష్ట్ర సాధన

ప్రముఖ వాగ్గేయకారుడు అంబటి వెంకన్న

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ భాష కోసమే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని ప్రముఖ వాగ్గేయకారుడు అంబటి వెంకన్న అన్నారు. బుధవారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజి నారాయణ రావు జయంతి వేడుకలను, తెలంగాణ భాషా దినోత్సవాన్నీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి,వాగ్గేయకారుడు అంబటి వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భాషా పరమైన ఆత్మ గౌరవం కోసమే ప్రత్యేక తెలంగాణను సాధించుకున్నామని గుర్తుచేశారు. ఇప్పటి జెన్జి తరం ప్రత్యేక తెలంగాణ పోరాట వారసత్వాన్ని తెలుసుకోవాలని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ కాళోజి జీవితాన్ని ఆదంర్శగా తీసుకొని అన్యాయానికి ఎదురు నిలబడాలని యువతకు సూచించారు. పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి.మునిస్వామి, విద్యాత్మిక సమన్వయకర్త బి. నాగరాజు,తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వెంల్డడి శ్రీధర్,అధ్యాపకులు డాక్టర్ జ్యోత్స్న, మల్లేశం,సరిత పాల్గొన్నారు.



## పారదర్శకంగా అంగన్‌వాడీ పోస్టుల ఎంపిక ప్రక్రియ : ఆర్‌డిఒ రమణారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్డీఓ రమణారెడ్డి అధ్యక్షతన ఈ ఎంపిక ప్రక్రియ కొనసాగింది.ఈ సందర్భంగా అధికారులు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ ప్రాజెక్టు పరిధిలోని 16 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం 81 మంది అభ్యర్థులను అర్హులుగా ప్రాథమికంగా నిర్ధారించారు. అలాగే 29 హెల్పర్ పోస్టులకు సంబంధించి భారీగా దరఖాస్తులు రాగా, పరిశీలన పూర్తి చేసి ఇంటర్వ్యూలకు 92 మంది అభ్యర్థులను అర్హులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇంటర్వ్యూల కోసం హాజరైన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను ముందుగా అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ బోర్డు ముందుకు పంపించారు. నిబంధనల ప్రకారం అర్హత, ప్రతిభ ఆధారంగానే ఎంపికలు ఉంటాయని వెల్లడించారు.ధ్రువీకరణ పత్రాల తనిఖీ ప్రక్రియలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె. నాగమణి, సిహెచ్. పద్మ, నజీమాబేగం, శాంతి, బ్లాక్ కోఆర్డినేటర్ కె. కవిత, సీనియర్ అసిస్టెంట్ రాములు పాల్గొన్నారు. ఇంటర్వ్యూల నిర్వహణను ఆర్డీఓ రమణారెడ్డితో పాటు సీడీపీఓ ఎం. వేణుగోపాల్ రావు, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్ శర్మ తదితరులు పర్యవేక్షించారు.

## ఆటలు ఆడుతూ గురుకుల విద్యార్థి మృతి

● ఆసుపత్రి వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని మహాత్మ జ్యోతిబా పూలే బిసి బాలుర గురుకుల పాఠశాలలో విషాదం చోటు చేసుకుంది. ఎనిమిదవ తరగతి చదువుతున్న సాత్విక్ అనే విద్యార్థి బుధవారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి ఆటలు ఆడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గుర్తించిన పాఠశాల సిబ్బంది చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతిచెందాడు. ఆకస్మికంగా గుండెపోటుతో సాత్విక్ మృతిచెంది ఉండవచ్చునని ప్రాథమికంగా భావిస్తున్నారు. మరణానికి ఖచ్చితమైన కారణాలు, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే తెలుస్తాయని అధికారులు తెలిపారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన హరీష్, ప్రియాంక దంపతుల కుమారుడు సాత్విక్‌ను ఉన్నతంగా చదివించాలనే ఆశతో గురుకుల పాఠశాలలో చేర్పించారు. కుటుంబ పోషణ కోసం వీరు హైదరాబాద్‌లో రోజు వారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆసుపత్రి వద్దకు వచ్చి గుండెలు అవిసేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అక్కడ ఉన్న వారిని కలిచివేశాయి. విద్యార్థి మృతికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, ఆర్‌సిఎంలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఆర్డీవో శ్రీనివాస్, ఏసిపి రమణమూర్తి, సిఐ ఉస్మాన్ షరీఫ్ సంఘటన స్థలంకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థి కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలతో మాట్లాడారు. అనారోగ్యంతో జరిగిన ఈ దుర్ఘటన అత్యంత బాధాకరమని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## బిజెపి గెలుపును అడ్డుకోలేరు

● కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత : బండి సంజయ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణ రాష్ట్రంలో బిజేపి అధికారంలోకి రావడం ఖాయమని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం భద్రాచలంలో బిజేపి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల అనంతరం బిజేపి అధిష్టానం తెలంగాణపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, రానున్నది బిజేపి ప్రభుత్వమే అన్నారు. కేంద్రప్రభుత్వ సహకారంతో అమలు చేస్తున్న ఇళ్ల పథకం సన్నబియ్యం వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకుంటోందని బండి విమర్శించారు. గతంలో కేసిఆర్ ప్రభుత్వాన్ని ఎదుర్కొంటూ బిజేపి కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, అయినప్పటికీ వెనుకడుగు వేయలేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని బండి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశాన్ని పాలించిన కాంగ్రెస ప్రభుత్వం ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని వ్యాఖ్యానించారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పురోగతి

అదుపులో ముగ్గురు ఆర్మీ అధికారులు.. లోతుగా దర్యాప్తు చేస్తున్న మిలిటరీ ఇంటెలిజెన్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బొల్లారం ఆర్మీ కంటోన్మెంట్‌లోని మద్రాస్ రెజిమెంట్ ఆయుధశాల నుంచి తుపాకులు, మందుగుండు సామగ్రి మాయమైన ఘటన దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆయుధాల చోరీ వ్యవహారంపై మిలిటరీ ఇంటెలిజెన్స్ దర్యాప్తును ముమ్మరం చేసి ముగ్గురు ఆర్మీ అధికారులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సుమారు మూడు నెలలుగా దశలవారీగా ఆయుధాలు మాయమైనట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది. గత వారం నిర్వహించిన సాధారణ ఆడిట్‌లో ఆయుధాలు, మందుగుండు సామగ్రిలో తేడాలు గుర్తించడంతో చోరీ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 30 అర్ధరాత్రి ఈ విషయం బయటపడటంతో ఆర్మీ వర్గాలు అప్రమత్తమై దర్యాప్తు చేపట్టాయి. ఆయుధశాలలో భద్రతా లోపాలు, ఆయుధాల లెక్కల్లో తేడాలు, వాటి మాయమైన విధానంపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన ఆయుధాలు కంటోన్మెంట్ నుంచి మాయమైన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చోరీకి సంబంధించి అంతర్గత వ్యక్తుల ప్రమేయం ఉందా? ఆయుధాలు ఎక్కడికి తరలించారు? ఎంతకాలంగా ఈ వ్యవహారం కొనసాగుతోంది? అనే కోణాల్లో మిలిటరీ ఇంటెలిజెన్స్ విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. అదుపులో ఉన్న ముగ్గురు అధికారుల నుంచి సేకరిస్తున్న సమాచారంతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**కంటోన్మెంట్‌లో ఆయుధాల చోరీ ఎఫెక్ట్ ..**

**9 రోడ్లు బంద్ :**

బొల్లారం ఆర్మీ కంటోన్మెంట్‌లో ఆయుధాలు, మందుగుండు సామగ్రి చోరీ ఘటన ప్రభావం సామాన్యుల రాకపోకలపై పడింది. ఆగస్టు 30 రాత్రి మద్రాస్ రెజిమెంట్‌లో జరిగిన చోరీ అనంతరం కంటోన్మెంట్ పరిధిలో 9 ప్రధాన రహదారులను మూసివేయడంతో 10లక్షల మందికి పైగా ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎఫ్ఎన్ఇసిఎస్ వెల్లడించింది. ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాల రద్దీ పెరిగి ప్రయాణ సమయం భారీగా పెరిగిందని పేర్కొంది. యాప్రాల్, బైయామ్, హిస్లాప్, రాజేందర్‌సింగ్‌జీ, బార్, రిచర్డ్‌సన్, గోల్ఫ్‌కోర్స్–బాలాజీనగర్, అమ్ముగూడ, ప్రోట్నీ రోడ్లను మూసివేయడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎఫ్ఎన్ఇసిఎస్ తెలిపింది. ముఖ్యంగా యాప్రాల్ నుంచి హకీంపేట్ చెక్ పోస్ట్‌కు గతంలో 10 నిమిషాల్లో చేరుకునే ప్రయాణం.. సాయంత్రం వేళల్లో 40 నిమిషాలకు పైగా పడుతోందని పేర్కొంది. ఆయుధాల చోరీ దర్యాప్తు నేపథ్యంలో రహదారులను మూసివేసినట్లు భావిస్తున్నప్పటికీ, ఈ విషయంపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదని ఎఫ్ఎన్ఇసిఎస్ తెలిపింది. దర్యాప్తు కొనసాగుతున్న కారణంగా ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడం సమంజసం కాదని పేర్కొంటూ, **మూసివేసిన రోడ్లను వెంటనే తెరవాలని సైనిక అధికారులను కోరింది. దర్యాప్తుతో పాటు ప్రజల రవాణా ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించింది.

## నకిలీ వీసాలతో దుబాయ్‌కు పంపే కుట్ర!

లోతుగా దర్యాప్తు చేస్తున్న సిసిఎస్ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అమాయకులను నమ్మించి నకిలీ వీసాలు, విమాన టికెట్లు ఇచ్చి దుబాయ్‌కు పంపేందుకు ప్రయత్నించిన ఉదంతం ఆర్‌జిఐ విమానాశ్రయంలో బయటపడింది. ఇమ్మిగ్రేషన్ అధికారులు వీసాలను పరిశీలించగా అవి నకిలీవని తేలడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ వ్యవహారంపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలానికి చెందిన 40 ఏళ్ల మహిళ విదేశాల్లో పనిచేసేందుకు ప్రయత్నించింది. గతంలో మస్కట్‌లో రెండేళ్లు పనిచేసి 2025 ఏప్రిల్‌లో భారత్‌కు తిరిగొచ్చిన ఆమె.. దుబాయ్‌లో ఉద్యోగం కోసం భర్తతో కలిసి భీమవరానికి చెందిన వీసా ఏజెంట్ బొంతు శ్రీనివాసును సంప్రదించింది. వీసా, పిఒఇ సర్టిఫికెట్, వైద్య పరీక్షలు, విమాన టికెట్ తదితర ఏర్పాట్లు చేస్తానని శ్రీనివాసు హామీ ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీసా సిద్ధమైందని చెప్పి హైదరాబాద్ విమానాశ్రయం వద్ద షఫీ అహ్మద్‌ను కలవాలని సూచించినట్లు బాధితురాలు తెలిపింది. దుబాయ్ విమానం మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఉందని చెప్పి, షఫీ అహ్మద్ వాట్సాప్ ద్వారా వీసా, విమాన టికెట్ పంపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలు విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ కౌంటర్‌కు వెళ్లగా, అధికారులు వీసాలను పరిశీలించి అవి ఆన్‌లైన్ వ్యవస్థలో కనిపించడం లేదని, నకిలీవని గుర్తించినట్లు ఫిర్యాదులో తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లేవారికి చెల్లుబాటు అయ్యే వర్క్ వీసాతో పాటు అవసరమైన పీవోఈ అనుమతులు ఉండాలని అధికారులు వివరించినట్లు పేర్కొన్నారు. పిఒఇ ఖర్చును తప్పించుకునేందుకు కొందరు ఏజెంట్లు కార్మికులను విజిట్ వీసాలపై పంపించి, తర్వాత వాటిని అక్రమంగా మార్చే ప్రయత్నాలు చేస్తుంటారని ఇమ్మిగ్రేషన్ అధికారులు తెలిపినట్లు ఫిర్యాదులో ఉంది. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితురాలు భర్తతో కలిసి పోలీసులను ఆశ్రయించింది. దర్యాప్తులో నిందితులుగా పేర్కొన్న బొంతు శ్రీనివాసు, షేక్ లతీఫుల్లాను అదుపులోకి తీసుకుని బిఎన్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సీతాఫల్‌మండి స్టేషన్‌లో ఎస్‌సిఆర్ జిఎం తనిఖీ

సిగ్నలింగ్ వ్యవస్థ, పాయింట్లు, క్రాసింగ్‌ల పరిశీలన..

భద్రతపై ప్రత్యేక సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైళ్ల రాకపోకల్లో భద్రతే అత్యంత కీలకమన్న దృష్టితో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం సీతాఫల్‌మండి స్టేషన్ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరు, పాయింట్లు, క్రాసింగ్‌ల నిర్వహణను స్వయంగా పరిశీలించడంతో పాటు రైల్వే కార్యకలాపాల్లో భద్రతా ప్రమాణాల అమలును సమీక్షించారు. స్టేషన్ పరిధిలోని సిగ్నలింగ్ ఆస్తుల పనితీరును పరిశీలించిన జిఎం.. పాయింట్లు, క్రాసింగ్‌ల నిర్వహణ తీరును కూడా తనిఖీ చేశారు. రైళ్ల సురక్షిత రాకపోకలకు సంబంధించి తీసుకుంటున్న భద్రతా చర్యలు, నిర్వహణ విధానాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే కార్యకలాపాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, సిగ్నలింగ్ తదితర కీలక వ్యవస్థల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించినట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి.

## అరకిలో బంగారం ఇస్తామంటూ రూ.80 లక్షలు దోచుకున్నారు

సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

అక్షర మెటల్స్ డైరెక్టర్, దంపతులపై కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అరకిలో బంగారం ఇస్తామని నమ్మించి ఓ వ్యాపారి నుంచి రూ.80 లక్షలు తీసుకుని మోసగించిన అక్షర మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కోట కుమార్, నితూ జ్యువెలర్స్‌కు చెందిన నవనీత, ఆమె భర్త మురళీకృష్ణపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. మొఘల్‌పురాకు చెందిన గ్లోరీ ఇంటర్నేషనల్ నిర్వాహకుడు మహమ్మద్ అమానుల్లా ఫిర్యాదు ప్రకారం.. బంగారంలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని భావించి నవనీత, మురళీకృష్ణను సంప్రదించారు. వారు అక్షర మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా బంగారం అందిస్తామని, 500 గ్రాముల బంగారం తీసుకోవచ్చని నమ్మించారని ఆరోపించారు. వారి సూచన మేరకు అక్షర మెటల్స్ బులియన్ ఖాతాకు ఫిబ్రవరి 12, 13 తేదీల్లో విడతలుగా మొత్తం రూ.80 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. డబ్బు చెల్లించిన అనంతరం బంగారం తీసుకునేందుకు యెస్ బ్యాంకు చందానగర్ శాఖకు వెళ్లగా, అక్షర మెటల్స్ ఖాతాలో సాంకేతిక సమస్య ఉందని బ్యాంకు అధికారులు చెప్పినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. దీంతో తాను డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, కోట కుమార్ రూ.80 లక్షల చెక్ ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత కూడా బంగారం ఇవ్వకపోవడంతో చెక్‌ను బ్యాంకులో జమ చేయగా అందులో నిధులు లేకపోవడంతో చెక్‌బౌన్స్ అయ్యింది. తన నుంచి రూ.80 లక్షలు తీసుకుని బంగారం ఇవ్వకపోవడం, డబ్బు తిరిగి చెల్లిస్తామని ఇచ్చిన చెక్ కూడా చెల్లకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించినట్లు అమానుల్లా ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కష్టార్జిత డబ్బును తిరిగి ఇప్పించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్ఐ స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పబ్‌లపై ఫైర్ శాఖ కొరడా

ఫైర్ ఎన్‌ఒసి లేకుండా నడుపుతున్న 32 పబ్‌లకు నోటీసులు

77 పబ్‌ల తనిఖీ.. గడువులోగా లోపాలు సరిచేయకపోతే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫైర్ సేఫ్టీ నిబంధనలు గాలికొదిలేసి పబ్‌లు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై తెలంగాణ ఫైర్ సర్వీసెస్ శాఖ కఠిన చర్యలకు దిగింది. హైదరాబాద్‌లో 77 పబ్‌లను తనిఖీ చేయగా.. ఫైర్ ఎన్‌ఓసీ లేకుండా నిర్వహిస్తున్న లేదా తీవ్రమైన భద్రతా లోపాలు ఉన్న 32 పబ్‌లకు నోటీసులు జారీ చేసింది. నిర్దేశిత గడువులోగా లోపాలను సరిదిద్దుకోకపోతే తెలంగాణ ఫైర్ సర్వీస్ చట్టం ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మరో 45 పబ్‌లు చెల్లుబాటు అయ్యే ఫైర్ ఎన్‌ఓసీలతో ఉన్నట్లు గుర్తించారు.గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సిఐ)లో పబ్ యాజమాన్యాలు, ప్రతినిధుల కోసం అగ్నిమాపక భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ సర్వీసెస్ డిజి విక్రమ్ సింగ్ మాన్ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో పబ్‌లలో భద్రతా ప్రమాణాలపై అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే వినోద ప్రదేశాల్లో అగ్నిమాపక భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని డిజి విక్రమ్ సింగ్ మాన్ స్పష్టం చేశారు. ఫైర్ ఎన్‌ఒసిలను సకాలంలో పొందడంతో పాటు పునరుద్ధరించుకోవాలని, ఫైర్ అలారం, స్ప్రింక్లర్ తదితర వ్యవస్థలు నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో పనిచేయని అగ్నిమాపక పరికరాలు, ఫైర్ అలారం, స్ప్రింక్లర్ వ్యవస్థలు, అత్యవసర ద్వారాలకు అడ్డంకులు, సరైన ఎగ్జిట్ సూచికలు లేకపోవడం, ప్రమాదకర విద్యుత్ ఏర్పాట్లు వంటి లోపాలను అధికారులు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అధికంగా హాజరయ్యే ప్రదేశాల్లో తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు, అమలు చర్యలను కొనసాగిస్తామని ఫైర్ శాఖ స్పష్టం చేసింది.



## మెదక్ రైల్వే అభివృద్ధిపై ఎంపి రఘునందన్‌రావు చర్చలు

**ఎన్‌సిఆర్ జిఎంతో భేటీ..**

**ప్రాంతీయ రైల్వే ప్రాజెక్టులపై సమీక్ష**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మెదక్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఎంపి మాధవనేని రఘునందన్‌రావు దృష్టి సారించారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్‌లోని ఎస్‌సిఆర్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలో జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో ఆయన భేటీ అయి, తన ప్రాంతానికి సంబంధించిన రైల్వే అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన, కొనసాగుతున్న రైల్వే అభివృద్ధి పనులు, ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రణాళికలపై ఎంపి జీఎంతో చర్చించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రాంత ప్రజలకు మెరుగైన రైలు రవాణా సౌకర్యాలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.

## నాణ్యత లేని ఆహారం విక్రయిస్తే చర్యలు

హోటళ్లు, దాబాలు,రెస్టారెంట్లకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి హెచ్చరిక

**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించే హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, కేఫ్‌ల నిర్వాహకులను ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఉమ్మడి నల్లగొండ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి స్పష్టం చేశారు.ఆహార పరిరక్షణ నిబంధనలు ఉల్లంఘించే వ్యాపార సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.జిల్లాలో జాతీయ రహదారి65 వెంబడి బుధవారం ప్రత్యేక ఆహార పరిరక్షణ తనిఖీలు నిర్వహించారు.అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్.శివ శంకర్ రెడ్డి పలు హోటళ్లు,ధాబాలు,రెస్టారెంట్లు,కేఫ్‌లలో తనిఖీలు చేపట్టారు.చిట్యాల పట్టణంలోని బ్లూ ఫాక్స్ మినర్వా కేఫ్‌లో తనిఖీల సందర్భంగా పలు నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు.ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేయకపోవడంతో గ్రేవీలు,మాంసం,అల్లం, మాం సం ఉత్పత్తులు,మంచూరియా తదితర 55 కిలోల నాణ్యత లేని ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు.ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే విధంగా వ్యవహరించే వ్యాపారులపై ఇకపై మరింత కఠినంగా తనిఖీలు నిర్వహిస్తామని,నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తప్పవని జ్యోతిర్మయి హెచ్చరించారు.తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఆహార పరిరక్షణ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆమె స్పష్టం చేశారు.



# గోదావరి ఒడిలో భద్రాద్రి భవిష్యత్..

● అభివృద్ధికి కొత్తదిశ ఎటు ?

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గోదావరి తీరంలో ఆధ్యాత్మిక వైభవం... అడవుల్లో గిరిజన జీవనం... భూ గర్భంలో అపారమైన ఖనిజ సంపద .. గళగళా ప్రవహించే గోదావరి ఇతర ఉపనదులు, పరిశ్రమలు, సాగుకు విస్తారమైన భూములు ఉన్నప్పటికీ అభివృద్ధి పరంగా భద్రాద్రి కొత్తకూడెం జిల్లా ఇంకా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. ఇప్పుడు జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమాశ్రయం, రైలుమార్గం, సాగునీటి ప్రాజెక్టులు పర్యాటక అభివృద్ధి గోదావరి ఘాట్లు నిర్మాణం వంటి అంశాలు భవిష్యత్‌పై కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

**గగనతల విహంగాలతో మారే ముఖ చిత్రం :** కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు కోసం ప్రత్యేక ప్రత్యామ్నాయ ప్రాంతాల పరిశీలన సోమ, మంగళవారాల్లో పూర్తయింది. విమానాశ్రయం ఏర్పాటు అయితే పారిశ్రామిక పెట్టుబడులు పర్యాటకం వ్యాపార రంగాలకు ఊతం లభిస్తుంది. అయితే స్థల ఎంపిక భూ సేకరణ పర్యావరణ అంశాలు ఏఏఐ బృందం సమర్పించే నివేదికలే కీలకం కానున్నాయి. విమానాశ్రయం ఏర్పాటు పూర్తయితే జిల్లా ముఖచిత్రం కొత్త రెక్కలు రానున్నాయి.

**రైలుబండి రాకతో :** ఒడిస్సాలో రాష్ట్రంలోని మల్కనగిరి నుండి భద్రాచలం మీదుగా ఇప్పటికే అశ్వాపురం మండలంలో ఉన్న తవిసలపుడి రైల్వే ట్రాక్‌కు అనుసంధాన ప్రతిపానలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి సర్వే పూర్తయి కేంద్రానికి డిపిఆర్ కూడా సమర్పించారు. ఇప్పటికే పాండురంగా పురం నుండి సారపాక సాకేతిపురి వరకు రైలు మార్గానికి దారి సుగుమమం అయింది. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మించే రైలు వంతెన ప్రధానంగా కీలకం కానుంది. దీంతో దేశ నలుమూలల నుండి రామాలయానికి యాత్రికుల తాకిడి పెరిగనుంది. ఒకప్రక్క రైలు, మరో ప్రక్క విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లా ముఖ చిత్రం మరో రూపును సంతరించుకుంటుందని విశ్లేషకులు అంటున్నారు.

**గోదావరి వరమా... సవాలా? :** జిల్లాకు గోదావరి ప్రధాన జీవనాడి. ఒకవైపు సాగునీటికి ఆధారం కాగా మరో వైపు వరదల సమయంలో తీవ్ర ప్రభావం చూపుతోంది. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం, భద్రాచలం వద్ద వరద ముంపు వంటి అంశాలపై దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. దీనిపై తెలుగు రాష్ట్రాల పాలకులు ఇప్పటికీ స్పష్టమైన వైఖరి, ప్రకటన చేయకపోవడం ఇక్కడి ప్రజలను తీవ్రంగా కలిచేస్తోంది.

**సాగునీటితో :** సాగునీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే జిల్లాలో వ్యవసాయ రంగం మరింత బలోపేతం కానుంది. సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టులు పూర్తి, చెరువులు పునరుద్దరణ తాలిపేరు ఇత ర కాలువల బలోపేతం సాగునీటి లభ్యత పెంపు ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే అవకాశముంది. అయితే ప్రాజెక్టు నిర్మాణాలతో పాటు చివరి ఎకరాకు కూడా నీరు చేరితే సత్ఫలితాలు సాధించవచ్చు.

**పర్యాటానికి అపార అవకాశాలు :** భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయం పాపికొండలు గోదావరి తీరం అట వీ ప్రాంతాలు గిరిజన సంస్కృతి సంప్రదాయాలు జిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలున్నాయి. 2027 గోదావరి పుష్కరాలను కూడా జిల్లాకు అతిపెద్ద అంశంగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు అడుగులు పడాలి.



**గిరిజన ప్రాంతాల అభివృద్ధే అసలు కొల–మానం :** జిల్లా అభివృద్ధి కేవలం పట్టణాల విస్తరణతో కొలవలేం. మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు వైద్యం విద్య తాగునీరు ఉపాధి అవకాశాలు అందినప్పుడే అభివృద్ధి ఫలాలు పూర్తిగా దరిచేరినట్లు అవుతుంది. విమానాశ్రయం, రైలుమార్గం, సాగనీరు, పర్యాటకం, పరిశ్రమలు. గిరిజనాభివృద్ధి అంశాలను సమన్వయంతో మందుకు తీసుకెళ్లగలిగితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ రాష్ట్రంలో పత్యేక ఆర్థిక పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశముంది. కానీ ప్రతిపాదిత ప్రాజెక్టులు ప్రకటనలకే పరిమితం కాకుండా కాలపరిమితితో అమలు కావడమే అసలైన సవాలు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
10-09-2026
www.prajapaksham.in

‘బేబీ’ జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన మోస్ట్ అవెటెడ్ యూత్ఫుల్ ఎంటర్టైనర్ ‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’. దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.



# ఆనంద్ దేవరకొండ ఫిల్మోగ్రఫీలో బ్యూటిఫుల్ సినిమా



## ‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’ ప్రీ రిలీజ్‌లో విజయ్ దేవరకొండ

‘బేబీ’ జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన మోస్ట్ అవెటెడ్ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ ‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’. దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటైర్‌నమెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ‘ఎపిక్’ చిత్రం, సెప్టెంబర్ 11న థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో తాజాగా హైదరాబాద్ లోని దస్పల్లా హోటల్ లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. విజయ్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరోగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ సెప్టెంబర్ 11న ఆనంద్ దేవరకొండ సినిమా ఉంది. అక్టోబర్ 16న విజయ్ దేవరకొండ సినిమా ఉంది. నవంబర్‌లో దేవరకొండ రష్మిక సినిమా ఉంది. ఇప్పుడు రణబాలి సెట్ నుంచే వచ్చాను. ఈ సంవత్సరం తెలుగు సినిమాకి చాలా చాలా బాగుంది. వరుసగా సినిమాలు విజయం సాధిస్తున్నాయి. సెప్టెంబర్ 11న ఎపిక్ వస్తుంది. ఆ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల ప్యారడైజ్ వస్తుంది. ఆ తర్వాత రణబాలి వస్తుంది. ఆ తర్వాత మైసా, ఈ నగరానికి ఏమైంది 2, ఫౌజీ, దాదా వస్తున్నాయి. ఎపిక్ తో స్టార్ట్ అయ్యి వరస బ్లాక్ బస్టర్లు చూడబోతున్నాం. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ అర్జున్ రెడ్డి ప్రమోషన్స్ సమయంలో మేము అమెరికా వెళ్ళాము. అప్పుడు అక్కడ ఆనంద్ ఐటీ జాబ్ చేస్తున్నాడు. ఆ సమయంలో కలిసినప్పుడు సినిమాల గురించి మాతో మాట్లాడేవాడు. చూస్తే ఐటీ జాబ్ చేస్తున్నాడు, కానీ మాకు ఉన్నంత సినిమా పిచ్చి ఉందేంటని అప్పుడే అనుకున్నాను. కట్ చేస్తే దొరసాని సినిమాతో హీరో అయిపోయాడు.హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అంటే నాకు చాలా ఇష్టం. సెప్టెంబర్ 11న విడుదలవుతున్న ఎపిక్ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటూ అన్నారు.కథానాయకుడు ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ ఎపిక్ అనేది మనందరి సినిమా. 2326 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు మనకి కుటుంబం గురించి, ప్రేమ గురించి, బాధ్యతల గురించి ఆలోచనలు ఉంటాయి కదా. వాటన్నింటినీ రెప్రజెంట్ చేసిన కథ ఇది. సెప్టెంబర్ 10న ప్రీమియర్స్ ఉంటాయి. ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్, ఫ్యామిలీ ఎవరితోనైనా వెళ్ళి సరదాగా ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది అన్నారు.కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ సందీప్ రెడ్డి సినిమాలో హీరో లాంటి అమ్మాయి పాత్ర నేను ఎపిక్ లో పోషించాను.. ఎలా స్ట్రాంగ్‌గా ఉండాలి, ఎలా కాన్ఫిడెంట్ గా ఉండాలి, ఎలా మన కోసం మనం నిలబడాలి లాంటి విషయాలన్నీ నేను కదలి పాత్ర ద్వారా నేర్చుకున్నాను. నా కుటుంబ సభ్యులు, నా స్నేహితుల సపోర్ట్ వలనే నేను ఇక్కడి వరకు వచ్చాను. ఎపిక్ సినిమా సెప్టెంబర్ 11న మీ ముందుకు రాబోతుంది. అన్నారు.నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ రూరల్ తెలంగాణ నుంచి వచ్చిన ఒక సాఫ్ట్ అబ్బాయి, ఒక కాన్ఫిడెంట్ ప్రేమలో పడితే ఎలా ఉంటుంది అనేది దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. సెప్టెంబర్ 10న మీరు మా సినిమాను చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను అన్నారు. దర్శకుడు ఆదిత్య హాసన్ , నటుడు శివాజీ , సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘చిట్ చాట్’లో హీరో సుమంత్

### మూఢ నమ్మకాలను ఎక్స్‌పోజ్ చేసే క్యారెక్టర్



సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్. ‘మహేంద్రగిరి వారాహి’. స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ ప్రత్యేక పాత్రలో కనిపిస్తున్నారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. రాజశ్యామల ఎంటైర్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో సుమంత్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. దర్శకుడు సంతోష్ ఈ కథని సింగిల్ సిట్టింగ్‌లో చెప్పారు. నాకు చాలా నచ్చింది. డైరెక్టర్ సంతోష్కి వేదాలు, పురాణాల పట్ల చాలా మంచి అవగాహన ఉంది. తనకి ఇది చాలా రైట్ సబ్జెక్టు. తను అనుకున్న కథని అంతే అద్భుతంగా తీశాడు. మేము అనుకున్నప్పుడు ఇంత బిగ్ స్కేల్లో తీస్తారని అనుకోలేదు. కాకపోతే వి ఎఫ్ ఎక్స్ పరంగా, థియేటర్ ఎక్స్పీరియన్స్ పరంగా, నటీనటుల పరంగా అన్నీ కలిసి వచ్చాయి. నేను యూట్యూబ్‌లో. ఆ క్యారెక్టర్ గురించి ఇప్పుడే అంతకంటే ఎక్కువ చెప్పకూడదు. ఇది డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్. అలాగే మంచి ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది. కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. సిద్దు ఒక సీరియస్ క్యారెక్టర్ చేశాడు. మా ఇద్దరి మధ్య ఒక సీన్ ఉంటుంది. అది సినిమాకే హైలెట్గా ఉంటుంది. చూసిన వాళ్లందరూ కూడా అది చాలా అద్భుతంగా వచ్చింది అని చెప్పారు. అది సినిమాకి చాలా పెద్ద హెల్ప్ అవుతుంది. ఈ పాత్ర ఒప్పుకున్నందుకు సిద్దుకి థాంక్స్. ‘కార్తికేయ’, ‘కాంతార’ నుంచి ఆ మైథాలజీ ట్రెండ్ మొదలైంది. ఒక సంవత్సరం తర్వాత మధు, ఆ తర్వాత లక్ష్మణ్ వచ్చారు. లక్ష్మణ్ దిల్ రాజుతో చాలా సినిమాలు చేశారు. ట్రైలర్‌లోచూపించినట్టుగా33 ఏళ్లు దాటితే ఆ వంశంలో వ్యక్తులు చనిపోతున్నారు అనేది ‘మురారి’ సినిమా పాయింట్ని గుర్తు చేసినప్పటికీ, ఇందులో కథ, స్క్రీన్ప్లే చాలా భిన్నంగా ఉంటాయి. ఇది కంప్లీట్ గా డిఫరెంట్ సబ్జెక్ట్. సినిమాలో మ్యూజిక్ ఒక హైలెట్‌గా ఉంటుంది.వారాహి అమ్మవారు పవర్ఫుల్. అది మీకు ఈ టైటిల్ విషయంలో ఎలా హెల్ప్ అయింది?ఇందులో ఒక మూడు యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. అలాగే యాక్షన్ బ్లాక్స్ చాలా ఉంటాయి.

## 18న ’కళ్యాణం కమనీయం జీవితం’



విఫై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరోయిన్స్ గా రవి లోకిరెడ్డి డైరెక్షన్‌లో పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ‘కళ్యాణం కమనీయం జీవితం’. ఈ సినిమా ఈ నెల 18న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రాజవంశీ రిలీజ్ చేస్తున్నారు. ‘కళ్యాణం కమనీయం జీవితం‘ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్, నిర్మాతలు కేవిల్ దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ మురళీ కార్తికేయ మాట్లాడుతూ నేను కంపోజ్ చేసిన ఒక పాట వల్ల నాకు ఈ మూవీ అవకాశం వచ్చింది. ఈ సినిమాకు మంచి సాంగ్స్, బిజిఎం అందించే అవకాశం దక్కింది.అన్నారు.ప్రొడ్యూసర్ పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ యూఎస్ లో సాఫ్ట్ వేర్ రంగంలో ఉన్న మాకు సినిమా అంటే ప్యాషన్. మేము గతంలో 24 కిస్సెస్ మూవీ నిర్మించాం. నేను లాభపడకపోయినా ఫర్వాలేదు కానీ నష్టపోవడానికి సిద్ధంగా లేను. మనందరిలో ఒకరికి జరిగే లాంటి కథే ఇది. ఈ నెల 18న థియేటర్స్‌లో రిలీజ్ అవుతున్న మా సినిమాను సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా అన్నారు. డైరెక్టర్ వి.వి.వినాయక్ , ప్రొడ్యూసర్ కేవిల్ దామోదరప్రసాద్ ప్రసన్నకుమార్ , నటి విషిక , డైరెక్టర్ రవి లోకిరెడ్డి . హీరోయిన్ సాహితీ అవంచ , హీరో ఖాన్ దురాని పాల్గొన్నారు.



## ‘ఓం: చాప్టర్1–ఉధిరం’ గ్లింప్స్ రిలీజ్

హీరో ధనుష్ లేటెస్ట్ యాక్షన్ డ్రామా ‘ఓం: చాప్టర్1ఉధిరం’. ఇప్పటి వరకు విడుదలైన టైటిల్ ఫస్ట్ స్ట్రైక్ వీడియో, ‘అలా కా లూవా’ సాంగ్ ఫ్యాన్స్, సినీ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని ఆసక్తిని నింపింది. ఈ క్రమంలో ఓం మూవీలో కీలక పాత్రలో నటించిన మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి స్పెషల్ వీడియో గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ‘ఓం: చాప్టర్1ఉధిరం’ చిత్రంలో మమ్ముట్టి పవర్ఫుల్ రోల్లో కనిపించబోతున్నారు. ఆయన గురించి ఇంటర్పోల్ ఆఫీసర్స్ వెతుకుతుంటే ఆయనేమో తనకేమీ పట్టనట్లు క్రికెట్ మ్యాచ్ చూస్తుండటం వంటి సీన్స్‌ను ఈ బర్త్‌డే స్పెషల్ వీడియోలో చూడొచ్చు. అసలు మమ్ముట్టి పాత్ర ఎలా ఉండబోతుందోనని ఎదురు చూసిన వారందరికీ ఈ సినిమాలో ఆయన పాత్ర చాలా స్టైలిష్గా ఉంటూనే క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. దీంతో సినిమాపై ఉన్న అంచనాలు మరింతగా పెరిగాయి. ధనుష్ పాత్రకు, మమ్ముట్టి పాత్రకు ఎలాంటి కాంపిటీషన్ ఉండబోతుంది.. ఈ రెండు పాత్రలు సిల్వర్ స్క్రీ ఎలా అలరించబోతున్నాయోననే ఆసక్తి పెరిగింది. రాజుకుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఓం: చాప్టర్1 ఉదిరం: ది బ్లడ్ ఉడ్ ప్రతిష్టాత్మక కాంబినేషన్‌లో రూపొందుతోంది. ఈ చిత్రంలో ధనుష్, సాయి పల్లవి, శ్రీలీల, మమ్ముట్టి, నసీరుద్దీన్ షా, ఇంద్రన్స్ వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. వండర్ బార్ ఫిలిమ్ ఆర్ స్టూడియోస్ బ్యానర్‌పై శ్రద్ధా అగర్వాల్, ధనుష్, అజ్మత్ జగ్మగ్ నిర్మిస్తోన్న ఈ సినిమా అక్టోబర్ 16న వరల్ వైడ్‌గా రిలీజ్ అవుతోంది.

## ‘సోగ్గాడిలా’ పాట ఆవిష్కరణ




శరణ్యసుధీక్ష సమర్పణలో స్కంద ఫిలిమ్స్ బ్యానర్ మీద ‘మన డాక్టర్ బాబే’ అనే సినిమాని కృతాక్షి నిర్మిస్తున్నారు. ఈ మూవీతో శ్రీ స్కంద హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో మోహన సిద్ది, శ్రుతి శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకి తెరు చలపతి కుమార్ పువ్వల స్కోరీ, స్క్రీన్‌ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ‘సోగ్గాడిలా’ అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు.‘సోగ్గాడిలా’ సాంగ్ ఎంతో ప్లెజెంట్‌గా అనిపిస్తోంది. ఈ పాటలో హీరో చుట్టూ హీరోయిన్ తిరగడం, హీరోయిన్ చేసే అల్లరి అన్నీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ పాటకు గిరిధర్ రాగోలు సాహిత్యం.. లిప్సిక, సుధాన్షు గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మనోజ్ కుమార్ బూసం ఇచ్చిన బాణీ ఎంతో క్యాచీగా ఉంది. గ్రామీణ వాతావరణం ఈ వీడియో సాంగ్లో మరింత అందంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి కిషోర్ బోయిడపు కెమెరామెన్‌గా, సెల్వ కుమార్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు.

## మణిపురి సంగీత కళాకారుడి హత్యపై

# నిష్పక్షపాత విచారణకు సిపిఐ డిమాండ్

**ఢిల్లీలో దిగజారిన శాంతిభద్రతలు ప్రజారక్షణలో పోలీసు వైఫల్యానికి తార్కాణం**



**న్యూఢిల్లీ:** దక్షిణ ఢిల్లీలో నివసిస్తున్న మణిపురి సంగీత కళాకారుడు థోంగ్ థమ్ విక్రమ్ సింగ్‌ను అల్లరిమూక క్రూరంగా హత్యచేయడాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శివర్గం తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై తీవ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఢిల్లీలో రోజు రోజుకూ క్షీణిస్తున్న శాంతి భద్రతల పరిస్థితికి, పెరుగుతున్న అరాచకత్వానికి ఈ క్రూరహత్య ఒక ప్రత్యక్ష తార్కాణంగా నిలిచిందని విమర్శించింది.దేశ రాజధానిలో కేంద్రహోం మంత్రి అమిత్ షా కనుసన్నల్లో ప్రత్యక్షంగా విధులు నిర్వహించే పోలీసులు, పౌరుల శాంతిభద్రతల విషయంలో విఫలమయ్యారని సిపిఐ ఒక ప్రకటనలో విమర్శించింది. ఈ హత్య దిగ్భ్రాంతికరంగా ఉందని, పోలీసులను జవాబుదారీ చేయాలని కోరింది. థోంగ్ థమ్ విక్రమ్ సింగ్ ఆ ప్రాంతంలో అనేక సంవత్సరాలుగా నివసిస్తున్నారని,తన ఇంటి బయట తీవ్రమైన శబ్దాలు వస్తున్నందువల్ల అభ్యంతరం చెప్పినందుకు ఒక మూక ఆయనను తరిమి కొట్టిందని, ఆయనను మూడు అంతస్తుల పైకి పరుగులు తీసేలా వెంటాడి తరిమిందని, ఆయనపై దాడిచేసి కొట్టి చంపారని పేర్కొంది. ఆయనకు గతంలో కూడా బెదిరింపులు వచ్చాయన్న వార్తలు విన్నప్పుడు ఈ ఘటన మరింత ఆందోళన కలిగిస్తోందని, ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరింది. ప్రజలకు పోలీసులు రక్షణ ఇవ్వడంలో విఫలమయ్యారని, అదే సమయంలో జవాబుదారీ కోరినవారిపై పోలీసులు హింసకు పాల్పడుతున్నారని సిపిఐ విమర్శించింది. ఒక నివాసిత ప్రాంతంలో మూకలు ఈ విధంగా ఎలా హింస సృష్టించగలిగారు?దేశ ఈశాన్యప్రాంత ప్రజలపట్ల ఈ ప్రాంతంలో వివక్ష ప్రబలిందన్న వార్తలు ఉన్నాయని, ఇది చాలా ఆందోళన కలిగించే విషయమైనందువల్ల దీనిపై సమగ్ర విచారణ నిష్పక్షపాతంగా జరపాలని కోరింది.బాధ్యులైనవారికి తగిన గుణపాఠం నేర్పే విధంగా,మళ్ళీ ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేవిధంగా కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసు వైఫల్యానికి జవాబుదారీ ఉండాలని పార్టీ కోరింది. హత్యకు గురైన విక్రమ్‌సింగ్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ తెలియజేస్తూ, థోంగ్‌థమ్ స్నేహితులు అభిమానులకు సానుభూతి ప్రకటించింది. ఈ విషాద సమయంలో ఈశాన్యప్రాంత ప్రజలకు సిపిఐ సంఘీభావం ప్రకటిస్తోందని ప్రకటన పేర్కొంది.

## భరోసా కల్పించండి

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నేతలు వినతిపత్రంలో పేర్కొన్నారు. శాసనసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారితోపాటు, అసెంబ్లీ వెలుపల జరిగిన ఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రులు, కాంగ్రెస్ నేతలు గవర్నర్‌ను కోరారు. కేవలం ఘటనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిపైనే కాకుండా వాటి వెనుక ఉన్న అసలు బాధ్యులు, బిఆర్ఎస్ అగ్రనాయకత్వంపైన కూడా చర్యలు తీసుకునేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. దళితులు, మహిళల గౌరవం, ఆత్మగౌరవాన్ని కాపాడటంతోపాటు రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సంప్రదాయాలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు గవర్నర్‌ను కోరారు. సెప్టెంబరు 8న శాసనసభలో జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్నాయని గవర్నర్‌కు మంత్రులు వివరించారు.

## యువత ఉద్యమించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ, నిరుద్యోగాన్ని విపరీతంగా పెంచి పోషిస్తోందని ఆయన ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఉన్న ఉద్యోగాలకే ఎసరు పెట్టారని తీవ్రస్థాయిలో విమర్శించారు.ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న ఆర్థిక అసమానతలు, నిరాశ నిస్పృహల నేపథ్యంలో సోషలిజం భావజాలం, వామపక్ష ఉద్యమాలు తిరిగి బలపడుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో వచ్చిన జెన్ జీ వంటి సోషల్ మీడియా ఆధారిత ఉద్యమాలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తే ఇటువంటి ఉద్యమాలకు దారితీస్తోందని వ్యాఖ్యానించారు. యువత కేవలం పండుగలు, శుభాకాంక్షలకే పరిమితం కాకుండా, వర్గ చైతన్యాన్ని పెంచేలా సోషల్ మీడియాను ప్రజా ఉద్యమాలకు మలచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**కేంద్ర విధానాలు, విద్యా వ్యవస్థ కాషాయీకరణపై ధ్వజం**

విద్యా వ్యవస్థను తీవ్రంగా కాషాయీకరణ చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని, విద్యకుఉద్యోగానికి సంబంధం లేని వాతావరణాన్ని సృష్టించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక, అప్పుల పాలై యువత నైరాశ్యంలో కూరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలలో విద్యార్థి సంఘాల ఎన్నికలను రద్దు చేస్తూ విద్యార్థి శక్తిని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మాన్ని రుద్దాలని చూసిన బిజెపికి గత ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు.

**ప్రజాప్రతినిధుల నేరచరిత్రపై ఆందోళన**

నేడు చట్టసభల్లో 30 నుంచి 50 శాతం వరకు నేరచరిత్ర కలిగినవారు, మాఫియా శక్తులే ప్రజాప్రతినిధులుగా ఏలుతున్నారని, ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందని విమర్శించారు. డబ్బు, మద్యంతో గెలుపొందుతున్న ఇటువంటి శక్తులను అడ్డుకోవాల్సిన బాధ్యత యువజన సమాఖ్యలపై ఉందన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు, 21 ఏళ్లకే పోటీ చేసే హక్కు సాధించిన చరిత్ర ఎఐవైఎఫ్ ఉద్యమాలదేనని గుర్తుచేశారు. ఈ మహాసభల ద్వారా యువత, ముఖ్యంగా మహిళా యువకులు పెద్ద సంఖ్యలో ఉద్యమాల్లోకి వచ్చి ప్రజాస్వామ్య రక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు.

## ఎర్రజెండా ఇంజన్ కావాలి

(మొదటి పేజీ తరువాయి)



ఆహ్వాన సంఘం అధ్యక్షుడు యానాల దామోదర్ రెడ్డి స్వాగత ఉపన్యాసం చేశారు. అంతకు ముందు యువజన సంఘ జెండాను ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్ జిందర్ మహేశ్వరీ ఎగురవేయగా, అమరవీరుల స్థుపానికి మూటకొండూరు మాజీ సర్పంచ్, సాయుధ పోరాట యోధులు రేగు సిద్ధయ్య పూలమాల వేసి ఘనంగా జోహార్లతో నివాళులర్పించారు. అనంతరం సభలో సంతాప తీర్మాణాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్ ప్రవేశపెట్టారు. ఈ ప్రతినిధుల సభకు అధ్యక్ష వర్గంగా వలి ఉల్లా ఖాద్రీ, గంగోత్రి, ఉమా, మమత, కునుకుట్ల శంకర్, తీర్పారీ వెంకటేశ్వర్లు, బిజ్జా శ్రీనివాసులు, పేరబోయిన మహేందర్ వ్యవహరించారు. ముఖ్యఅతిధులుగా హాజరైన మాజీ యువజన నాయకులు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖ్ జిందర్ మహేశ్వరీ ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో పోరాటానికి సిద్ధమవుతున్న జెన్‌జెడ్, ఆల్ఫా తరాలు చిన్న ఇంజన్ల వంటివని, అవే ట్రిపుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని విఫలం చేసే స్థాయికి వచ్చాయని మహేశ్వరీ వ్యాఖ్యానించారు. యువతలో పెరుగుతున్న అసంతృప్తి, ఆగ్రహాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటనను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. బిజెపి పాలిత, బిజెపియేతర రాష్ట్రాలంటూ రాజకీయ ప్రచారం చేయడం కాకుండా ప్రజల భద్రత, సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, యువతను మతం పేరుతో విభజించే రాజకీయాలకు బదులు ఉపాధి, విద్య, భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశాన్ని ‘హిందూ రాష్ట్రం’గా కాకుండా ‘కార్పొరేట్ రాష్ట్రం’గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తున్న ‘హిందూ రాష్ట్రం’ వెనుక ఉన్న వాస్తవాన్ని యువతకు వివరించాలని ఏఐవైఎఫ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2014లో అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని మహేశ్వరి ప్రశ్నించారు. 12 ఏళ్ల పాలనలో 24 కోట్ల ఉద్యోగాలు రావాల్సి ఉండగా ఆ స్థాయిలో ఉపాధి కల్పించలేదని విమర్శించారు.

**‘బనేగా’ చట్టం కోసం ఉద్యమం**

దేశంలో పనిచేసే సామర్థ్యం, అర్హత ఉన్న ప్రతి యువకుడికి ఉపాధి హామీ కల్పించేలా పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. ఇందుకోసం ‘బనేగా’ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు. ‘భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ యాక్ట్’ పేరుతో ఉపాధి హామీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం ముస్లిం, హిందూ, తెలుగు, తమిళ, బెంగాలీ, బిహారీ, గుజరాతీ అనే తేడా లేకుండా దేశంలోని యువత అందరికీ ఉపాధి కల్పించేలా ఉండాలని అన్నారు. “విభజించి పాలించే రాజకీయాలకు వ్యతిరేకంగా యువతను ఏకం చేయడమే బనేగా లక్ష్యం. లుంగీ ధరించినా, పగడీ కట్టినా, ప్యాంట్ వేసుకున్నా, తిలకం పెట్టుకున్నా.. యువత అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలి” అని పిలుపునిచ్చారు.

**తెలంగాణ యువత విదేశాల బాట పట్టాల్సిన దుస్థితి**

తెలంగాణలోనూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని మహేశ్వరి అన్నారు. ఉపాధి కోసం రాష్ట్ర యువత సౌదీ అరేబియా, ఖతార్, దుబాయ్, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.విదేశాలకు వెళ్లేందుకు కొందరు రూ.10 లక్షలు, మరికొందరు రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు అప్పులు చేస్తున్నారని, ట్రావెల్ ఏజెంట్ల మోసాలకు అనేక మంది యువత బలవుతున్నారని పేర్కొన్నారు. ఎంజీనరేగా వంటి ఉపాధి హామీ పథకాలను కేంద్ర ప్రభుత్వం బలహీనపరిచిందని ఆయన ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులు, గిగ్ వర్కర్లు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ వేదికలపై పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ శాఖల మాదిరిగానే ఏఐవైఎఫ్ సంస్థాగత నిర్మాణాన్ని గ్రామాలు, పట్టణాలు, మొహల్లాల స్థాయిలో బలోపేతం చేయాలని మహాసభ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. యువత సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వారిని సంఘటితం చేసి, ఉపాధి, విద్య, సామాజిక న్యాయం కోసం పోరాటాలను నిర్మించాలని సూచించారు. దేశ యువతను మతం, ప్రాంతం, భాష పేరుతో విభజించే రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా ఉపాధి, సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కేంద్రంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు.

**ఎఐవైఎఫ్ చేపట్టే ప్రతి ఐక్య పోరాటానికి డివైఎఫ్ఐ పూర్తి మద్దతు: ఆనగంటి వెంకటేశ్**



దేశంలోనూ, తెలంగాణ రాష్ట్రంలోనూ నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేందుకుఎఐవైఎఫ్ తో ఐక్య ఉద్యమాలు డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ తెలిపారు. ఎఐవైఎఫ్ చేపట్టే ప్రతి ఐక్య పోరాటానికి డివైఎఫ్ఐ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని స్పష్టం చేశారు.

**యువత ఐక్యపోరాటాలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ: జ్యోతి**



దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి, యువతకు ఉపాధి అవకాశాలు సాధించుకోవడానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమని మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తూ, అవినీతి మరియు లంచగొండితనాన్ని పెంచి పోషిస్తోందని జ్యోతి మండిపడ్డారు.దేశంలో మహిళలు, యువతులు, చిన్నారులపై అత్యాచారాలు, హింస తీవ్రస్థాయికి చేరాయని, వీటన్నింటికీ వ్యతిరేకంగా యువత ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కాగా ఈ ప్రతినిధుల సభలో ఎఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, యుగంధర్, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమీద్ది శ్రీనివాస్ సౌహార్ద సందేశాలు ఇచ్చారు. తెలుగులో అనువదించిన ఏఐవైఎఫ్ నియమ నిబంధనల పుస్తకాన్ని ఆ సంఘం జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రోషన్ కుమార్ సిన్హా, సుఖ్‌జిందర్ మహేశ్వరి లు ఆవిష్కరించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ మాజీ సర్పంచ్ రేగు సిద్దయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రి, కల్లూరి ధర్మేంద్ర, జిల్లా అధ్యక్షులు ఎండి నహీం, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్ ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు,జిల్లా సహాయ కార్యదర్శులు బొలగానీ సత్యనారాయణ,చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళెం కృష్ణ, బండి జంగమ్మ, ఏ ఐ వై ఎఫ్ ఆఫీస్ బేరర్స్ బద్దుల శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, బెల్లి శ్రీకాంత్, సుద్దాల సాయికుమార్, సునీల్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, బంగారు, గోపగాని రాజు, ప్రణయ్, కంబాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com